www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




జిన్‌పింగ్‌కు ఘనమైన స్వాగత ఏర్పాట్లు

యెమెన్ రెడ్ సీ కోస్ట్ హౌతీల స్వాధీనం

వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు డిమాండ్ **08**

సంపుటి 09, సంచిక: 294 | గురువారం | 24 -09-2026 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

‘సర్’పై సహ కమిషనర్ల అభ్యంతరాలు

# పట్టించుకోని జ్ఞానేశ్‌కుమార్



- 10 నెలల వ్యవధిలో 14 సార్లు అభ్యంతరం తెలిపిన ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి
- ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ సంచలన కథనం
- చర్చల్లో భిన్నాభిప్రాయాలు సహజమేనని సమర్థించుకున్న ఇసి

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ‘ప్రత్యేక ముమ్మర సవరణ’ (సర్) ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కొరవడింది. నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకున్నారు. ఈ మేరకు ఆంగ్ల దినపత్రిక ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ దినపత్రిక పరిశోధనాత్మక సంచలన కథనం ప్రచురించింది. ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. తమకు తెలియకుండా లేదా తమ ఆమోదం లేకుండా ఎన్నికల కమిషన్ పేరుతో జారీ చేసిన నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, అభ్యంతరాలు నమోదు చేశారని ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ తన కథనంలో పేర్కొంది. ఒకే రోజున నాలుగు అభ్యంతరాలతో సహా ఓటర్ల నమోదు, తొలగింపు, చట్టబద్ధమైన ఫారం 6లో మార్పులు, కమిషన్ ఓటర్ల డేటా బేస్ పనితీరుతో సహా ఓటర్ల జాబితా నిర్వహణలోని కీలక అంశాలకు సంబంధించినవి ఆ ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాల్లో ఉన్నాయని తెలిపింది. ఢిల్లీలో ఓటర్ల జాబితా డేటా బేస్ ‘క్రమంగా కేంద్రీకరించడం’పై కూడా సంధు, జోషి ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలను నిర్వహించడానికి ఉపయోగించే వ్యవస్థకు రాష్ట్ర స్థాయి అధికారులకు సరైన ప్రాప్యతను నిరాకరిస్తున్నారని వారు ఆరోపించినట్లు ఆ నివేదిక పేర్కొంది. ఒక సందర్భంలో, ఓటర్ల జాబితాలను నిర్వహించే ఐటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనుల కేటాయింపులో తరువాయి 8లో

## సిఇసి తక్షణమే రాజీనామా చేయాలి

సిపిఐ డిమాండ్

రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం(ఇసి)పై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్న ఓటర్ల జాబితాల ప్రక్షాళనకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్‌కుమార్ ప్రతీకగా నిలిచారని, ఆయనకు ఆ పదవిలో కొనసాగే హక్కు ఎంతమాత్రం లేదని, ఇసిపై ప్రజల విశ్వాసాన్ని, విశ్వసనీయతను పునరుద్ధరించాలంటే జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాల్సిందేనని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఇక్కడ ఒక ప్రకటన తరువాయి 8లో

## జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలి

‘సర్’లో ఏకపక్ష నిర్ణయాలపై ప్రతిపక్షాలు ధ్వజం



‘సర్’ నిర్ణయాలను ఎన్నికల కమిషన్‌లో ఏకపక్షంగా తీసుకున్నారని ఓ అంగ్ల పత్రికలో వచ్చిన కథనంతో ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దేశంలో ఎన్నికల ప్రక్రియను బలహీనపరిచిన ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ఓటు చోరీ చేస్తూ ఎన్నికల్లో గెలుస్తున్నారని ఆరోపించాయి. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నికల సంఘం తరువాయి 8లో

సిఇసి, ఇసిల నియామక పిటిషన్లపై

## సుప్రీంకోర్టులో భిన్నాభిప్రాయాలు



ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి), ఎలక్షన్ కమిషనర్(ఇసి)ల ఎంపిక ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి నివేదించడంపై సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ ప్రక్రియ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)ని తప్పించి, ఆ స్థానాన్ని ప్రధాన మంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రితో భర్తీ చేయాలంటూ 2023లో వెలువడిన చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్‌చంద్ర తరువాయి 8లో

పదిరోజులు వారబందీగా

# జూరాలకు నీరు

కర్ణాటక ముఖ్యమంత్రి హామీ



- ఆయకట్టు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డి.కె. శివకుమార్‌కు వివరించిన రాష్ట్ర మంత్రులు వాకిటి, జూపల్లి
- నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి, సిఎస్‌ను ఆదేశించిన కర్నాటక సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలకు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సానుకూలంగా స్పందించారని తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని 10 రోజుల పాటు వారబందీ విధానంలో నీటిని విడుదల చేస్తామని కర్ణాటక సిఎం హామీ ఇచ్చారని వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు వద్ద నీటి మట్టం తగ్గిపోవడం, ఎల్‌నినో ప్రభావంతో దక్షిణ తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, జూరాల ఆయకట్టు పరిధిలో సాగునీటి కోసం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కర్ణాటక సిఎంకు వివరించినట్లు మంత్రులు తెలిపారు. నిన్న సాయంత్రం, ఇవాళ ఉదయం రెండు దఫాలుగా కర్ణాటక డి.కె. శివకుమార్‌తో సమావేశమై తెలంగాణ పరిస్థితిని వివరించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రతినిధుల విజ్ఞప్తిపై స్పందించిన కర్ణాటక సిఎం వెంటనే ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. చలువరాయస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. షాలిని రాజనీష్‌తో మాట్లాడారని తెలిపారు. తెలంగాణకు సహాయం చేయాలని, సాధ్యమైనంత తరువాయి 8లో

## ‘ఎడమ’ ఆయకట్టుకు నీటి విడుదల



ప్రజాపక్షం/అమరచింత

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ ఆయకట్టుకు బుధవారం ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ సొసైటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువను సందర్శించి ప్రాజెక్టు అధికారులచే నీటిని విడుదల చేయించారు. ఈ సందర్భంగా నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. ఎడమ కాలువ నుంచి 900 క్యూ సెక్కుల నీరు ఇవ్వడంతో రైతులను పంటలను పండించేందుకు తరువాయి 12లో



# రెండు డిఏలకే సుముఖత

**ఉద్యోగుల జెఎసి తీవ్ర అసంతృప్తి – చర్చలు విఫలమైనట్లు ప్రకటన**

- ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల డిమాండ్లపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- పిఆర్‌సి నివేదిక, కమిటీల ఏర్పాటుపైనా కాలపరిమితితో కూడిన స్పష్టత ఇవ్వలేదని ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల డిమాండ్ల అంశంపైన రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడం పట్ల తెలంగాణ ఉద్యోగుల జెఎసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైనట్టు ప్రకటించింది. రెండు డిఎలను విడుదల చేసేందుకు మంత్రివర్గానికి ప్రతిపాదిస్తామని, సిపిఎస్ రద్దు విషయంలో కమిటీ ఏర్పాటు చేస్తామని, పిఆర్‌సి నివేదికను సాధ్యమైనంత త్వరగా తెప్పించుకుంటామని, పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు స్పష్టం చేసినట్టు తెలిసింది. పిఆర్‌సి నివేదిక, కమిటీల ఏర్పాటు విషయంలో కాల పరిమితితో కూడిన స్పష్టత ఇవ్వలేదని ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో బుధవారం జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఎటువంటి స్పష్టత రాలేదు. చర్చలో తీసుకున్న నిర్ణయాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. తొలుత పిఆర్‌సి కమిటీ చైర్మన్‌తో సంజయ్ జాజు సమావేశమయ్యారు. అనంతరం ఉద్యోగులతో చర్చలు జరిపారు. ఈ సమావేశనంతరం టిజిఇజెఎసి నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. టిజిఒ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు.

**నేడు రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశం..టిజి ఇ జెఎసి**

ఉద్యోగ, ఉపాధ్యాయు గెజిటెడ్, తరువాయి 12లో

## ఇక ‘మీ సేవ’ ఇంటి ముంగిటకే



- 1100 టోల్ ఫ్రీ లేదా పోర్టల్ ద్వారా స్లాట్ బుకింగ్
- తొలి దశలో క్యూర్ ప్రాంతాల్లో డోర్ డెలివరీ.. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ


ప్రజాపక్షం/హైదరాబాద్

పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరానికి చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నుంచి ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజిఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ల వరకు పలు ‘మీ సేవ’ సేవలను ఇక ప్రజల ఇంటి ముంగిటకే అందించేందుకు ‘మీ సేవా డోర్ డెలివరీ తరువాయి 12లో

రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ **03**

ఇరాన్‌తో చర్చలు

# ఫలవంతం!






- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన
- ఖతార్ మధ్యవర్తిగా మూడు గంటలు అమెరికా–ఇరాన్ చర్చ

**న్యూయార్క్ :** ఇరాన్‌ను నిర్మూలిస్తామంటూ డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలమధ్య ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కీలక సమావేశాల నేపథ్యంలో అమెరికా–ఇరాన్ మధ్య మూడు గంటలసేపు సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ సమావేశం తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ,మధ్యవర్తి దేశం ఖతార్ సహాయంతో మూడు గంటలసేపు ఇరు దేశాల ప్రతినిధులమధ్యా ఫలవంతమైన చర్చలు జరిగాయని చెప్పారు. గడచిన జూన్‌లో రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం విఫలమైన తర్వాత మళ్ళీ మొదటిసారి జరిగిన ఈ సమావేశాన్ని ఒక సానుకూల పరిణామంగా చూస్తున్నారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి–ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ మధ్య సుదీర్ఘ సమావేశంలో ప్రత్యేక పురోగతి సాధించిన దాఖలాలు కనిపించలేదు. అమెరికా తన దురాక్రమణ చర్యలు ఆపేయాలని ఇరాన్ పునరుద్ఘాటించింది. నిర్మాణాత్మకంగా,ఆశాజనకంగా ఉంటాయని భావించిన ఒక విడత చర్చలు పూర్తయ్యాయని విట్‌కాఫ్ చెప్పారు. ఇరుపక్షాల మధ్యా రోజంతా మధ్యవర్తులు అటూ ఇటూ తిరుగుతూ పరస్పర సందేశాలను చేరవేశారని తరువాయి 8లో



# ఎన్నికల సంఘంపై అనుమానం.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణాధారం. ఎన్నికలు సక్రమంగా జరిగాయా అనే ప్రశ్నకు సమాధానం చెప్పే సంస్థ ఎన్నికల సంఘం. అందుకే ప్రభుత్వం మీద, అధికార పార్టీ మీద, ప్రతిపక్షాల మీద, అభ్యర్థుల మీద ప్రజలకు అనుమానాలు రావచ్చు. కానీ ఎన్నికల సంఘం మీదే అనుమానం మొదలైతే సమస్య పరిధి 'ఎన్నికల ప్రక్రియ'ను దాటి, రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయత వరకు వెళుతుంది. ఎన్నికల ఫలితం నచ్చకపోవడం ఒక రాజకీయ సమస్య. ఓటు హక్కును నిర్వహించే సంస్థ నిష్పాక్షికతపై సందేహం కలగడం మాత్రం ప్రజాస్వామ్య సమస్య. ఇటీవల వెలుగులోకి వచ్చిన పరిణామాలు ఈ తేడాను గుర్తించాల్సిన అవసరాన్ని పెంచుతున్నాయి. గత పది నెలల్లో ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల సంఘంలోని ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఓటర్ల జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, ఓటర్ల డేట్‌బేస్‌పై నియంత్రణ, ఫామ్6 మార్పులు, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల తొలగింపులపై దాఖలైన అప్పీళ్లు తదితర అంశాల్లో కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని బుధవారం 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రచురితమైన ఓ పరిశోధనాత్మక నివేదిక పేర్కొంది. కొన్ని సందర్భాల్లో తమకు సమాచారం లేకుండానే నిర్ణయాలు లేదా ఉత్తర్వులు వెలువడ్డాయని వారు వ్యాఖ్యానించినట్టు ఆ నివేదిక తెలిపింది. ఆ ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాల్లో ఉచితానుచితాలు ఎలావున్నా, వారి అభ్యంతరాలపై స్పందన ఏమిటి? ఏ నిర్ణయాన్ని ఎవరు తీసుకున్నారు? ఏ చట్టపరమైన అధికారంతో తీసుకున్నారు? ఆ నిర్ణయంలో మొత్తం కమిషన్‌కు సమాచారం ఉందా? ఉంటే దాని రికార్డు ఎక్కడ ఉంది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం రావాలి. ఎందుకంటే ఎన్నికల సంఘం ఒక వ్యక్తి కార్యాలయం కాదు. అది రాజ్యాంగబద్ధమైన బహుసభ్య సంస్థ. ప్రత్యేకించి ఓటర్ల జాబితా విషయంలో ఈ ప్రశ్నలకు మరింత ప్రాధాన్యం ఉంది. 'సర్' కింద దేశవ్యాప్తంగా కోట్లాది పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి మాయమయ్యాయి. తాజా నివేదిక ప్రకారం 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ రోల్స్‌లో కనిపించడం లేదు. అభ్యంతరం, విచారణ, అప్పీల్ వంటి ప్రక్రియలు ఉంటాయి కాబట్టి, డ్రాఫ్ట్ జాబితా నుంచి పేరు తొలగించడమంటే ఓటు హక్కు కోల్పోవడమేనని చెప్పలేం. కానీ ఒక పౌరుడి పేరు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన క్షణం నుంచి అతని ఓటు హక్కును తిరిగి నిరూపించుకోవాల్సిన భారం మొదలవుతుంది. అందుకే ఇటువంటి ప్రక్రియలో పారదర్శకత అత్యంత కీలకం. పశ్చిమ బెంగాల్ పరిస్థితి ఈ ఆందోళనకు స్పష్టమైన ఉదాహరణ. ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు సమర్పించిన వివరాల ప్రకారం 'సర్' సందర్భంగా 27.16 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. వారిలో 22.21 లక్షల మంది తిరిగి తమ పేర్లు చేర్చాలని అప్పీల్ చేశారు. మరో 16.10 లక్షల అప్పీళ్లు ఇప్పటికే చేర్చిన పేర్లను తొలగించాలని కోరుతూ దాఖలయ్యాయి. మొత్తం అప్పీళ్ల సంఖ్య 38.31 లక్షలకు చేరింది. ఇంత భారీ సంఖ్యలో పౌరులు తమ ఓటు హక్కును తిరిగి నిర్ధారించుకోవాల్సిన దుస్థితి ఏర్పడినప్పుడు, ప్రతి చర్య వెనుక స్పష్టమైన అధికారం, కారణం, రికార్డు ఉండాలి. మరీ ముఖ్యంగా, ఒక న్యాయాధికారి ఓటరును జాబితాలో చేర్చిన తర్వాత ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఎన్నికల సంఘం తరఫున ఎవరు అప్పీల్ చేశారు? వారికి ఆ అధికారం ఎవరు ఇచ్చారు? ఆ ప్రక్రియ గురించి కమిషన్‌లోని ఇతర సభ్యులకు సమాచారం ఉందా? అనే ప్రశ్నలు లేవనెత్తినట్లు వచ్చిన వార్తలను సాధారణ 'పరిపాలనా సూచనలు'గా కొట్టిపారేయడం తగదు. అదే విధంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే 'ఫామ్ 6'లో చేసిన మార్పులపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు గత 'సర్' ఓటర్ల జాబితాలో ఉన్నాయా అనే అంశాన్ని కొత్త దరఖాస్తుదారుడితో సంబంధం పెట్టే రీతిలో ప్రశ్నగా నివేదికలు చెబు తున్నాయి. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఈ మార్పుకు చట్టపరమైన ఆధారం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. ఇది ఒక సాంకేతిక అంశంలా కనిపించవచ్చు. కానీ ఓటర్ల జాబితాలో సాంకేతికతే హక్కును నిర్ణయించే స్థాయికి చేరితే అది సాంకేతిక సమస్యగా మిగలదు. ఎన్నికల సంఘం స్వయంగా దశాబ్దాలుగా ఓటర్ల జాబితా నిర్వహణలో వికేంద్రీకరణ ఒక రక్షణ వ్యవస్థగా ఉందని చెప్పుకొచ్చింది. ఇప్పుడు రాష్ట్రస్థాయి చట్టబద్ధ అధికారుల డేటాబేస్ ప్రాప్యతను కేంద్రీకరించడం, డిజిటల్ వ్యవస్థలో స్థానిక అధికారుల నిర్ణయాలను నమోదు చేయలేని పరిస్థితి ఏర్పడటం వంటి అంశాలపై అంతర్గతంగా అభ్యంతరాలు వచ్చాయని నివేదికలు చెబుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం అంతర్గత నోట్లను, అభిప్రాయ భేదాలను సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగంగా అభివర్ణించింది. తుది నిర్ణయాలు మొత్తం కమిషన్ ఆమోదంతో ఏకగ్రీవంగా తీసుకున్నామని కూడా స్పష్టం చేసింది. ఈ వివరణను పరిగణనలోకి తీసుకోవాలి. అయితే అదే సమయంలో అధికారికంగా నమోదైన అభ్యంతరాలు, వాటిపై తీసుకున్న నిర్ణయాలు, వాటిని అధిగమించి ఉత్తర్వులు జారీ అయితే దానికి ఉన్న చట్టపరమైన ఆధారం వంటి వివరాలు ప్రజలకు అందుబాటులోకి రావడం కూడా అవసరం. ఒక సంస్థ తన నిష్పాక్షికతను కేవలం ప్రకటనతో కాకుండా రికార్డులతో నిరూపించాలి. ఇప్పుడు రాజకీయ నిందారోపణ కాదు.. సంస్థాగత ఆత్మపరిశీలన అవసరం. మొదటగా, కమిషన్‌లోని ప్రతి ముఖ్య నిర్ణయానికి పూర్తి డిజిటల్ ఆడిట్ ట్రెయిల్ ఉండాలి. ఎవరు ప్రతిపాదించారు? ఎవరు అభ్యంతరం చెప్పారు? ఎవరు ఆమోదించారు? ఏ చట్టాన్ని ఆధారంగా తీసుకున్నారు? తుది నిర్ణయం ఎలా వచ్చింది? అన్న వివరాలు భద్రంగా నమోదు కావాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మాత్రమే కాకుండా, అవసరమైన కాలపరిమితి వరకు ఆ రికార్డులను స్వతంత్ర ఆడిట్‌కు అందుబాటులో ఉంచాలి. అంతేకాదు, ఓటర్ల డేటాబేస్‌పై ఒకే స్థాయి లేదా ఒకే కార్యాలయానికి అధిక నియంత్రణ ఉండకూడదు. ఓటర్ల పేర్ల తొలగింపులో 'ముందుగా తొలగింపు, తర్వాత వివరణ' అనే విధానం ఉండకూడదు. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో విభేదాలు వచ్చినప్పుడు వాటిని దాచిపెట్టడం కంటే వ్యవస్థీకృతంగా నమోదు చేయడం అవసరం. అదే విధంగా, ఎన్నికల సంఘం నియామక వ్యవస్థపై కూడా విస్తృతమైన సంస్థాగత చర్చ అవసరం. ఎన్నికల సంఘాన్ని రక్షించడం అంటే దాని ప్రతి నిర్ణయాన్ని సమర్థించడం కాదు. కానీ, ప్రతి నిర్ణయం వెనుక హేతుబద్ధత ఉండాలి. స్వతంత్ర ఎన్నికల సంఘానికి బలమైన న్యాయపరమైన పర్యవేక్షణ, పార్లమెంటరీ జవాబుదారీతనం, స్వతంత్ర సాంకేతిక ఆడిట్, పారదర్శక రికార్డులు, పౌరులకు సమర్థవంతమైన అప్పీల్ వ్యవస్థ వంటివి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక కాగితంపై గుర్తు కాదు. అది పౌరుడు తన ప్రభుత్వాన్ని నిర్ణయించుకునే రాజ్యాంగ హక్కు. ఆ హక్కును నిర్వహించే సంస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం పారదర్శకతతో వస్తుంది. తప్పును సరిదిద్దే ధైర్యంతో వస్తుంది. ఎన్నికల కమిషన్ పేరుతో వివరణ సంతృప్తికరమైన సమాధానం కాజాలదు. అందునా ఎన్నికల కమిషన్ నిజాయితీ శంకించబడుతున్న ప్రస్తుత వాతావరణంలో, విశ్వాసం కలిగించదు. అందువల్ల ప్రభుత్వం ఆ ప్రతికా కథనంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించి, నిజానిజాలు ప్రజల ముందుంచాలి. లేకపోతే, కమిషన్ పక్షపాత వ్యవహార శైలిపై అనుమానాలు మరింత బలపడతాయి. అది ప్రజాస్వామ్యానికి మరింత హాని చేస్తుంది.



## జ్ఞానేశ్ కుమార్‌ను జైల్లో పెట్టాలి

పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలను బిజెపి, ఎన్నికల సంఘం చోరీ చేశాయని (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంచలన కథనం నేపథ్యంలో) ఇప్పడు రుజువైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి జైలులో పెట్టాలి. కొనసాగినంత కాలం సిఇసి పదవికి ఆయన తగిన వ్యక్తి కాదు. ఎస్ఐఆర్‌కు ముందు ఓటర్ల జాబితాతో పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలను తాజాగా నిర్వహించాలి.

– పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం
మమతా బెనర్జీ



ఈలిఫ్ ఎరాల్ఫ్

## బెర్లిన్ ప్రతినిధుల సభ ఎన్నికల విశేషాలు

జర్మనీ రాజధాని బెర్లిన్ 'ప్రతినిధుల సభ'కు సెప్టెంబర్ 20న జరిగిన ఎన్నికల్లో అరుణపతాకం రెపరెప లాడింది. వామపక్ష డీ లింకే (ది లెఫ్ట్) అతి పెద్ద పార్టీగా అవతరించింది.

'ది లెఫ్ట్' పార్టీ 25.7 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో నిలిచింది. అధికార క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సి.డి.యు.) పార్టీ 18.8 శాతం ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఫాసిస్టు భావజాలం కలిగిన ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎ.ఎఫ్.డి.) పార్టీ 16.3 శాతం ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకుంది.గ్రీన్స్ పార్టీ 14.3శాతం, సోషల్ డెమోక్రటిక్ పార్టీ(ఎస్.పి.డి.)12.1 శాతం ఓట్లు సాధించాయి.

1990లో తూర్పు, పశ్చిమ జర్మనీల విలీనం తర్వాత దేశ రాజధాని బెర్లిన్ నగరంలో వామపక్ష పార్టీ ఆధిక్యత కనబరచడం ఇదే మొదటి సారి.

జర్మనీ ఎన్నికలు మిశ్రమ ఎన్నికల పద్ధతిలో జరుగుతాయి. ప్రతి ఓటరుకు రెండు ఓట్లు ఉంటాయి. ఒక ఓటు తమ నియోజకవర్గ అభ్యర్థికి వేయాల్సి ఉంటుంది. రెండో ఓటు తమకు నచ్చిన రాజకీయ పార్టీకి వేయాల్సి ఉంటుంది. బెర్లిన్ ప్రతినిధుల సభలో మొత్తం 158 స్థానాలు ఉన్నాయి. అందు లో 78 స్థానాలు నియోజకవర్గ ప్రతినిధుల కోసం, 80 స్థానాలు పార్టీ జాబితాల నుండి గెలుపొందిన అభ్యర్థుల కోసం కేటాయించారు. ఒక్కొక్క నియోజకవర్గం నుండి పోటీపడిన అభ్యర్థులలో అత్యధిక ఓట్లు వచ్చిన అభ్యర్థి నియోజకవర్గ అభ్యర్థిగా గెలుపొంది ప్రతినిధుల సభ సభ్యుడు అవుతారు. మిగిలిన 80 స్థానాలను పార్టీలకు వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి దామాషా పద్ధతిలో పంపిణీ చేస్తారు. పార్టీలు ముందస్తుగా ప్రకటించిన అభ్యర్థుల జాబితా నుండి పార్టీకి వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి స్థానాల సంఖ్యకు సరిపడా అభ్యర్థులు ప్రతినిధులుగా నియమితులు అవుతారు.

రెండు పద్ధతుల్లో ఎన్నికైన మొత్తం 158 సభ్యులలో మెజారిటీ సాధించిన పార్టీ పాలనా బాధ్యతలు చేపడుతుంది

తాజా సమాచారం ప్రకారం ది లెఫ్ట్ పార్టీకి నియోజకవర్గాల నుండి 28మంది ప్రతినిధులు గెలుపొందగా, పార్టీ జాబితా నుండి 19 మంది సభ్యులకు అవకాశం లభించింది. దాంతో మొత్తం ప్రతినిధుల సంఖ్య 47కు చేరింది.

జర్మనీలోనూ, మొన్నటివరకూ బెర్లిన్‌లోనూ అధికార పార్టీగా ఉన్న క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ 34 స్థానాలతో రెండో స్థానంతో సరిపెట్టుకున్నది. అతివాద జాతీయవాదుల పార్టీ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ 29 స్థానాలతో మూడో స్థానానికి చేరింది. గ్రీన్ పార్టీకి 26 స్థానాలు దక్కగా జర్మనీలో చిరకాలం అధికారం చెలాయించిన పురాతన పార్టీల్లో ఒకటైన సోషల్ డెమోక్రటిక్ పార్టీ 22 స్థానాలతో చివరి స్థానంలో నిలిచింది. మరికొన్ని పార్టీలు పోటీలో ఉన్నప్పటికీ ఆయా పార్టీలకు ప్రతినిధులు ఎన్నిక కాకపోగా, ప్రాతినిధ్యం లభించే స్థాయిలో ఓట్లు పడలేదు.

గతంలో 12.2 శాతం ఓట్లతో 22 స్థానాలు గెలుపొందిన ది లెఫ్ట్ పార్టీ ఈ ఎన్నికల్లో 25.7 శాతం ఓట్లతో 47 స్థానాలు గెలిచింది. అయితే స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో గ్రీన్స్ తో గానీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీతో గానీ పొత్తు పెట్టుకోవచ్చునని భావిస్తున్నారు.

ది లెఫ్ట్ పార్టీ ఉపాధ్యక్షురాలిగా, బెర్లిన్ ప్రతినిధుల సభలో పార్టీ బృందానికి ఉప నాయకురాలిగాఈలిఫ్ ఎరాల్ఫ్ (46) సేవలు అందిస్తూ వచ్చారు. గత పదేళ్ళుగా సామాజికన్యాయం, ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల, మానవహక్కులు, శరణార్థుల సమస్యల పరిష్కారం కోసం ఆమె పోరాడుతున్నారు. జర్మనీలో ఇటీవల పొడచూపుతున్న జాతి విద్వేష భావాలకు వ్యతిరేకంగా ఆమె గట్టిగా గళం విప్పి ఉద్యమిస్తున్నారు. టర్కీ మూలాలు కలిగిన కుటుంబంలో ఆమె 1980లో మ్యూనిక్‌లో జన్మించారు. న్యాయశాస్త్రం అభ్యసించిన ఈలిఫ్ ఎరాల్ఫ్ సంకీర్ణం ద్వారా బెర్లిన్ పాలనా పగ్గాలు చేపట్టవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

అతివాద జాతీయ వాదానికి విరుగుడుగానే బెర్లిన్ పౌరులు వామపక్షం వైపు మొగ్గు చూపించారని అల్ జజీరా చేసిన వ్యాఖ్య గమనించదగినది.

# ప్రజాధనం పట్ల ఇంతటి నిర్లక్ష్యమా! ఏదీ శిక్ష?



మేరుగు రాజయ్య
9441440791

16వ,లోకసభ ఎన్నికలు 2014 ఏప్రిల్ 7 నుండి 12 వరకు జరిగాయి. మే 16న వెలువడిన ఫలితాలలో బీజేపీ 282 స్థానాలలో గెలుపొందింది.

ఎన్డీఏ(జాతీయ ప్రజాస్వామ్య కూటమి)తో కలిసి 336 మంది ఎంపిల నాయకుడిగా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ లోక సభ ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి 125 వాగ్దానాలు ప్రకటించింది. అందులో 10వ, హామీలో విదేశాలలో జమ చేసిన నల్లధనాన్ని గుర్తించి, 100 రోజుల్లోగా 80 లక్షల కోట్ల నల్లధనాన్ని వెనక్కి రప్పించి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. నరేంద్ర మోదీ కూడా ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటికీ గత 12 ఏండ్లు గా బిజెపినే అధికారంలో ఉంటున్నప్పటికీ విదేశాలలో దాయబడిన దేశీయ నల్లధనం వెనక్కి రాలేదు. పైగా దేశీయ బ్యాంకుల నుండి అప్పుగా తీసుకున్న కార్పోరేట్ కంపెనీల అధినేతలు కొందరు విదేశాలకు పారిపోయారు. బ్యాంకుల నుండి వేల కోట్ల రూపాయలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించకుండా మొండికేసిన కంపెనీలు మరియు వ్యక్తుల వివాదాల పరిష్కారంకై 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్' (ఎన్సీఎల్టీ)ను ఏర్పాటు చేశారు. కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 408 కింద ఎన్సీఎల్టీ 2016 మరియు 'ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రాప్టీ కోడ్(ఐబిసి)2016 తెచ్చారు. ఇవి కంపెనీల వివాదాలు, ఆర్థిక దివాళా ప్రక్రియలను పరిష్కారం చేస్తాయి. తద్వారా బ్యాంకులలో రుణ లభ్యతకు, రుణదాతలైన బ్యాంకులకు ఊతం ఇవ్వాలి. బ్యాంకులలో ఎన్పీఏ(నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ /నిరర్థక ఆస్తులు)ల తగ్గింపుకు, రుణ దాతల, వాటా దారుల హక్కులను సమతుల్యం చేసి మోసాలను, దుర్వినియోగాలను నివారించడానికి తోడ్పడాలి. కాని ఇటీవల మీడియాలో వైరల్ అయిన 'జీ గ్రూప్ అధినేత డాక్టర్ సుభాష్ చంద్ర' ఎన్సిఎల్టీ దివాళా కేసు చర్చనీయాంశం అయింది. ఇతను 2016 నుండి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. బిజెపి మద్దతుతో హర్యానా రాష్ట్రం నుండి ఎన్నికయ్యారు. రుణ దాతలు చెప్పినట్లుగా వెలువడిన సమాచారం ప్రకారం 2017లో సుభాష్ చంద్ర నికర ఆస్తి సుమారు రూ.45,888 కోట్లు, 2018లో రూ.40,562కోట్లు చూపించగా ప్రస్తుతం రూ.31.79 కోట్లు మాత్రమే చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తమైనవి. వ్యక్తిగత దివాళా కేసులో ఆయన అంగీకరించిన రూ.22,006 కోట్ల క్లెయిమ్స్‌కు బదులు కేవలం రూ.6.25 కోట్లు చెల్లించి పరిష్కరించుకోవడానికి వీలుగా 'జాతీయ కంపెనీల లా ట్రిబ్యునల్' (ఎన్సిఎల్టీ) రుణ చెల్లింపు ప్రణాళిక చెప్పింది. దానిపై రుణదాతలైన ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్, ఐడిబిఐ, హెచ్డిఎఫ్సీ, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుభాష్ చంద్ర ఆస్తులను మరింత లోతుగా పరిశీలించాలని కోరుచున్నవి. బ్యాంకులపై దాదాపుగా ప్రజలందరికీ విశ్వాసం ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన 'ఇండియా ఇన్ క్లూజివ్ ఫైనాన్స్ రిపోర్ట్ 2025' లో 91 శాతం భారతీయులకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని పేర్కొంది. కాని 69 శాతం ఖాతాదారులు మాత్రమే లావాదేవీలు జరుపుచున్నారని తెలిపింది. ప్రపం చ బ్యాంకు కూడా గ్లోబల్ ఇండెక్స్ 2025లో భారత దేశం లో బ్యాంకు ఖాతాల యాజమాన్యం 89 శాతానికి చేరుకుందని హైలెట్ చేసింది. నిజంగా బ్యాంకులు ప్రజలకు చేస్తున్నదేమిటి? ప్రజలు పొదుపు(దాచుకున్న)చేసిన డబ్బులను తిరిగి రుణాల (అప్పులు)పేర వడ్డీలకు ఇస్తున్నాయి. పొదుపు చేసిన ప్రజలకు 2.50 శాతం నుండి 8.50 వడ్డీ చెల్లిస్తున్నాయి. అప్పులు తీసుకున్న వారి నుండి 9.98 శాతం నుండి 24 వరకు, 10.60 శాతం నుండి 16.50 వరకు, ఫ్యాక్టరీ లోన్స్ పై 9 శాతం నుండి 27 వరకు ఇంకా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు 9 శాతం నుండి 30 శాతం వరకు వడ్డీలను వసూలు చేస్తున్నవి. ఇంకా ఖాతాదారుల (ప్రజలు)నుండి ఖాతా నిర్వహణ ఖర్చులను, ఎటిఎం(ఆటో మెటిక్ టెల్లర్) పరిమితికి మించి డబ్బు ల ఉపసంహరణ ఛార్జీలు, చెక్ లావా దేవీల, చెక్ బుక్ ఛార్జీ లు, లోన్స్ ప్రాసెస్, ఎన్ఇఎఫ్టి(నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్ ఫర్), ఆర్టీజిఎస్ (రియల్ టైమ్ గ్రాస్ సెటిల్ మెంట్)నగదు బదిలీల ఛార్జీలు, ఎస్ఎంఎస్(షార్ట్ మెసేజ్ సర్వీస్) ఫోన్ మెసేజ్ సమాచారం, డిమాండ్ డ్రాఫ్ట్, లాకర్ రెంట్, ఓవర్ డ్రాఫ్ట్, ముందస్తు ఖాతా ముగింపు ఛార్జీలు, హౌసిం గ్, వెహికిల్, గోల్డ్ లోన్స్ పై వడ్డీలు, బంగారు ఆభరణాల మూల్యాంకన ఛార్జీలు మొదలగు సేవలకు రుసుములు వసూలు చేస్తూ బ్యాంకులు లాభాలను సాధించుచున్నవి. అయినప్పటికీ ప్రజల దైనందిన జీవితంలో బ్యాంకులు భాగమైనవి.సమాజంలో మానవ సంబంధాల కంటే ఆర్థిక సంబంధాలు పరిఢవిల్లుతున్నట్లుగానే బ్యాంకులతో కూడా ఆర్థిక సంబంధాలు కొనసాగుతున్నవి.

ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు 12 ఉన్నవి.దేశవ్యాప్తంగా 60,646 శాఖ బ్యాంకులున్నవి. 1969 జూలై 19న బ్యాంకుల జాతీయకరణ నుండి లాభాలను సాధించుచున్నవి. గడిచిన 2025 –2026 ఆర్థిక సంవత్సరంలో 3.21లక్షల కోట్లు నిర్వహణ లాభాలు కాగా, నికర లాభాలు రూ.1.98(యుఎస్ $ 22.59 బిలియన్లు)లక్షల కోట్లు సాధించినవి. మొత్తం డిపాజిట్లు 156.3 లక్షల కోట్ల వరకు చేరుకున్నవి. ప్రజల పొదుపు, డిపాజిట్లు, రకరకాల లోన్స్ పై వడ్డీలు,సేవలపై చార్జీలతో సాధించిన లాభాలను (మదుపు/ఇన్వెస్ట్)మరింత సంపదను సృష్టించడానికి వెచ్చించి ఉంటే బాగుండేది.అందులో ప్రాధాన్యత రంగాలైన వ్యవసాయం, చేతి వృత్తులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సరళంగా రుణ సౌకర్యం కల్పించినట్లయితే ఉపాధి అవకాశాలతో పాటుగా అభివృద్ధి సాధ్యపడేది. కాని కార్పోరేట్ శక్తులు, బ్యూరోక్రసీ(ప్రభుత్వ యంత్రాంగం) రాజకీయ శక్తులు తయారు చేసిన చట్టాలు,విధానాల వలన బ్యాంకు ల డబ్బులు ''కాకులను కొట్టి గద్దలకు మేపిన చందంగా ఉంది. 2018 మార్చి 14 న విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎం.జె అక్బర్ బ్యాంక్స్ లోన్స్ తీసుకున్న వ్యాపార వేత్తలు 31 మంది విదేశాలకు పరారీ అయినారని లోక సభలో చెప్పారు. 2018 జూలై 25 న విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జనరల్ (రిటైర్డ్) విజయ్ కుమార్ సింగ్ విదేశాలలో పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల పేర్లను లోక్‌సభలో చెప్పారు. 2019 జనవరి 4న ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక సభలో 27 మంది దేశం విడచి పారిపోయిన రుణ ఎగవేత దారుల పేర్లను చెప్పాడు. 2020 ఫిబ్రవరి 5 న ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక సభలో విదేశాలలో పరారీలో ఉన్న 72 మందిని భారత్ కు తీసుక రావడానికి ప్రయత్నాలు జరుగుచున్నావని చెప్పాడు. విదేశాలలో పరారీలో ఉన్న వారి రుణాల మొత్తంపై మరియు ఎంత మంది ఉన్నారన్న విషయాలపై స్పష్టత లేదు. కేవలం 12 మంది పరారీలో ఉన్నవారి రుణాలు మాత్రం రూ.35,587.19 కోట్లుగా వెల్లడైనవి. గత 8 ఏండ్లుగా లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్ఓసి), రెడ్ కార్నర్ నోటీస్ (ఆర్సిఎన్) సిబిఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్),ఇడి(ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) ద్వారా పరారీలో ఉన్న రుణ ఎగవేత దారులను స్వదేశానికి తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుచున్నావని చెప్పుచూనే ఉన్నారు.

బ్యాంకుల నుండి తీసుకున్న వేల కోట్ల రుణాలను చట్టబద్ధంగా ఎగనామం పెట్టడం ఏలా సాధ్యమవుతుందని ప్రజలకు అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.సామాన్యంగా తాకట్టు, పూచీకత్తు లేకుండా బ్యాంకులు రుణాలు ఇయ్యవు.తాకట్టు పెట్టిన బంగారం మార్కెట్ విలువలో 70 నుండి 85 శాతం వరకు గోల్డ్ లోన్ ఇస్తారు.ఇల్లు లేదా ఆస్తిని తాకట్టు పెట్టుకుని మార్కెట్ విలువలో 50 నుండి 70 శాతం వరకు పర్సనల్ లోన్ ఇస్తారు.అలాగే ఉద్యోగి లోన్ తీసుకోవడానికి సదరు ఉద్యోగి మరియు పూచీకత్తు పడే ఉద్యోగి కూడా తన వేతనాన్ని తమ బ్యాంకు ద్వారా తీసుకునే వారికి మాత్రమే లోన్ ఇస్తారు .రైతులకు కూడా పట్టాదారు పాసు బుక్కులు తాకట్టు పెట్టుకుని అప్పులు ఇస్తారు. కాని కార్పోరేట్ కంపెనీలకు,బడా పారిశ్రామిక వేత్తలకు ఏమి తాకట్టు,జమానాతు పెట్టుకోకుండా వేల కోట్ల రుణాలను ఏలా ఇస్తున్నారు.ఇచ్చిన రుణాలను మొండి బకాయిల పేర, నిరర్థక ఆస్తుల పేర 'నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్ రప్సీ కోడ్ 2016 మార్గదర్శకంగా ఎట్లా మాఫీ చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

2024 ఆగస్ట్ 8న ఆమ్ ఆద్మీ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆర్థిక బిల్లుపై పార్లమెంటులో ప్రసంగించాడు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన 'హెయిర్ కట్ పథకాన్ని' బట్టబయలు చేశాడు. కేవలం 43 కంపెనీలు తీసుకున్న బ్యాంకు రుణాలు రూ.5,44,434 కోట్లు చెల్లించవలసి ఉండగా రూ.1,90,779 మాత్రమే చెల్లింపచేసి రూ.3,53,655 కోట్లను మాఫీ చేసిందని తెలిపాడు. అందులో కొన్ని కంపెనీల పేర్లను కూడా పేర్కొన్నాడు. **(బాక్స్–1 లో)**

**బాక్స్–1**

| వ.నెం. | పరిశ్రమ | రుణం | చెల్లింపు | మాఫీ |
|---|---|---|---|---|
| | | (సంఖ్యలు రూ.కోట్లలో) | | |
| 1. | అలోక్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ | 29,524 | 5,052 | 24,472 |
| 2. | ఎమ్‌టెక్ ఆటో లిమిటెడ్ | 12,641 | 2,615 | 10,026 |
| 3. | భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ | 47,158 | 19,350 | 27,808 |
| 4. | భూషణ్ స్టీల్ లిమిటెడ్ | 56,022 | 35,571 | 20,451 |
| 5. | దీవా హౌసింగ్ ఫైనాన్స్ కార్పోరేట్ లిమిటెడ్ | 87,083 | 37,161 | 49,922 |
| 6. | లాంకో థర్మల్ పవర్ లిమిటెడ్ | 33331 | 136 | 33,195 |
| 7. | రిలయన్స్ ఇన్ ప్రాటెల్ లిమిటెడ్ | 41,055 | 4,236 | 36,819 |

ప్రభుత్వ వర్గాల నుండి తీసుకున్న ఈ సమాచారాన్ని ధృవీకరించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఎంపీ సంజయ్ సింగ్ పార్లమెంటుకు చెప్పాడు. విద్య, ఆరోగ్య, రైతులకు రుణ మాఫీ, ప్రజల ద్రవ్యోల్బణం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరినప్పుడు డబ్బు లేదని అంటుందని, కాని పెట్టుబడిదారులకు రుణ మాఫీ చేయడానికి మాత్రం డబ్బు ఉంటుందని ఎద్దేవా కూడా చేశాడు. కాంగ్రెస్ హయాంలో రూ.70,000 కోట్ల రుణాలను మాఫీ చేయగా బిజెపి కేవలం 43 కంపెనీలకే రూ.3,53,655 కోట్లు మాఫీ చేశారని ఆందోళన తెలిపారు. పూణేకు చెందిన 'సజగ్ నాగరిక్ మంచ్'అధ్యక్షుడు వివేక్ వెలంకర్ సమాచార హక్కు చట్టం 2005 దరఖాస్తుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ)2016–2017 ఆర్థిక సంవత్సరం నుండి 2025–2026 ఆర్థిక సంవత్సరాల మధ్య రుణ ఎగవేత దారుల పేర్లను వెల్లడించమని కోరినాడు. దానికి బ్యాంకు వారు బ్యాంకు విశ్వసనీయ హోదా, వాణిజ్య గోప్యత కలిగి ఉన్న మూడవ పక్షాల వ్యక్తిగత సమాచారం అయినందున సహా చట్టం 2005,సెక్షన్ 8(1)(డి),8(1)(ఇ) మరియు 8(1)(జె) కింద పేర్లను బహిర్గతం చేయడం నుండి మినహాయింపు ఉందని తెలిపారు. **(బాక్స్–2 )**

ఎన్సీఎల్టీ మరియు ఇతర ఫోరమ్ లకు 309 రుణ ఖాతాలను ఎస్బీఐ తీసుకెళ్లగా రూ.1,49,895 కోట్ల క్లెయిమ్స్‌కు బదులుగా పరిష్కార ప్రణాళిక ద్వారా కేవలం రూ.49,727 కోట్లు వసూలు చేసుకోగలిగింది. ఇంకా రూ.100,168 కోట్లను నిరర్థక ఆస్తులుగా రద్దు చేసుకుంది.

బ్యాంకుల రుణ ఎగవేత దారులను నియంత్రించడానికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. బ్యాంకులలో ప్రజల పొదుపు డిపాజిట్లతో, లోన్స్ పై వసూ లు చేస్తున్న వడ్డీలతో, బ్యాంకుల సేవలపై వసూలు చేస్తున్న చార్జీలతో ఏటా లక్షల కోట్ల రూపాయలు లాభాలు వస్తున్నవి. బ్యాంకుల లాభాలను మదుపు చేయడంలోనూ,మరింత సంపదను సృష్టించడానికి వెచ్చించకుండా పరోక్షంగా బడా పెట్టుబడి సంస్థల రుణ ఎగవేతకు సహకరిస్తుంది.పైగా ఇప్పుడు నగదు బదిలీల రుసుం వసూలుకు బిజెపి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)నియంత్రణలో ఎన్పీసీపీ ద్వారా యూపీఐ పేమెంట్స్ 2016 నవంబర్ 4నుండి సాఫీగా జరుగుచున్నవి.ప్రతి సెకండ కు సగటుగా దాదాపు రూ.7,500 లావాదేవీలు జరుగుచున్నవి. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ చెల్లింపు వ్యవస్థగా యుపిఐ ఎదిగింది.

ప్రతి రోజు 640 మిలియన్లకు పైగా లావాదేవీలను ప్రాసెస్ చేస్తుంది. ఇప్పుడు యూపీఐ చెల్లింపులపై కూడా ఛార్జీలను వసూలు చేయడానికి కసరత్తులు జరుగుచున్నవి.దానితో నగదు బదిలీలకు అలవాటు పడిన ప్రజలలో ఆందోళన మొదలైంది.ఇప్పటికే బ్యాంకులలో రక రకాల రుణాలపై వసూలు చేస్తున్న వడ్డీలతో, బ్యాంకు సేవలపై వసూలు చేస్తున్న చార్జీలతో,ప్రజల పొదుపు డిపాజిట్ల డబ్బులతో పోగవుతున్న లక్షల కోట్ల రూపాయల లాభాలను రుణ ఎగవేత దారుల పాలు కాకుండా చర్యలు తీసుకుని, ఉత్పత్తి, ఉత్పాదక రంగాల అభివృద్ధికి వెచ్చించి సామాజిక అభివృద్ధికి, దేశాభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**(బాక్స్–2)**

**నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)**

| సంవత్సరం | రద్దు చేసిన రుణం | వసూలు |
|---|---|---|
| | (సంఖ్యలు రూ.కోట్లలో) | |
| 2016–17 | 13,587 | 113 |
| 2017–18 | 17,548 | 309 |
| 2018–19 | 27,225 | 1,811 |
| 2019–20 | 46,348 | 4,548 |
| 2020–21 | 17,137 | 611 |
| 2021–22 | 6,177 | 548 |
| 2022–23 | 10,193 | 2,496 |
| 2023–24 | 3,320 | 1,471 |
| 2024–25 | 7,632 | 6,254 |
| 2025–26 | 2,690 | 2,677 |

## సినిమా మన జీవనశైలిలో భాగం అవుతున్నదా !

హాలీవుడ్ పేరుకు ప్రేరణగా బొంబాయి కేంద్రంగా అంతర్జాతీయ స్థాయి చలనచిత్రాలను నిర్మిస్తున్న హిందీ సినీ పరిశ్రమను బాలీవుడ్ అని పిలుస్తున్నాం. 1970ల్లో ప్రారంభంపైన బాలీవుడ్ సినీ వైభవం నేడు హాలీవుడ్ దృష్టిని కూడా ఆకర్షించడం, అత్యుత్తమ సినిమాలను తీస్తూ ప్రపంచ సినీ ప్రేక్షకుల మనసులు దోయడం జరుగుతోంది. హిందీ భాష సినిమాల ద్వారా భారతీయ నృత్యాలు, సాంస్కృతిక వారసత్వ సంపద, కళలు, గీతాలు, సంగీత మాధుర్యాల ను భారతీయ ప్రేక్షకులకు కాకుండా ప్రపంచ దేశాల ప్రజల మన్ననలు సహితం పొందడం మన బాలీవుడ్ విజయంగా భావించాలి. తెలుగు సినీ పరిశ్రమను టాలీవుడ్ అని, కేరళ మలయాళ సినీ పరిశ్రమను మాలీవుడ్ అని, కన్నడ సినీ పరిశ్రమను సాండల్వుడ్ అని, పంజాబీ సినీ పరిశ్రమను పాలీవుడ్ అని, గుజరాతీ సినీ పరిశ్రమను డాలీవుడ్ అని, బెంగాలీ/మరాటీ/ఒడియా సినీ పరిశ్రమను ఓలీవుడ్ అని, అస్సామీ సినీ పరిశ్రమను జాలీవుడ్ అని, భోజ్పురీ సినీ పరిశ్రమను భోజ్వుడ్ అని, తమిళ సినీ పరిశ్రమను కొలీవుడ్ (చెన్నై, కొడంబాకమ్ పేరుతో)అని, పాకిస్థానీ సినీపరిశ్రమను లాలీవుడ్ అని పిలవడం పరిపాటి అయ్యింది.

**ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం :** భారత జాతీయ సినీ అవార్డుల ప్రదానం, అంతర్జాతీయ ఫిలిమ్ ఫెస్టివల్ నిర్వహణ, ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాల నిర్వహణతో బాలీవుడ్ సినీ పరిశ్రమ ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కావడం చూస్తున్నాం. మన హిందీ సినిమాలు ప్రపంచ దేశాల్లో కూడా మంచి ఆదరణ పొందడం నేడు సర్వసాధారణం అయ్యిం ది. బాలీవుడ్ సినిమా ద్వారా మనసులను రంజింపజేసే సుస్వర సంగీతం, ఆకర్షణీయ క్లాసికల్/నాన్ క్లాసికల్ డ్యాన్సులు, మన ఆచార వ్యవహారాలు, భారతీయ జీవనశైలి, మానవీయ విలువలు, చారిత్రక/పౌరాణిక చరిత్రలు, మరిచిపోలేని పాత్రలు ఎన్నో మన బాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ స్థాయికి చేర్చడం జరిగింది. 24 సెప్టెంబర్ 1913 రోజున దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన భారత తొలి పూర్తి నిడివి కలిగిన రాజా హరిశ్చంద్ర సినిమా విడుదల కావడంతో ఆ అపూర్వ ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏట 24 సెప్టెంబర్ రోజున ప్రపంచ బాలీవుడ్ దినోత్సవం (వరల్డ్ బాలీవుడ్ డే) పాటించడం 2014 నుంచి ప్రారంభమైంది. సామాజిక అంశాలతో కూడిన ఫామిలీ డ్రామాల కేంద్రంగా 1940ల్లో భారతీయ సినిమా స్వర్ణ యుగం ప్రారంభం అయ్యింది. ప్రపంచ సినీ ప్రభావంతో భారతీయ బాలీవుడ్ సినిమా కొత్త పుంతలు తొక్కుతూ, టెక్నాలజీని ఒంటపట్టించుకొని అద్భుతాలు తెరపై చూపిస్తూ బాలీవుడ్ సినీ పరిశ్రమ ఉజ్వలంగా ముందుకు సాగుతోంది. 1990ల తర్వాత పూర్వపు సినీ పరిశ్రమ నూతన రంగు రంగుల కాస్ట్యూమ్స్, అద్భుత సంగీత సరాగాలు, ఉద్విగ్న భరిత కథ గమనాలతో న్యూ బాలీవుడ్ రంగులు పూసుకొని ప్రపంచ మానవాళి మనసుల్లో తిష్ట వేస్తున్న ది.

సినిమా ఒక వినోదం మాత్రమే కాదని, ఆ పరిశ్రమ ద్వారా మన కళలను కాపాడుకోవడం, సంస్కృతులను రేపటి తరానికి పరిచయం చేయడం, ఆ కథల నుంచి స్ఫూర్తిని పొందడం జరగాలి. నేడు ఓటిటి వేదికలు రావడం, గ్రాఫిక్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఒక అతి పెద్ద ప్రజాదరణ పొందిన పరిశ్రమగా కొనసాగుతున్నది. భిన్న భాషల భారతంలో అనేక సినిమాలు విడుదల అవుతూ మనకు తెలియకుండానే మన సామాజిక జీవన విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. నేటి సినిమాలు మన సంస్కృతికి అద్దం పడుతూ, కళలను పోషిస్తూ, కథలతో కట్టిపడేస్తూ, పరిమిత స్థాయిలో పాశ్చాత్య రంగులను పులుముకుంటూ ముందుకు సాగాలని కోరుకుందాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతికి
# ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

**• అధికారులంతా స్ఫూర్తితో భాగస్వాములు కావాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క • డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026' ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చారిత్రాత్మక సదస్సును విజయవంతం చేసేందుకు ప్రతి అధికారి స్ఫూర్తితో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సన్నాహక సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సు ఏర్పాట్లు, ప్రచారం, దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోల నిర్వహణపై సమావేశంలో కార్యాచరణను ఖరారు చేశారు.

### పర్యవేక్షణకు 10 ప్రత్యేక అధికారుల కమిటీలు

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో గ్లోబల్ సమ్మిట్ కీలక మైలురాయిగా నిలుస్తుందని, సమ్మిట్ నిర్వహణ పర్యవేక్షణకు సుమారు 10 ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ సిఎం తెలిపారు. ప్రతి కమిటీకి సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని చెప్పారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు.అధికారుల కమిటీలతో పాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి, వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లుగా నియమించినట్లు తెలిపారు. కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

### ప్రపంచవ్యాప్తంగా విస్తృత ప్రచారం

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను విస్తృతంగా వినియోగించాలని డిప్యూటీ సిఎం సూచించారు. సదస్సుకు సంబంధించిన కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు, రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలపై నిరంతర ప్రచారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో కుదిరిన ఎంఓయులను సమీక్షించి, వాటి అమలు పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు అధిక అవకాశాలు ఉన్న దేశాలు, నగరాలు, పారిశ్రామిక రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోల కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయో అధ్యయనం చేసి, వివిధ రంగాలకు అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళికను రూపొందించి మంత్రిమండలి ఉప సంఘానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి రోడ్‌షోలను ప్రారంభించాలని సూచించారు.

### వార్‌రూమ్ ద్వారా రోజువారీ పర్యవేక్షణ

సమ్మిట్ ఏర్పాట్ల కోసం ఏర్పాటు చేసిన బృందాలు వెంటనే సమావేశమై పనులను ప్రారంభించాలని, వార్ రూమ్ ద్వారా ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ప్రతిరోజూ సాయంత్రం పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం రోజువారీ బాధ్యతలను ముగించాలని సూచించారు. ప్రతినిధుల స్పందనను బట్టి ప్రస్తుతం ప్రతిపాదించిన నాలుగు సభా ప్రాంగణాలను అవసరమైతే ఆరు లేదా ఎనిమిది హాళ్లకు పెంచేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా తెలంగాణకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆర్థిక, పారిశ్రామిక అవకాశాల వేదికగా తీర్చిదిద్దాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక వికాసంలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని, ఎక్కడా రాజీ లేకుండా సదస్సును విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం ఆకాంక్షించారు.

# 'సర్'తో ఓటర్ల హక్కు కాలరాస్తున్న మోదీ సర్కార్

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబి తా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల హక్కులను నరేంద్ర మోదీ సర్కార్ కాలరాస్తోందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాలపై ప్రజల్లో ఇప్పటికే అనేక అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం నాగోల్ సాయినగ ర్‌లో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి ఇటి.నరసింహ మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇవిఎంలను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కేంద్ర ప్రభు త్వం ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎలాగైనా తిరిగి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో ప్రజల ఓట్లను తొలగిస్తోందని విమర్శించారు. బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలించాలని ఆయన కోరారు. ఏళ్లుగా ఓటు వేస్తున్న పౌరులను అకస్మాత్తుగా పాత రికార్డులు, మ్యాపింగ్ వివరాలు, ఇతర పత్రాల పేరుతో వివరణలు కోరడం ఆందోళన కలిగించే అంశమని నరసింహ అన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారినవారి వివరాలు వంటి అంశాలను సరిచేయడం అవసరమే అయినప్పటికీ, ఆ ప్రక్రియలో నిజమైన ఓటర్లు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు.తెలంగాణలో నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులో సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. రాష్ట్రంలో జారీ చేసిన 92.88 లక్షల నోటీసుల్లో 83.24 లక్షలు అందగా, ఇంకా 9.64 లక్షలు ఇంకా అందాల్సి ఉండగా 41.84 లక్షల నోటీసులకు గడువు ముగిసినట్లు అధికారులు వెల్లడించారని తెలిపారు. అయితే అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుం డా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, సాయినగర్ ఏరియా బాధ్యులు కాంపల్లి శ్రీనివాస్, శాఖ కార్యదర్శు లు యాదయ్య, కొమ్ము రాములు, ధనమ్మ, ఉబ్బని వెంకటేష్, రాజుగౌడ్, అండాలు, అంజమ్మ, లక్ష్మి, హేమలత, రాధ, రాములు, ఉపేందర్, వెంకటమ్మ, అరెకంటి రాములు, లావణ్య, చెన్నమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి నాడు 'డిమాండ్స్ డే'

### ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) పిలుపు

**చండీగఢ్:** అక్టోబర్ 2 (గాంధీ జయంతి)న దేశవ్యాప్తంగా 'డిమాండ్స్ డే' నిర్వహించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) పిలుపునిచ్చింది. ఇటీవల కర్ణాటకలోని బెంగళూరులో జరిగిన ఐజెయు జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో భాగంగా మీడియా రంగానికి చెందిన వివిధ సమస్యలపై భారత రాష్ట్రపతికి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు అందజేయాలని రాష్ట్ర అనుబంధ సంఘాలను కోరింది. ఈ మేరకు ఐజెయు అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, ప్రధాన కార్యదర్శి డి. సోమసుందర్ బుధవారం ఒక ప్రతికా ప్రకటనను విడుదల చేశారు. కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల భద్రతకు జాతీయ చట్టం, రద్దు చేసిన జర్నలిస్టుల చట్టాల్లో చట్ట బద్ధ హక్కులను పునరుద్ధరించాలని, నూతన వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్స్‌తో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## విద్యుత్‌పై బిఆర్‌ఎస్‌ది తప్పుడు ప్రచారం : అద్దంకి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ సరఫరా, డిమాండ్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సరఫరాను సక్రమంగా కొనసాగించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణలో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్లను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని పేర్కొన్నారు. దేశానికి విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన తొలి పార్టీ కాంగ్రెస్ అని, ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు ఉచిత విద్యుత్ అందించామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు ప్రస్తుతానికి ప్రతిబంధకంగా మారాయని ఆరోపించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయడంతో డిస్కంలపై ఆర్థిక భారం పడిందన్నారు. విద్యుత్ శాఖను అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మార్చారని విమర్శించారు. విద్యుత్ విషయంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచా రం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని అద్దంకి దయాకర్ కోరా రు. అవసరమైతే ఎంత ధర చెల్లించైనా విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

### కెటిఆర్‌కు సమాధానం చెప్పే దమ్ము లేకే కరెంట్ పేరుతో డైవర్షన్ : బల్మూర్ వెంకట్

తమ ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు ఆధారాల తో బయటపెట్టిన భూముల వ్యవహారంపై సమాధానం చెప్పకుండా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రజల దృష్టిని మళ్లించేందుకు విద్యుత్, కరువు అంశాలను తెరపైకి తెస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. కరు వు, విద్యుత్‌పై కెటిఆర్ చేస్తున్న వ్యాఖ్యల్లో అవగాహన, ఆలోచన లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఎల్ నినో పరిస్థితులు ఉన్నాయని, ఇవి ప్రభుత్వాలు తీసుకొచ్చేవి కావని పేర్కొన్నారు.

### కెటిఆర్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి: ఎంపి చామల

కెసిఆర్ విద్యుత్ ఛార్జీల కోసం పోరాడారని కెటిఆర్ చెప్పడం అవాస్తవమని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. 2000లో బషీర్‌బాగ్ కాల్పులు జరిగినప్పుడు కెసిఆర్ టిడిపిలోనే ఉన్నారని, 2001లో ఆ పార్టీని వీడారని గుర్తుచేశారు. కెటిఆర్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. బిఆర్ఎస్ హయాంలో డిస్కంలపై రూ.81 వేల కోట్ల అప్పులు చేశారని, ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్రాజెక్టుల కాంట్రాక్టుల్లోనూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. రైతులను రెచ్చగొట్టి బిఆర్ఎస్ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్, ప్రాజెక్టుల పేరుతో జరిగిన అవకతవకల వివరాలను త్వరలో ఒక్కొక్కటిగా బయటపెడతామని చామల తెలిపారు.

### కెటిఆర్ రాజకీయ శకం ముగిసింది: మెట్టు సాయికుమార్

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గతి, మతి లేకుండా మాట్లాడుతున్నారని టిపిసిసి ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. సిరిసిల్లలో కెటిఆర్ ఓటమి ఖాయమని, గత పదేళ్ల పాలనలో తెలంగాణ ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని ఆగం చేశారని ఆ రోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రో జుల పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటాన్ని ఓర్వలేకే కెటిఆర్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు గత ప్రభుత్వ హయాంలో జరిగిన విషయాలను మర్చిపోలేదని, బిఆర్ఎస్ రాజకీయ శకం ముగిసిందని సాయికుమార్ అన్నారు.

## పోలీసుల పహారా మధ్య ఎర్రవల్లిలో భూ సర్వే

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో వివాదస్పదంగా మారిన సర్వే నంబర్ 325లో బుధవారం పోలీసుల పహారా నడుమ సర్వే అధికారులు క్షేత్రస్థాయి లో భూమి సర్వే నిర్వహించారు. జిల్లా సర్వే అధికారి సుదర్శన్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడిన సర్వే బృందం సభ్యులు రైతుల వారిగా వారి వద్ద ఉన్న భూమి పత్రాల ఆధారం గా కొలతలు నిర్వహించి, వారు సాగు చేసిన భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. నిన్న నోటీసులు అందుకున్న రైతులు తెల్లావారు జామున తమ వద్ద ఉన్న భూ ఆధారిత హక్కుల పత్రాలతో అసైన్డ్ భూమి వద్దకు హాజరయ్యారు. 325లో అసైన్డ్ పట్టాలు పొందిన 224 మంది రైతులకు గాను 200 మందికి నోటీసులు జారి చేయగా, మిగిలిన 24 మందికి నోటీసులు జారి చేయాల్సి ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇప్పటికే 80 శాతం భూమి సర్వే పూర్తి కావస్తుందని అన్నారు. త్వరలోనే సర్వేను పూర్తి చేసి కబ్జాలో ఉన్న రైతుల పేర్లతో కూడిన నివేదికను తయారు జిల్లా కలెక్టర్‌కు అనంతరం సిసిఎల్‌కు అందజేయనున్నారు.

# సొంతూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన బాధ్యత

రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** పుట్టి పెరిగిన గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం బాధ్యతగా భావిస్తున్నానని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి తిరుమలగిరి మండలం తాటిపాములలో రూ.5కోట్ల సిఎస్ఆర్ నిధులతో జెడ్ పి హైస్కూల్ బలోపేతం పనులకు, రూ.2కోట్ల జెన్‌కో నిధులతో ప్రైమరీ స్కూల్ బలోపేతం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.16కోట్లతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జి పనులను పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన విద్య అందించడానికి రూ.7 కోట్ల నిధులతో హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో అదనపు గదులు నిర్మించడం జరుగుతుందన్నారు. ఇట్టి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా ఒక సంవత్సరంలోపు పనులు పూర్తి చేసి ఇవ్వాలని గుత్తందారులను ఆదేశించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందిస్తూ అంగన్‌వాడీ కేంద్రానికి రూ.20లక్షల చొప్పున మొత్తం 4 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.80లక్షలు మంజూరు చేసి మంచి నాణ్యతతో చుట్టూ ప్రహరీ గోడ, టాయిలెట్స్‌తో ఆధునిక పద్ధతిలో నిర్మించాలన్నారు. రూ.16కోట్లతో యశ్వంత్‌పూర్ వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ కమ్ బ్రిడ్జి పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి తుంగతుర్తి నియోజక వర్గానికి నీరు అందిస్తామని అలాగే సమ్మక్క సారలమ్మ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో తుంగతుర్తి నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి భవనాలు, పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె. నరసింహ, సూర్యాపేట మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్‌డిఓ వేణుమాధవరావు, డిసిసి ప్రెసిడెంట్ గుడిపాటి నర్సయ్య, సర్పంచ్ కిషన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## శశి థరూర్‌తో మధుయాష్కీ గౌడ్ భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) వ్యవస్థాపక చైర్మన్, మాజీ కేంద్ర సహాయ మంత్రి, ఎంపి శశి థరూర్‌ను ఎఐపిసి ప్రస్తుత చైర్మన్ మధుయాష్కీ గౌడ్ న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఐపిసి కార్యకలాపాల విస్తరణ, సంస్థ భవిష్యత్ కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రొఫెషనల్స్‌ను కాంగ్రెస్‌తో మరింతగా అనుసంధానం చేసే అంశంపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఎఐపిసిను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్యం, న్యాయ, విద్య, సాంకేతిక, వ్యాపార తదితర వృత్తి రంగాలకు చెందిన నిపుణుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు.


## ఎల్‌నినోపై కెటిఆర్ రాజకీయ రాద్ధాంతం తగదు: మల్లు రవి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు ఏర్పడటంతో విద్యుత్ సమస్యలు తలెత్తితే దానిని రాజకీయంగా రాద్ధాంతం చేయడం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు తగదని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. వర్షాలు లేకపోవడంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయ ని, జలాశయాల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడిందని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఫలితంగా విద్యుత్ కొరత ఏర్పడిన విషయం తెలిసినప్పటికి కెటిఆర్ రాజకీయ విమర్శలకు దిగడం సమంజసం కాదన్నారు.దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత ఉన్న సమయంలో అవసరమైన విద్యుత్‌ను ఇతర ప్రాంతాల నుంచి కూడా కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడతాయని మల్లు రవి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకోకుండా రాష్ట్రంలో విద్యుత్ సమస్యలకు రాజకీయ దురుద్దేశాలను ఆపాదించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఎల్‌నినో కూడా కాంగ్రెస్ వల్లే వచ్చినట్లుగా కెటిఆర్ ప్రచారం చేయడం దారుణమని,న ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయాలకు ఉపయోగించుకోవడం తగదు అని మల్లు రవి హితవు పలికారు. విద్యుత్ సమస్యలపై ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుసని, కెటిఆర్ చేస్తున్న రాజకీయ విమర్శలను ప్రజలు విశ్వసించరని ఆయన పేర్కొన్నారు.

# మారెళ్లపాడు 'ఎత్తిపోతలు' ప్రారంభం

**భారీ జనసందోహం మధ్య నీటిని విడుదల చేసిన మంత్రులు**

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం మారెళ్లపాడులో సీతారామ ప్రాజెక్టు అనుబంధంగా నిర్మించిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఎత్తిపోతల పథకానికి నీటిని విడుదల చేశారు. కార్యక్రమానికి భారీగా రైతులు, ప్రజలు తరలిరావడంతో మారెళ్లపాడు జనసందోహంగా మారింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదురుచూస్తున్న కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం రైతులకు దసరా, దీపావళి పండుగలతో సమానమ ని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ పనులకు సం బంధించి పలు మండలాల్లో సర్వే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సీతమ్మ సాగర్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుందని వివరించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పంటలకు మద్దతు ధర, బోనస్ అందిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీతారామ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంతో పాటు అశ్వాపురం నుంచి పాలేరు వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కార్యక్రమంలో ప్రసంగించారు. ఎత్తిపోతల పథ కం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల అధ్యక్షుడు ఓ రుగంటి రమేష్, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఉసా అని ల్, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల రాష్ట్రంలో విద్యు త్ సంక్షోభం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లనే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. రాష్ట్రంలో ఒక వైపు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరతతో ఉత్పత్తి పడిపోతుంటే, మరోవైపు నీటి లభ్యత లేక జల విద్యుత్ కేంద్రాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఆరు బిఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని ఆరు థర్మల్ పవర్ ప్లాంట్లను, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించనున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉండగా, బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లల్లో 19,472 మెగావాట్లకు పెంచామని, విద్యుత్ రంగంలో దాదాపు రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టామని వివరించారు. కొంతమంది పారిశ్రామికవేత్తలు తమ విద్యుత్ అవసరాల నిమ్మితం సుమారు 30 శాతం వరకు జనరేటర్ల ద్వారా విద్యుత్‌ను సమకూర్చుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో 1980 కాలం నాటి విద్యుత్ పరిస్థితులు తిరిగి వచ్చాయన్నారు. రానున్న వేసవిలో పరిస్థితి మరింత తీవ్రమైతే తాగు, సాగు నీరు, యాసంగి పంటలు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ఏం ప్రణాళికతో ముందుకెళ్తున్నదో చెప్పాలన్నారు. జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన సింగరేణి సంస్థ, తక్కువ నాణ్యత కలిగిన జి13, జి14 గ్రేడ్ బొగ్గును సర ఫరా చేస్తున్నదని, ఆ నాసిరకం బొగ్గు వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గడంతో రూ.2,900 కోట్ల ప్రజాధనం నష్టపోయిందన్నారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, ఆర్థిక వ్యవహారాలు, పవర్ ప్లాంట్ల నిర్వహణపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

### బిఆర్ఎస్ బృందాలు..

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవాలక్ష్మి , అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్ రావు, హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు పరిశీలిస్తారని కెటిఆర్ వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల**

ఎన్ఐటి నెంబర్ 21-23/డిపిఆర్ఇ/ఆర్ఎస్/టెండర్లు/2026-27, తేదీ: 22.09.2026

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ICDS, CBF మరియు SAND FUND నిధుల నుండి (03) పనులకి అంచనా విలువ రూ.14.50 లక్షలకు గాను (1,2,8వ పిలుపు), బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 24.09.2026 నుండి, ముగింపు తేదీ: 29.09.2026, తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందవచ్చు.

సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్, రాజన్న సిరిసిల్ల.

DIPR R.O. No. : 10505-PP/CL/ADVT/2026-27, Date: 23-09-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

షార్ట్ టెండర్ 'ఇ'ప్రొక్యూర్‌మెంట్ NIT No. 46/EE/Cir 40/SBZ/GHMC/2026-27, dt: 22.09.2026

| S. No. | NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 1 | NIT No. 46/ EE/Cir 40/ SBZ/ GHMC/ 2026-27, dt: 22.09.2026 | 1 నెం. పని | రూ. 13.20 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 23.09.2026 మ.3.00గం.ల నుండి, డౌన్‌లోడ్ ఆఖరి తేదీ: 26.09.2026 మ.3.00గం.ల వరకు, బిడ్ ప్రారంభం: 26.09.2026 మ.3.15 గం.లకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-40, జిహెచ్ఎంసి, సెల్ నెం. 7995007437 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-40, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10526-PP/CL/ADVT/2026-27, Date: 23-09-2026

# గణనాథులకు ఘన వీడ్కోలు



కరీంనగర్‌లో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనం

పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన ఉత్సవాలు

నగరం నుంచి పల్లె వరకూ భక్తజన సందడి.. భారీ బందోబస్తు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు కరీంనగర్ జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కరీంనగర్ నగరంతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి తదితర పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో గణేష్ విగ్రహాలను శోభాయాత్రలుగా తరలించి నిమజ్జనం చేశారు. భక్తుల జైజై నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి.

**తొమ్మిది రోజుల భక్తి.. చివరి రోజు సందడి**

వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు ఉదయం నుంచే విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథులను ఉంచి శోభాయాత్రలు నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలకు మరింత శోభ తీసుకొచ్చారు.

**కరీంనగర్ పట్టణంలో నాలుగు వేల విగ్రహాలు**

కరీంనగర్ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన నాలుగు వేల వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథులను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు.

**మానకొండూరులో భారీ ఏర్పాట్లు**



కరీంనగర్ నగర పరిధి నుంచి అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు మానకొండూరు చెరువు వైపు తరలివెళ్లాయి. గతంతో పోలిస్తే ఈసారి నిమజ్జన ఏర్పాట్లను భారీ స్థాయిలో చేపట్టారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవసరమైన సంఖ్యలో క్రేన్లను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్లను అందుబాటులో ఉంచారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

**గజ ఈతగాళ్లు.. వైద్య బృందాలు సిద్ధం**

మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన కేంద్రాల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందిని నిమజ్జన కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు.

**కొత్తపల్లి, చింతకుంటలో ప్రత్యేక ఏర్పాట్లు**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొత్తపల్లి, చింతకుంట ప్రాంతాల్లో నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేశారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారు.

**హుజురాబాద్ డివిజన్‌లోనూ ఘనంగా**

హుజురాబాద్ డివిజన్ పరిధిలోనూ వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. హుజురాబాద్, జమ్మికుంటతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను భక్తులు శోభాయాత్రలుగా తరలించి నిమజ్జనం చేశారు. చొప్పదండి ప్రాంతంలోనూ ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి.

**భారీ బందోబస్తు.. నిరంతర పర్యవేక్షణ**

నిమజ్జనోత్సవాల సందర్భంగా కరీంనగర్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, శోభాయాత్రలు జరిగే మార్గాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు, పోలీసులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించారు. జిల్లా ఉన్నతాధికారులు నిమజ్జనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కిందిస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. నిమజ్జన కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తూ సమస్య లు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**సమన్వయంతో సాఫీగా..**

జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, వైద్య, పారిశుద్ధ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా నిమజ్జన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు వీడ్కోలు పలికారు.



## అన్నప్రసాదం ప్రారంభం

ఉద్యోగులు, సిబ్బందికి స్వయంగా వడ్డించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, సందర్శకులకు కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం అధికారులు సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సీపీఓ శ్రీనివాసాచారి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీఏఓ అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన అధికారి శరత్ బాబు, డీవైఎస్ఓ రాందాస్, కలెక్టరేట్ ఏవో, పర్యవేక్షకులు రాంరెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి మహేష్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈనెల 30న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే బుధవారం పోలీస్ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా, ఇతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్, పార్కింగ్ కోసం ప్రదేశాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వివిఐపీ, వీఐపీ భద్రత ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బి డిఈ శాంతయ్య, ఎస్సైలు గణేశ్, నాగరాజు, రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## జోష్‌తో ముగిసిన విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక పూజలు చేసిన 'ఆల్ఫోర్స్' నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** దేవదేవుడైన గణనాథుని నవరాత్రి ఉత్సావాలు చాలా గొప్పగా, వైభవంగా వేద బ్రాహ్మణుల యొక్క మార్గదర్శకత్వంలో నిమజ్జనం చేశారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నిర్వహించిన గణనాథుల నిమజ్జనోత్సవ వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 రోజులుగా ఆల్ఫోర్స్ విద్యా సంస్థల్లోని గణనాథుడి మండపాలలో వివిధ రకాల పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో విద్యార్థుల ఉత్సాహం నడుమ నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. వినాయకుని ఆశీస్సులతో విద్యార్థులు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిమజ్జన మహోత్సవంలో భాగంగా సిబ్బంది చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డిని విద్యార్థులు భుజాన ఎత్తుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో సుభిక్షంగా..



ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర ప్రజలు విగ్నేశ్వరుని ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద గణపతి నిమర్జన వేడుకలను మున్సిపల్ చైర్మన్, కమిషనర్, పోలీస్ యంత్రాంగంతో మరియు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి ఎంతో నిష్టతో నవరాత్రులు పూజలు నిర్వహించిన గణనాథుడిని భారీ క్రేన్ ద్వారా నిమజ్జనం చేసిన అనంతరం వేదపండితులు వేదమంత్రాలతో ఘనంగా ఆశీర్వదించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజులు జరుపుకొని నేడు నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా జరుపుకోవాలని నిమర్జన వేడుకల్లో ప్రజలు సమయపాలన పాటించి నియమ నిష్ఠలతో ప్రశాంత వాతావరణంలో నిమర్జన వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు.పెద్దపల్లి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎల్లమ్మ చెరువు కట్టపై నిమజ్జన వేడుకలకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ వారు పెద్దపల్లి సబ్ డివిజన్లోని పోలీసు బలగాలను అణువణునా మోహరించి పకడ్బందీ ఏర్పాట్లు చేశారన్నారు. సింగరేణి కోల్ మైన్స్ నుండి భారీ క్రేన్లను తెప్పించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిర్మాణానికి పూర్తి ఏర్పాట్లు చేశామని ఈ సౌకర్యాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, విద్యుత్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలో మొదటి రోజు నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా 50 వార్డుల్లో నిర్వాహకులు గణేష్ మండపాల నుండి వినాయకులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో నిమజ్జనానికి తలరించారు.యువతి, యువకులు డప్పు, చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ సాదండి చేశారు. జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు వద్ద వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని చైర్ పర్సన్ వాణి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని వార్డుల నాయకులు ఉన్నారు.

## 27న ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

కలెక్టర్ బి.సత్య ప్రసాద్





**ప్రజాపక్షం/రాయికల్ :** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. 2026 సంవత్సరానికి "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్‌రూపకల్పన" అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 9న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## దొంగల ముఠా అరెస్ట్ : ఆభరణాలు స్వాధీనం

సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి వెల్లడి

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు పోలీసులు చాకచక్యంతో ఇంటి దొంగతనం కేసు ఛేదించి నలుగురు నిందితుల అరెస్టు చేసినట్లు సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని చిన్నకోదూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారన్నారు. చిన్నకోదూర్ మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన బుచ్చెల్లి అఖిల ఫిర్యాదు మేరకు, గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ఆమె ఇంటి తలుపులు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించారని కేసు నమోదు కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సంఘటనా స్థలం పరిసర ప్రాంతాల సిసి ఫుటేజ్‌లు,పెట్రోల్ బంక్ కెమెరాలు, టోల్‌ప్లాజా రికార్డులను పరిశీలించగా, టిఎస్08 హెడి1688 నంబర్ గల ఎరుపు రంగు కియా సెల్టోస్ కారు నేరంలో ఉపయోగించారని, ఈ రోజు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా,వారు జక్కాపూర్ ఇంటి దొంగతనం కేసుతో పాటు ఇతర దొంగతనాలకు కూడా పాల్పడినట్లు అంగీకరించారని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మునిగలవీడుకు చెందిన మాధగాని సురేష్ (35) తండ్రి పేరు వెంకటయ్య(26 కేసులు), మహబూబాబాద్ జిల్లా రావిరాలకు చెందిన దాసరి నాగయ్య(46)తండ్రి పేరు హనుమంతు(12 కేసులు), మహబూబాబాద్ జిల్లా ఉప్పరపల్లికి చెందిన కట్ల మహేష్ (34) తండ్రిపేరు పాపయ్య, వరంగల్ జిల్లా మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన ఉండాడి సురేష్(38) తండ్రిపేరు ఎల్లయ్యలు పట్టుబడగా మరో నిందితుడు కుజా కళ్యాణ్ పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి నిందితుల వద్ద



నుండి ఫిర్యాదుదారుకు చెందిన మొత్తం చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంతో పాటు, నేరానికి ఉపయోగించిన కియా సెల్టోస్ కారు మరియు 4 సెల్‌ఫోన్లు, 7 గ్రాముల బంగారం, 33 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి రవీందర్ రెడ్డి వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు, ఇతర కేసులలో వారి ప్రమేయంపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఇంటి దొంగతనం కేసును శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేసి, సిసిటివి ఫుటేజ్‌లు, టోల్ ప్లాజా రికార్డులు మరియు ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో కృషి చేసిన సిద్దిపేట రూరల్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్, చిన్నకోదూరు ఎస్ఐ బి చంద్రమోహన్, రాజగోపాలపేట ఎస్ఐ వివేక్, చిన్నకొడుర్ సిబ్బంది కానిస్టేబుళ్లు పరశురాం, స్వామి, తిరుపతి, శ్రీనివాస్, బాబు, శ్రీను, సంపత్, రాజులను సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.రష్మి పెరుమాళ్, సిద్దిపేట ఎసిపి రవీందర్ రెడ్డిలు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన నిబద్ధతతో విధులు నిర్వహించి నేర నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.




## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డితో సహా నలుగురు అరెస్ట్, ముగ్గురు పరారీ

రూ.11,690 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** సిద్దిపేట పట్టణం మహాశక్తి నగర్‌లోని మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఇంట్లో పేకాట ఆడుతుండగా సిద్దిపేట టూ టౌన్ ఇన్స్‌పెక్టర్ మురళి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాడి చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న మాజీ ఎంఎల్‌సి రఘోత్తంరెడ్డి,మరో ముగ్గురిని పోలీసులు అక్కడికక్కడే పట్టుకోగా, మరో ముగ్గురు పరారైనట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11,690 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఘటనపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సిద్దిపేట టూటౌన్ ఇన్స్‌పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం పేకాట కేసులోని వ్యక్తులు గోనెపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి, వివేకానంద కాలనీకి చెందిన గోవిందపురం కనకయ్య, రామునిపట్లకు చెందిన పంతం వెంకట్ రాజ్యం, హనుమాన్ నగర్‌కు చెందిన సిద్దంకి రమేష్,రంగదాంపల్లికి చెందిన గంగసాని భాస్కర్ రెడ్డి, హనుమాన్ నగర్ గంగుల బాలు, గోనెపల్లికి చెందిన మధుసూదన్‌లుగా పేర్కొన్నారు. పరారైన ముగ్గురి కోసం పోలీసులు గాలింపు చేపట్టినట్లు టూటౌన్ సిఐ మురళి తెలిపారు.

## ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

సిద్దిపేట కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/సిద్దిపేట :** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి గూర్చి ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లు, గృహనిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె.హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, వెరిఫై చేసిన తరవాత ఆ దస్త్రాలను కలెక్టరేట్‌కి పంపించాలని ఆదేశించారు. ఆయా మండలాల వారిగా ప్రణాళిక ప్రకారం గెజిటెడ్ ఆఫీస్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని నిర్మాణ దశలకు అనుగుణంగా అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని, నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమమని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి భగవంత్ రావు, డిఈ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట పరిధిలో గల అక్కపల్లి, బుగ్గ రాజేశ్వర తండా, దుమాల గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 2 లీటర్ల నాటు సారా లభించగా రెండు కేసులు నమోదు చేసి, లభ్యమైన 80 లీటర్ల బెల్లం పాకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.




## జాతీయ స్థాయి థాంగ్-టా పోటీలకు ఐపిఎస్ స్కూల్ విద్యార్థులు




**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** జాతీయ స్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలకు సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో జమ్మూకశ్మీర్ లోని శ్రీనగర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఐపీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఏ.అద్వైత్ 56 కేజీల విభాగంలో, ఎం.సంప్రీత్ 46 కేజీల విభాగంలో, కె.మైత్రి వరుణ్ 52 కేజీల విభాగంలో, టి.ధనుష్‌కుమార్ 56 కేజీల విభాగంలో ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాలలో విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. శ్రీనగర్‌లో జరిగే జాతీయ పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోలుకు చర్యలు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలుకు అన్ని జిల్లాల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఆదేశించారు.బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు గన్నీ సంచులు, లారీలు, టార్పాలిన్లు, హమాలీలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 7 రకాల సన్న వరి ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కి 500 చొప్పున బోనస్ అందజేస్తామని, రాష్ట్రంలో దాదాపు 10.50 లక్షల మంది రైతులు 34.84 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగు చేశారని తెలిపారు.క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత,తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనానికి రూ. 30 లక్షలు మంజూరు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన సౌకర్యాల కోసం సాంఘిక సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రూ. 30 లక్షల నిధుల మంజూరికి హామీ ఇచ్చారని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజక వర్గ బాధ్యుడు కుచాడి శ్రీహరి రావు తెలిపారు. బుధవారం హైదరాబాద్ లోని అయన నివాసంలో కలిసి అంబేద్కర్ భవన పరిస్థిని మంత్రికి వివరించి వినతి పత్రాన్ని అందజేశారు.భవనం లోపల ప్రతిధ్వని నివారణ,అతిథుల సౌలభ్యం కోసం కుర్చీలు, ఇతరాత్ర అవసరమైన సౌకర్యాలు కల్పించి అంబెద్కర్ భవనంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో వివరించారు.సారంగాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ అబ్దుల్ హాది,అంబెద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు కొంతం మురలీధర్,మధుకర్,అనిల్ ఉన్నారు.

## ఎల్‌పిజికి ఆధార్ ఇ-కెవైసి తప్పనిసరి


**ప్రజాపక్షం/మెదక్ :** గృహ వినియోగ ఎల్‌పిజికి సిలిండర్లను సబ్సిడీతో పొందుతున్న వినియోగదారులు అక్టోబర్ 1, 2026 లోపు ఆధార్ ఆధారిత ఇకెవైసి పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నిత్యానంద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటికే ఇకెవైసి పూర్తి చేసుకున్న వారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇకెవైసి చేసుకునే విధానం సిలిండర్ డెలివరీ సమయంలో డెలివరీ బాయ్ వద్ద,సంబంధిత ఎల్‌పిజికి ఏజెన్సీ / డిస్ట్రిబ్యూటర్ వద్ద,ఆయిల్ కంపెనీ మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే,ఇండేన్ వినియోగదారులు ఇండియన్ ఆయిల్ వన్ యాప్ ద్వారా, భారత్ గ్యాస్ వినియోగదారులు హలో బీపీసీఎల్ యాప్,హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు హెచ్‌పీ పే యాప్ ద్వారా ఇకెవైసి చేసుకోవచ్చు.నకిలీ, అనర్హ కనెక్షన్లను తొలగించి అర్హులైన వారికే సబ్సిడీ అందేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. గడువులోగా ఇకెవైసి పూర్తి చేసుకోవాలని కోరారు.సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 2333 55 ను సంప్రదించాలన్నారు.

## సబ్ కలెక్టర్‌ను సత్కరించిన విశ్రాంత ఉద్యోగులు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ సబ్ డివిజన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరిని బుధవారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కాగజ్‌నగర్ యూనిట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.సబ్ కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కాగజ్‌నగర్ ప్రాంత అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తామని నాయకులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జయదేవ అబ్రహం, ఎం.శివ ప్రసాద్ నాయర్, ఫైనాన్స్ సెక్రటరీ అంకయ్య, ఎండి.అన్వర్, సిహెచ్.రామయ్య, జిల్లా బాధ్యులు ఎం.సు భాష్, కె.పురుషోత్తం, సిహెచ్.ప్రసాద్, ఎం.రాజేశ్వర్, జాడి కేశవ్, శంకర్ లింగం, ముకుందం, శివరాం పాల్గొన్నారు.

## బాధితుడికి సిఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేత



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రానికి చెందిన తాడెం కొమురయ్యకు 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరు కావడంతో బుధవారం గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్ చేతులమీదుగా కొమురయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుకు సహకరించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపసర్పంచ్ బాబు, బిజెపి మండల అధ్యక్షుడు సిద్ధ రాం రెడ్డి, వార్డు సభ్యులు దుర్గయ్య, మల్లేశం, రాజిరెడ్డి ,పాల్గొన్నారు.

## అండర్-14 రగ్బీ క్రీడాకారుల ఎంపిక



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం అండర్14 వి భాగంలో రగ్బీ బాలబాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 100 మంది బాలికలు,120 మంది బాలురు ఉత్సాహంగా హాజరయ్యారు.క్రీడాకారుల ప్రతిభను పరిశీలించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ముఖ్య అతిథులుగా నిర్మల్ జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు రమణారావు హాజరయ్యారు.వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమలత,గిరి,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ భవేష్ మిశ్రా




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. అక్టోబర్ 1 నుండి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు శ్రీకారం చుడుతామన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కీలక అంశాలపై సమీక్ష జరిపారు. ధాన్యం అమ్మకాల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బంధీ కార్యాచరణతో సన్నద్ధం కాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాల కల్పనతో పాటు రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గుర్తించిన గిడ్డంగులు, ఫంక్షన్ హాళ్లు, ఆయా ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తుల ప్రగతిని మండలాల వారిగా సమీక్షించిన కలెక్టర్, వచ్చే వారం నాటికి ఏఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండకుండా అన్నింటిని పరిష్కరించాలని గడువు విధించారు. డబుల బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ఈ నెలాఖరు నాటికి పూర్తి కావలన్నారు. 8274 డబుల్ బెడ్‌రూమ్‌లు పూర్తి కాగా ఇప్పటికే వాటిలో 6713 ఇళ్ల కేటాయింపులు పూర్తయ్యాయని, మిగిలిన 1561 ఇళ్లను కూడా వారం వ్యవధిలో లబ్ధిదారులకు లాటరీ పద్ధతిన నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా కేటాయింపులు జరపాలని కలెక్టర్ ఆదేశించారు.మైనార్టీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలోనూ అధికారులు జాప్యం చేయకుండా దరఖాస్తులను వెంటాదివెంట పరిశీలిస్తూ అర్హత కలిగిన వారికి ఆమోదం తెలుపాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్‌ఓ గీత, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, డీఆర్‌డీఓ సాయన్న, అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రదేశాల.. పరిశుభ్రతకు ప్రాధాన్యం

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**ప్రజాపక్షం/మెదక్ :** పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.మెదక్ జిల్లాకు గొప్ప చారిత్రక, సాంస్కృతి, ఆధ్యాత్మిక, ప్రకృతి సంపద ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని పేర్కొన్నారు.జిల్లాలోని మెదక్ ఖిల్లా, చర్చి, ఏడుపాయల వనదుర్గాభవాని ఆలయం, పోచారం వన్యప్రాణి అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్, చరిత్రక కోటలు, చెరువులు, జలపాతాలు, దేవాలయాలు తదితర పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. డిపిఆర్‌ఓ రామచంద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ నవీన్, ఈడియం సందీప్, మహేందర్, ఆర్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.



## ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు : కలెక్టర్

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రత శాంతి భద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు,బార్లు ,కల్లు దుకాణాలు తదితరాలను తాత్కాలికంగా మూసిచేయాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా మెజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ ఉత్వర్వులు జారీ చేశారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968 లోని సెక్షన్ 20 సంబంధిత నిబంధనల ప్రకారం ఈ ఉత్వర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపార. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని ప్రాంతాలను నియహాయించి సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని అన్ని ఎ4 మద్యం దుకాణాలు ,2బి బార్లు ,కల్లు దుకాణాలు కల్లు డిపోలు, సిఎస్ 2 క్యాంటిన్లు మూసివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూసివేత 2026 తేది 25 ఉదయం 6.00 గంటల నుంచి సెప్టెంబర్ 26 వ తేది ఉదయం 6.00 గంటల వరకు అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో పాటు భారీ ఊరేగింపులు జరిగే అవకాశం ఉన్నందున ఏలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా శాంతి యుత వాతావరణాన్ని కొనసాగించడం ప్రజల భద్రతను కాపాడడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉత్తర్వులను ఎక్సైజ్ పోలీస్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత మద్యం దుకాణాలు బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు ఈ ఉత్వర్వులను తప్పని సరిగా పాటించాలని ఆయన సూచించారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరపాలి


### కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం



**ప్రజాపక్షం/దండేపల్లి :** వినాయక నవరాత్రుల అనంతరం నిర్వహించే నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సామరస్యపూర్వక వాతావరణంలో ప్ర శాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం దండేపల్లి మండలం గూడెంలోని నిమజ్జన ప్రాంతాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, ఎస్సైతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన ఘాట్ల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు ముందస్తు జాగ్రత్త చర్యలు సమర్థవంతంగా చేపట్టాలన్నారు.అనంతరం ద్వారక గ్రామంలో నిర్మిస్తున్న గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహం పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండేతో కలిసి తనిఖీ చేసి, విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలిస్తూ.. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు జాబితాలో ఉండేలా ధ్రువపత్రాల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అవసరమైన పరీక్షలు, పౌష్టికాహారం అందేలా చూడాలని, ఆసుపత్రి ప్రసవాలపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీరు కలుషితం.. పైప్‌లైన్‌కు లీకేజీ!

### పట్టించుకోని అధికారులు



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో గత కొన్ని రో జులుగా మిషన్ భగీరథ తాగునీరు కలుషితమై వస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నాగులపల్లి కి వచ్చే మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలిపోవడంతో బాగు చేయించాలని గ్రామస్తులు పలుమార్లు సంబంధిత మిషన్ భగీరథ అధికారులకు విన్నవించిన నిర్లక్ష్యంగా వ్య వహరిస్తూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ముసాఫట్ గ్రా మం నుంచి నాగులపల్లికి వచ్చే మిషన్ భగీరథ పైప్ లైన్ ముసాఫట్ కు చెందిన సత్యనారాయణ గౌడ్ పొలంలో లీకేజీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. మిషన్ భగీరథ లీకేజ్ అవుతున్నందు న ఈ లీకేజీని సరి చేయాలని, మిషన్ భగీరథ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం వహిస్తూ వారు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంట పొలంలో పైప్ లైన్ లీకేజీ కారణంగా గ్రామానికి సరఫరా అవుతున్న నీటిలో ఇసుక, చెత్త, నాచు వస్తుండటం తో ఈ నీరు తాగేందుకు పనికిరాకుండా పో యిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టి స్వచ్ఛమైన నీరు అందించాలని నాగులపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

## మార్కెట్‌యార్డు కార్మికుల వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/ మావల:** ఆదిలాబాద్ మార్కెట్ యార్డు కార్మికులకు 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు ఎస్. బాలరాజు, ఎం.ప్రవీణ్ కుమార్, గాజంగుల రాజు డిమాండ్ చేస్తూ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సకాలంలో వేతనాలు వచ్చేలా చూస్తామని జెడి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమాబాయి, కళాబాయి, రాధ, సుశీల, మల్లయ్య, రుక్సానా పాల్గొన్నారు.

## ఈనెల 30లోగా రైతు రిజిష్ట్రీ పూర్తి చేసుకోవాలి

### వ్యవసాయ అధికారి స్వప్న జాదవ్

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** రైతుల వివరాలను డిజిటల్‌గా నమోదు చేసి, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలను సులభంగా అందించేందుకు చేపడుతున్న రైతు రిజిస్ట్రీ ప్రక్రియను రైతులు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ స్వప్న జాదవ్ తెలిపారు. కౌడిపల్లి మండలంలోని రైతులు తమ ఆధార్, భూ వివరాలు ఇతర అవసరమైన వివరాలతో 2026 సెప్టెంబర్ 30వ తేదీలోగా రైతు రిజిస్ట్రీని పూర్తి చేసుకోవాలని అలాగే, రైతు రిజిస్ట్రీ వివరాలు ధాన్యం (వరి) కొనుగోలు ప్రక్రియతో కూడా అనుసంధానమై ఉన్నందున, రైతులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీ పూర్తి చేయడం ద్వారా ధాన్యం కొనుగోలు సమయంలో ప్రక్రియ సులభతరం అవుతుందని అన్ని గ్రామాల రైతులు ఈ విషయాన్ని గమనించి, ఇబ్బందులు తలెత్తకుండా సెప్టెంబర్ 30లోగా రైతు రిజిస్ట్రీని వ్యవసాయ శాఖ సహాయ అధికారులతో పూర్తి చేసుకోవాలని సూచించారు.

# ప్రైవేటు ఆసుపత్రుల్లో బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్లు ఏర్పాటు చేయాలి

### సిపిఐ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మంద స్వరూప రాణి



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రైవేట్ ఆసుపత్రుల్లో బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్లు ఏర్పాటు చేయాలని నిత్యం ప్రైవేట్ ఆసుపత్రులకు పిల్లల వైద్యం కోసం వచ్చే బాలింతల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, తప్పనిసరి పరిస్తితుల్లో రిసెప్షన్ క్యాబిన్ ముందే తల్లులు పాలు ఇవ్వాల్సి వస్తుందని సిపిఐ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మంద స్వరూప రాణి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపికి 300 నుంచి 500 వరకు తీసుకుంటున్నారని, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది మహిళల ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయమని వెంటనే సంబంధిత అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలతో మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నగరంలోని ప్రధాన చిల్డ్రన్ ఆసుపత్రులలో వైద్యంకోసం, డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం రిసెప్షన్ కౌంటర్ వద్ద గంటల తరబడి కూర్చొని ఉండాల్సి వస్తుందని, అలాంటి సమయంలో చిన్న పిల్లలకు పాలు పట్టాల్సి వస్తే, కూర్చున్న చోటే ఇవ్వాల్సి వస్తుందని, కొంత మంది మాతృమూర్తులు మొహమాటంతో పిల్లలు ఏడుస్తున్నా పాలు పట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, పాలు సమయానికి పట్టలేకపోవడం వల్ల పిల్లలకు అనేక వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో ఆధ్వర్యంలో బస్టాండ్, కోర్టులో, ఐడిఓసి కాంప్లెక్సుకు వచ్చే తల్లులు తమ పిల్లలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పాలు ఇచ్చేలా క్యాబిన్లు ఏర్పాటు హర్షణీయమన్నారు. ఈ దిశగానే ప్రతి ప్రయివేటు ఆసుపత్రిలో సైతం బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

# ప్రశాంతంగా ముగిసిన నిమజ్జన శోభాయాత్ర

### జిల్లా ఎస్పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జన శోభాయాత్ర మంగళవారం భక్తిశ్రద్ధలు, ఉత్సాహం మధ్య ప్రశాంతంగా ముగిసింది. "హిందూ–ముస్లిం భాయ్ భాయ్" నినాదాలతో మతసామరస్యం, సోదరభావాన్ని చాటుతూ ప్రజలు శోభాయాత్రలో పాల్గొన్నారు.పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, భైంసా పట్టణంలోని శోభాయాత్ర మార్గాలను స్వయంగా పరిశీలిస్తూ భద్రతా ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.శోభాయాత్ర మార్గంలో పోలీసు సిబ్బంది విధులు, ట్రాఫిక్ నియంత్రణ,ప్రజల రాకపోకలను పరిశీలించిన ఎస్పీ, అధికారులు సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. నిమజ్జన ఘాట్‌తో పాటు ప్రధాన కూడళ్లు, శోభాయాత్ర మార్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ పోలీసులు విధులు నిర్వహించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటించడంతో శోభాయాత్ర సజావుగా కొనసాగింది.భైంసా పట్టణంలో మతసామరస్యం,సోదరభావం వెల్లివిరిసేలా ప్రజలు పరస్పరం సహకరించుకోవడం అభినందనీయమని పోలీస్ శాఖ పేర్కొంది.నిమజ్జన బందోబస్తులో విధులు నిర్వహించిన పోలీసు అధికారులు,సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన భైంసా ప్రజలకు,గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీస్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది.జిల్లా ఎస్పి డా.జి. జానకి షర్మిల,వికారాబాద్ అడిషనల్ ఎస్పి రాజేష్ మీనా,భైంసా ఎఎస్పి సాయి కిరణ్,ఎఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**ప్రజాపక్షం/భైంసా :** గ్రామాల అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ప్రతి గ్రామానికి అభివృద్ధి పనుల కోసం 60 లక్షల నుండి కోటీ రూపాయల వరకు నిధులు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు.లింబా కె గ్రామం లో 20లక్షల నిధులతో నిర్మించినా మహిళ సమైక్య భవనం,అదే విధంగా హెల్త్ సెంటర్ ప్రారంభం, అదే విధంగా 12 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న అంగన్ వాడి భవన నిర్మాణనికి భూమి పూజ చేసిన సందర్భంగా అయన మాట్లాడారు.ఇప్పటికే ప్రతి గ్రామానికి పెద్ద మొత్తం లో నిధులు ఇవ్వడం జరిగిందని, ఐక్యంగా ఉండి,గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలింది గా సూచించారు.పది సంవత్సరాల పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా గ్రామాలు అభివృద్ధి లో వెనుక బడ్డాయన్నారు.

**ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు :** అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు లింబా కె, లింబా బి గ్రామాల్లో ఘన స్వాగతం లభించింది. డప్పుచప్పులతో, మహిళలు మంగళ హారతులు, పూలు చల్లుతూ స్వాగతం పలికారు.గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు ఇస్తున్న ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు.



## మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ప్రజాపక్షం/ తల్లాడ : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగలపల్లిలో బుధవారం తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మర్సకట్ల బాబు లు కలిశారు. సిరిపురం మేజర్ ద్వారా వచ్చే నీటిని వీలైనంత త్వరగా వచ్చేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సిరిపురం మేజర్ కాలువ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని త్వరలోనే నీటిని విడుదల చేస్తామని రైతులు అధైర్యపడవద్దని, ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అని తెలిపారు.

## రామాలయం పనులు వేగవంతం చేయాలి

నవమి నాటికి ప్రధాన పనులు పూర్తి కావాలి

మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీరామ నవమి గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రామాలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయానికి వచ్చిన ఆయన గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపి బలరామ్ నాయక్, ఎమ్మెల్యేలు డా.తెల్లం వెంకట్రావు, ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పి రోహిత్ రాజ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో లిఫ్టులు స్లాబులు రాతి పనులు, రహదార్లు నిర్మాణ సామాగ్రి సిబ్బంది నిధులపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ మూడు రోజులకు ఒక లిఫ్ట్ పని పూర్తయ్యేలా వేగం పెంచాలని సూచించారు. రాతి పనుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. ఆలయ నిర్మాణంలో నాణ్యత శాస్త్రపరమైన విషయాల్లో రాజీపడేది లేదన్నారు. ఆలయాభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.275 కోట్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. నవమికి ముందే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ సిద్ధం చేయాలన్నారు. గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మాఢ వీధులు చుట్టుప్రాకారాలు ఆలయపరిసర ప్రాంతాల్లో పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు శ్రద్ధవహించాలన్నారు. ఆలయ పరిసర రహదార్ల అభివృద్ధికి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదే విధంగా అంబాసత్రం ప్రాంతంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, దేవస్థానం ఇఒ దామోదర్ రావు, అధికారులు, ఆర్కిటెక్ట్‌లు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## అసంపూర్తి వంతెన పనులతో వాహనదారుల అవస్థలు

తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం కమలాపురం, సూరంపాలెం గ్రామాల మధ్య నిర్మించిన రెండు వంతెనల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రారంభమైన పనులు గుత్తేదారు నత్తనడకన చేపట్టడంతో ఇప్పటికీ పూర్తికాలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. వంతెనల వద్ద రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఇటీవల ఎర్రమట్టి పోయగా వర్షాలకు బురదమయమై వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి వంతెనల వద్ద బిటి రహదారి ఏర్పాటు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



ప్రజాపక్షం/కల్లూరు: భారీ వర్షాలు కారణంగా ప్రజల అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, తహసీల్దార్ బ్రహ్మేశ్వర రావు, ఎన్ఎస్‌పి, ఎస్ ఇ శ్రీకాంత్, ఎంపిడిఒ చంద్రశేఖర్ లు కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. మరో రెండు రోజులపాటు ఇదే విధంగా వర్షాలు కొనసాగుతాయని అవసరం అయితేనే తప్పనిసరి పరిస్థితుల్లో బయటకి వెళ్లాలని ప్రజలకు సూచిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జిపిఒలు, లస్కర్లు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలని గ్రామాల్లో ఉండి వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పంటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకొని యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ అధికారిని రూప పేర్కొన్నారు. ఇబ్బందులు ఉంటే వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అజయ్ యాదవ్ పేర్కొన్నారు. స్థానికంగా ఉండే ప్రజలకు సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు.

## అభివృద్ధి ప్రణాళికపై డిప్యూటీ కమిషనర్ పరిశీలన



ప్రజాపక్షం/ముదిగొండ: మండల పరిధిలోని వివికేపురం గ్రామ పంచాయతీ వైబ్రెంట్ గ్రామ సభ ఆధ్వర్యంలో ప్రణాళికా రూపకల్పన ప్రక్రియను పంచాయతీరాజ్. గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ విద్యావతి ముఖ్య అతిథిగా హాజరై అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, రాబోయే ఆర్థిక సంవత్సరానికి రూపొందించాల్సిన ప్రణాళికలు, ఉపాధి హామీ పథకం అమలు తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామ సభలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని గ్రామస్తుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామసభ తీర్మానాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, డిప్యూటీ సీఈఓ, ఏపీడీ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అదనపు కార్యక్రమ అధికారి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హరిణి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

హరిణి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

గ్రామస్తులు, విద్య, మహిళా సంఘాల ధర్నా

24 గంటలలోపు నిందితుడిని అరెస్ట్ చేయాలని

ఎస్‌పికి మంత్రి తుమ్మల ఆదేశం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కేంద్రంలోని వెంగన్నపాలెం గ్రామ నివాసి ఇంద్రపల్లి సతీష్, రాజేశ్వరి దంపతుల కుమార్తె నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న ఇంద్రపల్లి హరిణి మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, మృతికి కారకులైన నిందితులను తక్షణమే అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించి, చట్టపరమైన చర్యలు తీసుకొని, హరిణికి న్యాయం చేయాలని బుధవారం గ్రామస్తులు, విద్యా సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తనికెళ్లలోని గ్రేస్ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న హరిణి సెలవులు కావడంతో ఇంటికి వచ్చి హరిణి మృతి చెందటం చాలా బాధాకరం అని అన్నారు. నర్సింగ్ విద్యను పూర్తి చేసి తన కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలుస్తుందని కోటి ఆశలతో చూస్తున్న హరిణి కుటుంబానికి తీవ్ర నష్టం జరిగిందని ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థినులు, మహిళలపై రోజురోజుకు హత్యాచారాలు, మానభంగాలు, దాడులు పెరిగిపోతున్నాయని, కానీ పోలీస్ శాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరు యావత్ మహిళా లోకం సిగ్గుపడుతుందని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

### ధర్నా వద్దకు చేరుకున్న తుమ్మల

నర్సింగ్ విద్యార్థి ఇంద్రపల్లి హరిణిని హత్య చేసిన నిందితులను 24 గంటల లోపు అరెస్ట్ చేయాలని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎస్‌పి రోహిత్ రాజు కు ఫోన్ ద్వారా ఆదేశించారు. రేపు సాయంత్రంలోగా అరెస్టు చేసి నివేదికనందించాలని సూచించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నర్సింగ్ విద్యార్థిని హత్య విషయాన్ని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. విద్యార్థిని తల్లి రాజేశ్వరి నుంచి వివరాలను మంత్రి తుమ్మల అడిగి తెలుసుకున్నారు. ఇంటి పక్కన ఉన్న యువకుడు అతను కుటుంబ సభ్యులు కలిసి తన కుమార్తెను హత్య చేసినట్లు ఆమె మంత్రికి తుమ్మలకు వివరించింది.

## మధిర బార్ అసోసియేషన్ న్యాయవాదుల ధర్నా



ప్రజాపక్షం/మధిర: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు బుధవారం మధిర కోర్టు ఎదుట న్యాయవాదుల డెత్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.25 లక్షలకు పెంచాలని, న్యాయవాదులందరికి వైద్య సహాయం కింద రూ.5లక్షలు, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేలు స్టైఫండ్ ఐదు సంవత్సరాలపాటు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మధిర బార్ అసోసియేషన్ న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు, ఐలూ నాయకులు, న్యాయవాది దిరిశాల జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

## రాతోని లిఫ్టుకు అద్దె ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం పెనుబల్లి రాతోని లిఫ్ట్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలు కావడంతో ప్రస్తుత పంటలను ఆదుకునేందుకు గంగాదేవిపాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు కనగాల సాంబశివరావు రైతుల బాధను అర్థం చేసుకొని సుమారు రూ.2.50 లక్షలు సొంత ఖర్చులతో అద్దె ట్రాన్స్ఫార్మర్ (750 వాట్స్) ను రైతులకు అందించారు. ఈ సందర్భంగా బుధవారం రాతోని లిఫ్ట్ కమిటీ సభ్యుల సమావేశంలో కనగాల సాంబశివరావు వెల్లడి చేసి పెనుబల్లికి ట్రాన్స్ఫారర్‌ను తెప్పించారు. రాథోని లిఫ్ట్ నూతన ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు టెండర్లు ప్రక్రియ పూర్తయింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నూతన ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటుకు సమయం పడుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుత పంటను కాపాడేందుకు రైతుల బాధను అవసరాలను అర్థం చేసుకున్న కనగాల సాంబశివరావు రైతుల తరఫున నిలబడి సొంత ఖర్చులతో పంట పండించేంతవరకు అద్దె ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నారు. ఈ సందర్భంగా నాతోని లిఫ్ట్ ఆయకట్టు రైతులు సాంబశివరావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండిలో హోమియో వైద్యశాలలో ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు షేక్ మారే బాబు వైద్య శిబిరాన్ని నిర్వహించి ప్రాముఖ్యతను వివరించారు. పలు రకాల వ్యాధులపై వైద్యశాలలో ప్రభుత్వం అన్ని వ్యాధులకు అందుబాటులో మందులు ఉన్నాయని ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అవగాహన సదస్సులో ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలగవరం, మర్లపాడు, తాళ్లూరు, దారుక బంజర్, కిష్టారం తదితర గ్రామాల ప్రజలు, సిబ్బంది, యోగా శిక్షకులు రమేష్ పాల్గొన్నారు.

## 'అర్నాబ్' ప్రభావంతో భారీ వర్షాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



ప్రజాపక్షం/ఖమ్మం : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలోనూ బుధవారం ఉదయం నుంచి ఒక మోస్తారు వర్షం కురుస్తుంది. చాలా కాలం తర్వాత వర్షం పడడంతో పైరులకు ప్రాణం పోసినట్లయింది. మెట్ట పంటలు సైతం వడబడుతున్న సమయంలో తుఫాన్ పుణ్యమా అని వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. ఇదిలా ఉండగా భద్రాద్రి కొత్తగూడెంజిల్లా బూర్గంపాడు మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. కొద్ది సేపు ఏమి జరుగుతుందో అర్థం కాలేదు. చుట్టూ చీకటి నల్లటి మేఘాలతో భయంకరంగా గాలులు వీచడంతో చెట్లు నెలకొరిగాయి. ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. మనుషులు కూడా కొందరు గాలికి కొట్టుకుపోయి గాయపడ్డారు. క్షణాల్లోనే గాలుల వేగం పెరగడంతో భారీ వృక్షాలు నేలకొరిగి, విద్యుత్ స్తంభాలు విరిగిపడి, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గాలుల ధాటికి పలు చోట్ల చెట్లు ఇళ్లపై, రహదారులపై పడటంతో ఆస్తి నష్టం సంభవించింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లోకి నీరు చేరి ఎల్‌నినో ప్రభావం నుంచి కొంతమేర బయటపడే అవకాశం ఉందని రైతులు ఆశతో ఉన్నారు.

## సాంకేతిక సూచనలు పాటించి అధిక దిగుబడి పొందాలి



ప్రజాపక్షం/రఘునాథపాలెం : రైతులు పత్తి పంటకు సంబంధించి శాస్త్ర సాంకేతిక సూచనలతో సరైన సమయంలో అధికారుల సిఫారసులను అమలు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. రఘునాథపాలెం మండల పరిధిలోని హర్యాతండా గ్రామంలోని పత్తి రైతులకు పత్తి పంటలో మొక్కల పెరుగుదల,నియంత్రణకు ఉపయోగించే ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో మొక్కల పెరుగుదల, పూత, పిందె, కాయల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సరైన మోతాదులో ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్‌ను వినియోగించాలని సూచించారు. సమతుల్యమైన మొక్కల ఆకృతి, దిగుబడి పెంపు లక్ష్యంగా మిషన్ ఫర్ కాటన్ ప్రొడక్టివిటి కార్యక్రమం ద్వారా రైతులకు సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్యులు లేని హోమియో వైద్యశాల

దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని ప్రభుత్వ హోమియో వైద్యశాలలో గత సంవత్సరం నుంచి వైద్యులు లేనందున దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు హోమియో మందులు వాడే వారు గత సంవత్సరం నుంచి ఇదే విధంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పనిచేసిన వైద్యులు అశ్వారావుపేటకు బదిలీ కావడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. ప్రతిరోజు కనీసం 15 మంది ఓపి నడుస్తుందని, దీనికిగాను మందులు ఇచ్చేవారు లేరు, వైద్యులు లేరు, అటెండర్ మాత్రమే మిగిలి ఉన్నారు. ఏదైనా మందులు అత్యవసరంగా కావాలంటే పక్కనే ఉన్న హోమియో వైద్యులకు ఫోన్లు చేసి ఫోన్ ద్వారా మందులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో మొత్తం ముగ్గురు ఉండాల్సి ఉండగా అటెండర్ తోనే నడిపిస్తున్నారు. గత సంవత్సరం నుంచి ఇదే విధంగా కొనసాగుతుండటంతో ఉన్నతాధికారులకు తెలిసినా కూడా ఈ కాళీభర్తీ చేయలేకపోతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. హోమియో మందులు వాడకం దారులు మండలంలోని చిన్న కోరుకొండి, పక్కనే ఉన్న పెనుబల్లి కిసమయాన్ని కేటాయించి సమయ భారం ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నామని హోమియో మందుల వినియోగదారులు తెలుపుతున్నారు. ప్రధానంగా ప్రత్యేకంగా హోమియో వైద్యశాల లేకపోయినా ప్రాంతీయ వైద్యశాలలో ప్రస్తుతానికి నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించుకుందాం

మంటపాల వద్ద విద్యుత్, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సమాజంలో భక్తిభావంతో పాటు సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణ అత్యంత ముఖ్యమని, ఇది మన అందరి బాధ్యతని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం పట్టణ పరిధి, పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేష్ మంటపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంటపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని నిర్వాహకులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలుచోట్ల మహా అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణ ద్వారా ప్రజల మధ్య సద్భావన వెల్లివిరుస్తుందని, సంస్కృతిని కాపాడుతూ సేవా దృక్పథంతో సామాజిక కార్యక్రమాలు చేపట్టడంలో యువత ఉత్సవ కమిటీల చొరవ అభినందనీయం అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మంటపాల వద్ద విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉంటూ పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. కార్పొరేషన్ గ్రామపంచాయతీ అధికారులు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ శ్రీనివాస్, నాయకులు పల్లపోతు సాయి, శ్రీనివాసరెడ్డి, రమేష్, రాజు, కె.యశ్వంత్, ఆంటోని, రామారావు, పొన్నం అజయ్, భరత్, జేమ్స్, స్టాలిన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### హరిణి హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి

నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసులో నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి ఖమ్మంలో నర్సింగ్ చదువుతూ ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులోని బంధువుల ఇంటికొచ్చి ఆ మరుసటి రోజే దారుణ హత్యకు గురైందన్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి చేరుకున్న ఆయన మృతదేహాన్ని పరిశీలించి కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థిని ఇలా దారుణహత్యకు గురుకావడం అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టినిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హరిణి కుటుంబానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## ఘనంగా పోషణ మాసం వేడుకలు



ప్రజాపక్షం/మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నూతన యూనిఫామ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దోర్నాల శిరీష, పిల్లల ఆరోగ్యకర ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లులంతా అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకుంటూ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ సువార్త, ఆశా వర్కర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ ఆయా దివ్య, మాజీ ఉప సర్పంచ్, యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దోర్నాల వెంకట రవి, చిన్నారు తల్లులు పాల్గొన్నారు.

## 'రెడ్‌క్రాస్' ఎన్నికల సందడి

డా.ఎస్ఎల్ కాంతారావు, చల్లగుళ్ల మధ్య పోటీ

నేడు నామినేషన్లు, అక్టోబర్ 4న ఎన్నికలు




ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలంలో రెడ్‌క్రాస్ ఎన్నికల సందడి హాట్‌హాట్‌గా ఉంది. విపత్కర పరిస్థితుల వేళ మారుమూల ఏజెన్సీప్రాంతాల్లో వైద్య సేవలు అందించే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖల నిర్వహణ పదవీ కాలం ముగియడంతో ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. మొత్తం 15 మంది మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు ఈ 24న (నేడు) నామినేషన్లు స్వీకరిస్తారు. 25న నామినేషన్ల పరిశీలన, 26న ఉపసంహరణ, అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన ఉంటుంది. అక్టోబర్ 4వ తేదీన జిల్లా కలెక్టరేట్‌లో 2,548 సభ్యులు ఓటు వేసేందుకు ఎన్నికలు నిర్వహిస్తారు. రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ప్రధాన పదవుల భరిలో కేవలం ఇద్దరే ఉన్నారు. అందులో ఒకరు డా.ఎస్ఎల్ కాంతారావు కాగా, మరొకరు పట్టణానికి చెందిన కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి చల్లగుళ్ల నాగేశ్వరరావు. క్వెస్ట్ దయాగ్నిస్టిక్ రాజారెడ్డి సైతం భరిలో ఉండాల్సి ఉండగా ఆయన పోటీ నుండి తప్పుకున్నారు. వయస్సు రిత్యా ఆయన నియోజకవర్గ లేదా మండల స్థాయి పదవుల్లో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పట్టణానికి చెందిన కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి సోమశేఖర్, గాంధీపథం అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి సైతం భరిలో ఉంటారనే వార్తలు వచ్చినప్పటికీ నిర్ణీత సమయానికి వారు నామినేషన్ పత్రాలు తీసుకోక పోవడంతో పోటీ ఇద్దరి మధ్యే పరిమితమైంది. అధ్యక్ష రేసులో ఉన్న డా.ఎస్ఎల్ కాంతారావు, చల్లగుళ్ల నాగేశ్వరరావులు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. డా.ఎస్ఎల్ కాంతారావు తన 15 మంది గల కమిటీతో, 13 మంది సభ్యులతో కలిసి చల్లగుళ్ల నాగేశ్వరరావు నేడు నామినేషన్ వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. సుదీర్ఘకాలం పాటు రెడ్‌క్రాస్ సేవలు అందించిన డా. ఎస్ఎల్ కాంతారావు గెలుపు ఖాయమని పలువురు అభిప్రాయపడుతుండగా, ఈ సుదీర్ఘకాలంలో లెక్కల్లో పారదర్శకత లోపించిందనే ప్రచారం సాగుతోంది. డా. కాంతారావు రక్తనిధి తీసుకురావడంతో పాటు మారుమూల ప్రాంతాల్లో కమ్యూనిస్టు హాల్స్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. గత 50ఏళ్లకు పైగా వైద్య వృత్తిలో ఉన్న ఆయన భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలలో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. డాక్టర్ ఉద్యోగం చేస్తూనే రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహణను భుజాన ఎత్తుకుని అనేక వైద్యసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక చల్లగుళ్ల నాగేశ్వరరావు సైతం తన వర్గంతో పోటీలో ఉండగా తానే గెలుస్తానంటూ చెప్పుకొస్తున్నారు. సుదీర్ఘ కాలంపాటు సేవలు అందిస్తున్నట్లు చేసిన కొందరు వారి హయాంలో లెక్కలు సరిగా లేవని, ఆర్థిక దుర్వినియోగం, దోపిడీ చోటు చేసుకుందని అంటున్నారు. ఏక పక్ష కమిటీ ఎక్కువ కాలంపాటు కొనసాగితే సేవా కార్యక్రమాలు అనుకున్నస్థాయిలో ముందుకు సాగవని అంటున్నారు. రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా ఉన్న వారంతా దీనిని ఆలోచన చేయాలని, నూతన కమిటీని ఎన్నుకోవడం ద్వారా సేవా కార్యక్రమాలు మరింత చురుకుగా ముందుకు సాగుతాయని తెలిపారు. మొత్తం మీద రెడ్‌క్రాస్ ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది.

# ఎన్‌కౌంటర్‌లో హతం

**భార్య, ఇద్దరు పూజారులను చంపి.. పిల్లలను బందీలుగా మార్చి..**

**ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్ జిల్లాలో దారుణ ఘటన**

**ఆజాంగఢ్:** ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన జరిగింది. భార్యతో పాటు ఇద్దరు పూజారులను తుపాకీతో కాల్చి చంపిన వ్యక్తి, అనంతరం తన ముగ్గురు పిల్లలను గదిలో బంధించి పోలీసులకు సవాల్ విసిరాడు. దాదాపు ఏడు గంటల పాటు సాగిన హైడ్రామా చివరకు కాల్పులకు దారితీసింది. పోలీసుల ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆజంగఢ్ జిల్లా అహ్రౌలా ప్రాంతంలోని శంభూపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అహ్రౌలా ప్రాంతంలోని శంభుపూర్ గ్రామానికి చెందిన అరవింద్ సింగ్ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య బబితా సింగ్ (32), కుమార్తె పరి (5), కుమారుడు లక్కా (6), ఏడు నెలల వయసున్న మరో కుమార్తె ఉన్నారు. గత కొన్ని రోజులుగా అరవింద్ మతిస్థిమితం సరిగ్గా లేదని కుటుంబసభ్యులు భావించారు. దీంతో అతడి భార్య బబితా సింగ్, భర్త కోసం పూజ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పూజారులు మహేంద్ర పాఠక్ (60), అఖిలేశ్ మిశ్రా (50)లను ఇంటికి పిలిపించింది. మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంట్లోనే పూజ నిర్వహించారు. అదే సమయంలో అరవింద్ ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో తన భార్య ఇద్దరు పూజారులతో కలిసి ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటాన్ని చూశాడు. పూజ జరుగుతున్న సమయంలో పూజారులను ఆచారాల గురించి అరవింద్ ప్రశ్నించాడు. అంతేకాకుండా వారి ఆధార్ కార్డులు అడిగాడు. ఈ విషయంలో మాటామాటా పెరగడంతో తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ పిస్టల్ బయటకు తీసి కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో అరవింద్ భార్య బబితాతో పాటు పూజారులు మహేంద్ర పాఠక్, అఖిలేశ్ మిశ్రా అక్కడికక్కడే మృతి చెందారు. కాల్పులు జరిపిన అనంతరం అరవింద్ తన ముగ్గురు పిల్లలను తీసుకుని ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఇంట్లో అతడి తల్లి సమ్లా దేవి (70), ఐదేళ్ల కుమార్తె పరి, ఆరేళ్ల కుమారుడు లక్కా, ఏడు నెలల పాప కూడా ఉన్నారు.



**రంగంలోకి ఏటీఎస్ బృందం**

కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అరవింద్‌ను లొంగిపోవాలని హెచ్చరించారు. అయితే అరవింద్ ఆ హెచ్చరికలను పట్టించుకోలేదని పోలీసులు తెలిపారు. పైగా పిల్లలను చంపేస్తానని పదేపదే బెదిరించినట్లు చెప్పారు. అంతేకాకుండా వారిపై కాల్పులు కూడా జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఓ చిన్నారి గాయపడ్డాడు. సుమారు ఏడు గంటల పాటు లొంగిపోవాలని నచ్చజెప్పినా అరవింద్ గది నుంచి బయటకు రాలేదు. దీంతో అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటిఎస్) బృందాన్ని రంగంలోకి దించారు. అరవింద్ ఉదయం అధికారులతో మాట్లాడతానని చెప్పినట్లు ఎడిజి నవీన్ అరోరా తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్న సమయంలో ఇంటి లోపల నుంచి అకస్మాత్తుగా కాల్పుల శబ్దం వినిపించింది. తలుపులు బద్దలు కొట్టి లోపలికి గదిలో ముగ్గురు పిల్లలు ఉన్నందున పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. స్టన్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ గ్రెనేడ్లు ప్రయోగించిన అనంతరం తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. ఎస్‌పి అనిల్ కుమార్ కూడా స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఒజి) బృందంతో కలిసి గదిలోకి వెళ్లారు. పోలీసులు లోపలికి ప్రవేశించిన సమయంలో అరవింద్ వారి వైపు ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. దీంతో పోలీసులు ఎదురుకాల్పులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అరవింద్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అరవింద్‌ను వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అయితే బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్పీ అనిల్ కుమార్ వెల్లడించారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. మిగిలిన ఇద్దరు పిల్లలు సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కర్నాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజీనామా

**బెంగళూరు:** కరువు ప్రాంతాల జాబితాలో తన నియోజకవర్గాన్ని చేర్చకపోవడంపై కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి చెందారు. ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకపోకపోవడంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటకలోని విజయపుర జిల్లాకు చెందిన ఇండి నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్ తన పార్టీ అధికారంలో ఉన్న ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేశారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం తన ఎమ్మెల్యే సభ్యత్వానికి యశ్వంతరాయగౌడ పాటిల్ రాజీనామా చేశారు.

కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ జి.ఎస్. పాటిల్‌కు తన రాజీనామా లేఖను ఆయన పంపారు కాగా, ఖరీఫ్ సీజన్‌లో ఇండి తాలూకా తీవ్ర కరువు బారిన పడిందని యశ్వంతరాయగౌడ పాటిల్ తెలిపారు. కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ఆగస్ట్ 28న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. అయితే విజయపుర జిల్లాలోని 13 తాలూకాలలో ఇప్పటి వరకు 11 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారని, కేవలం ఇండి, చడచన్ తాలూకాలను మాత్రమే మినహాయించారని ఆయన విమర్శించారు. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రభావవంతమైన వ్యక్తులకు, ఒత్తిడి తెచ్చే పద్ధతులను అనుసరించే వారికే ప్రాధాన్యత లభిస్తోందని యశ్వంతరాయగౌడ పాటిల్ ఆరోపించారు. 'అందువల్ల, నా నియోజకవర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చలేకపోతున్నందున, నేను స్వచ్ఛందంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నా' అని రాజీనామా లేఖలో ఆయన పేర్కొన్నారు. మరోవైపు సిఎం డికె శివకుమార్ నేతృత్వంలోని మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు దక్కకపోవడంతో యశ్వంతరాయగౌడ పాటిల్ గతంలో ఆగస్ట్ 3న కూడా తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే పార్టీ నాయకత్వం నచ్చజెప్పడంతో దానిని ఉపసంహరించుకున్నారు.


## R.B.V.R.R. COLLEGE OF EDUCATION

SEETHARAMPUR, KARIMNAGAR Dist.
Ph: 0878-2222829, Email: principalrbvrrcoeknr@gmail.com

### SPOT ADMISSION NOTIFICATION


The following unreported /cancelled of B.Ed Should report on or before 25-09-2026 by 4-00pm otherwise their seats will be cancelled and the same may be filled with spot admissionson27-09-2026 at 10.00 A.M at our college campus as per guidelines of TGCHE/Ed-CET-2026 Convener

| S.No. | H.T.No. | RANK | NAME | CATEGORY | ALLOTED CATEGORY | METHODOLOGY |
|---|---|---|---|---|---|---|
| 1 | 2615008245 | 13159 | IRUMALLA RAJITHA | OC | REG_OPEN_OU_GE | BIO |
| 2 | 2614304770 | 13591 | BHAGATH BHAVYADEEP | SC Group - 3 | REG_OPEN_OU_GEN | BIO |
| 3 | 2625003051 | 13784 | THALARI SHAILAJA | SC Group - 3 | REG_OPEN_OU_GEN | BIO |
| 4 | 2615008234 | 13898 | ZARA KOUNAIN | BC-E | REG_BCE_UNR_FEMALE | BIO |
| 5 | 2615011050 | 15636 | BANDI SWETHA SRI | BC-B | REG_BCB_OU_FEMALE | BIO |
| 6 | 2625102046 | 18289 | BORRA CHANDANA | BC-B | REG_BCB_OU_FEMALE | BIO |
| 7 | 2625008087 | 18367 | JOGA BHAVANA | BC-B | REG_BCB_OU_GEN | BIO |
| 8 | 2625608108 | 18711 | PERUKA VIGNESHWARI | BC-D | REG_BCD_OU_GEN | BIO |
| 9 | 2615601619 | 21191 | KOTTEM KRISHNAVENI | ST | REG_ST_OU_GEN | BIO |
| 10 | 2615602140 | 10638 | MEKALA SRIHARI | SC Group - 3 | REG_OPEN_OU_GEN | MATHS |
| 11 | 2625010027 | 16047 | SIRIPURAM SAGARIKA | BC-B | REG_OPEN_OU_FEMALE | MATHS |
| 12 | 2624103153 | 17013 | MANGARAPU MAMATHA | BC-D | REG_OPEN_OU_GEN | MATHS |
| 13 | 2624108424 | 17141 | GUGLOTH KAVERI | ST | REG_OPEN_OU_FEMALE | MATHS |
| 14 | 2614107378 | 18283 | NASPURI APARNA | BC-B | REG_BCB_OU_GEN | MATHS |
| 15 | 2615008062 | 20765 | BHAKTHU MANISHA | SC Group - 3 | REG_SC2_OU_FEMALE | MATHS |
| 16 | 2614102002 | 20923 | KALVA NAVITHA | BC-B | REG_BCB_OU_GEN | MATHS |
| 17 | 2614301562 | 21361 | PASULA VAISHALI | BC-D | REG_SC3_UNR_GEN | MATHS |
| 18 | 2615602185 | 21949 | JAKKULA SHIVANI | SC Group - 3 | REG_SC2_OU_GEN | MATHS |
| 19 | 2624306631 | 22124 | AKULA VIDYA | BC-D | REG_BCC_OU_GEN | MATHS |
| 20 | 2615401093 | 22399 | THAKRE SHUBHAM | BC-B | REG_BCC_OU_GEN | MATHS |
| 21 | 2625010022 | 23519 | RAGI SOUMYA | BC-D | REG_ST_OU_GEN | MATHS |
| 22 | 2625001297 | 23800 | MOHAMMAD SAMREEN | BC-B | REG_ST_OU_FEMALE | MATHS |
| 23 | 2625001614 | 24179 | GULLAPELLI PRANAVI | BC-B | REG_BCD_OU_GEN | MATHS |
| 24 | 2615608072 | 26011 | ADEPU SHAMILI | BC-B | REG_BCA_OU_GEN | MATHS |
| 25 | 2615601484 | 19930 | GAJJELA SUSHMITHA | BC-D | REG_BCD_OU_GEN | PHY SCIE |
| 26 | 2615006092 | 21945 | ANDE REVATHI | SC Group - 2 | REG_SC2_OU_FEMALE | PHY SCIE |
| 27 | 2615601942 | 24967 | GUTOJU MAMATHA | BC-B | REG_BCB_OU_GEN | PHY SCIE |
| 28 | 2615006246 | 26426 | PABBA HEMALATHA | SC Group - 3 | REG_ST_OU_GEN | PHY SCIE |
| 29 | 2615003063 | 13610 | BOINI SPANDANA | SC Group - 2 | REG_SC2_UNR_FEMALE | SOCIAL |
| 30 | 2615606180 | 22026 | GURRALA RAKSHITH | BC-D | REG_BCD_OU_GEN | SOCIAL |
| 31 | 2615010117 | 22258 | ADIBA FIRDOUS | OC | REG_BCA_OU_FEMALE | SOCIAL |
| 32 | 2625001695 | 22767 | JAVERIYA FATHIMA | BC-E | REG_BCE_OU_GEN | SOCIAL |
| 33 | 2625002083 | 22809 | MAMIDIPALLI HEMANTH KUMAR | SC Group - 2 | REG_SC2_OU_GEN | SOCIAL |
| 34 | 2625601405 | 23877 | MAMIDALA KASTURI | SC Group - 2 | REG_SC1_OU_GEN | SOCIAL |
| 35 | 2615008059 | 23985 | MANDA RAJESH | SC Group - 2 | REG_BCE_OU_GEN | SOCIAL |
| 36 | 2625001227 | 24152 | AMMULA PRAVALIKA | SC Group - 3 | REG_SC3_OU_GEN | SOCIAL |
| 37 | 2624305261 | 24285 | S SWAPNA | BC-D | REG_BCB_OU_FEMALE | SOCIAL |
| 38 | 2615010055 | 25935 | LOKINI PUJA | ST | REG_ST_OU_FEMALE | SOCIAL |
| 39 | 2615008125 | 26257 | YENAGANTI PRAVALIKA | BC-B | REG_BCB_OU_FEMALE | SOCIAL |
| 40 | 2625003068 | 26356 | BHUKYA AKHILA | ST | REG_ST_OU_GEN | SOCIAL |
| 41 | 2625010117 | 26620 | CHINTHAKINDI SRAVANTHI | BC-B | REG_BCB_OU_GEN | SOCIAL |
| 42 | 2625608067 | 26726 | JAGARI NAGAMANI | BC-D | REG_BCD_OU_FEMALE | SOCIAL |
| 43 | 2625008186 | 26836 | PADAKANTI ABHINAYA | BC-B | REG_BCB_OU_FEMALE | SOCIAL |

Note: SIXTEEN (16) Left over Seats not filled by Convener TS.Ed CET-2026

Sd/- secretary &correspondent


# జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే హక్కు లేదు



**న్యూఢిల్లీ:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు కుమార్ పదవిలో కొనసాగే హక్కు లేదని, ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. తమకు తెలియకుండా లేదా తమ ఆమోదం లేకుండా ఎన్నికల కమిషన్ పేరుతో జారీ చేసిన నిర్ణయాలు, ఉత్తర్వులపై 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, అభ్యంతరాలు నమోదు చేశారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' తన కథనంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున మండిపడ్డాయి. 'కొన్నేళ్లుగా, కాంగ్రెస్ పార్టీ, అనేక ప్రతిపక్ష పార్టీలు దేశంలో ఎన్నికల నిష్పాక్షికతపై ప్రశ్నలు లేవనెత్తుతూనే ఉన్నాయి. ఎన్నికల కమిషన్ పాత్రపై మాకు నిరంతరం అనుమానం కలుగుతూనే ఉంది. మేము ప్రశ్నలు లేవనెత్తినప్పుడు, వాటిని ఒక జోక్‌గా కొట్టిపారేశారు. కమిషన్ తలుపులు మా కోసం మూసివేయబడ్డాయి' అని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. నేడు, అదే సమస్య స్వయంగా ఎన్నికల కమిషన్ నుండే వెలుగులోకి వచ్చిందని, ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు 14 సార్లు లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ దేశం ముందు నిరంతరం లేవనెత్తిన 'ఓట్ల చోరీ' 'సర్' అంశాలు ఇప్పుడు సరైనవేనని రుజువవుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఖర్గే అన్నారు. '2026 ఏప్రిల్ 24న, 73 మంది ప్రతిపక్ష రాజ్యసభ ఎంపిలు సిఇసి కుమార్‌ను తొలగించాలని కోరుతూ సెక్రటరీ జనరల్‌కు ఒక కొత్త 'నోటీస్ ఆఫ్ మోషన్' సమర్పించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఇంకా ముగియలేదు. ఇప్పుడు గౌరవనీయులైన రాజ్యసభ చైర్మన్ ఆ పెండింగ్‌లో ఉన్న నోటీసుపై నిర్ణయం తీసుకుంటారా? అని ఖర్గే ప్రశ్నించారు. ఈ రోజు ప్రశ్న కేవలం 'ఓట్ల చోరీ'కి సంబంధించినది మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్యాన్ని, దాని వ్యవస్థలను ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకోవడానికి సంబంధించినదని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి మోదీ నుండి దేశం సమాధానం కోరుతుందని ఆయన అన్నారు. భారత ప్రజల నుండి ప్రజాస్వామ్యాన్ని లాక్కోవాలని కుట్ర పన్నుతున్న వారికి తగిన సమాధానం లభిస్తుందని ఖర్గే స్పష్టం చేశారు. కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదన్న విషయంలో ఎలాంటి సందేహం లేదని కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పేర్కొన్నారు. 'తమ యజమాని (అధికార పక్షం) ఆదేశాల మేరకు ఒక వ్యక్తి తన ఇష్టానుసారం ఓటర్ల పేర్లను ఎలా తొలగిస్తారు? ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసే స్పష్టమైన చట్టవిరుద్ధమైన చర్యలు తీసుకోవడానికి తోటి రాజ్యాంగబద్ధ అధికారులను ఎలా పక్కన పెడతారు?' అని ఆయన ప్రశ్నించారు.

**'సర్' నిలిపివేయాలి : సిపిఐ(ఎం)**



'సర్'ను ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణే పదవి నుంచి తొలగించాలని సిపిఐ (ఎం) డిమాండ్ చేసింది. సర్‌లో ఇద్దరు కమిషనర్ల అభ్యంతకరమైన విషయాలు కేవలం సర్ ప్రక్రియ గురించే కాకుండా, అంతకంటే ముఖ్యంగా భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) విశ్వసనీయతపైనే తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రారంభమైనప్పటి నుండి సిపిఐ(ఎం), ఇతర ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సంస్థలు వ్యక్తం చేసిన అనుమానాలను, ఆందోళనలను ఈ వెల్లడైన విషయాలు మరింత బలపరిచాయి' అని సిపిఐ(ఎం) పేర్కొంది. చట్టం ప్రకారం ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమానమని, ఏవైనా భిన్నాభిప్రాయాలు ఉంటే మెజారిటీ లేదా ఏకాభిప్రాయం ద్వారా వాటిని పరిష్కరించుకోవాలని ఆ వామపక్ష పార్టీ పేర్కొంది. 'సిఇసి ఈ నియమాన్ని పాటించ లేదు, పైగా తన తోటి ఎన్నికల కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోకుండా తన అభిప్రాయాలను రుద్దుతూ వచ్చారు' అని ఆ పార్టీ తెలిపింది.

**'సర్' చట్ట విరుద్ధం చేస్తున్నారు : ఆప్**



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఎన్నికల సంఘాన్ని తన సొంతంగా నడుపుతూ, దేశవ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ మొత్తాన్ని 'చట్టవిరుద్ధం' చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. 'గత కొన్ని నెలలుగా ఎన్నికల సంఘం సమావేశాలు జరగడం లేదు, అయితే జ్ఞానేష్ కుమార్ తన సొంతంగా ఉత్తర్వులు జారీ చేస్తూనే ఉన్నారు. అందువల్ల, దేశవ్యాప్తంగా 13 కోట్ల పేర్లను తొలగించిన మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టవిరుద్ధం, ఎందుకంటే ఎన్నికల సంఘం దీనిని అధికారికంగా ఆమోదించలేదు' అని ఆయన ఒక పత్రికా సమావేశంలో అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసి మూడేళ్ల క్రితం నాటి ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 'ఈ దేశంలో ఇంతకంటే పెద్ద కుంభకోణం ఉండదు. ఒకవేళ మొత్తం ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ కేంద్ర కార్యాలయం నుంచే తయారు చేస్తుంటే, ఆ ఓటర్ల జాబితాను ఇఆర్ఓ లేదా ఎస్‌డిఎం తయారు చేయకపోతే, అప్పుడు దేశం మొత్తం ఓటర్ల జాబితా వాస్తవంగా రాజీపడినట్లే' అని ఆయన అన్నారు.

**జ్ఞానేష్‌పై తీర్మానం మళ్లీ తెరపైకి తేవాలి : టిఎంసి**



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ఐదు నెలల క్రితం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావాలని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓ బ్రియన్ పిలుపునిచ్చారు. సిఇసి తీసుకున్న అనేక చర్యలను ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యతిరేకించారన్న ఈ పెద్ద వార్త వెలుగులోకి వచ్చిన తర్వాత, ఆయనను అభిశంసించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రాజ్యసభ నోటీసు జారీ చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎక్స్‌లో పేర్కొన్నారు.

**సిఇసి జైలుకు వెళ్తారు : శివసేన (యుబిటి)**



'సర్' విషయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ జైలుకు వెళ్తారని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఇక వారి యజమానులు దేశం విడిచి పారిపోతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే కోరిక కనీసం ఒక శాతం ఉన్నా సరే, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని రౌత్ న్యూఢిల్లీలో విలేకరులతో అన్నారు. 'జ్ఞానేష్ కుమార్‌ను కూడా తొలగించి, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఒకవేళ మోదీ జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోకపోతే, సిఇసిని తొలగించాల్సిందిగా రాష్ట్రపతిని కోరుతున్నాను' అని ఆయన అన్నారు. ఒకవేళ రాష్ట్రపతి ఏమీ చేయకపోతే, ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడటానికి ఆర్మీ చీఫ్ (సైన్యాధిపతి) ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు.

**తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : ఎన్‌సిపి (ఎస్‌పి)**



ఎన్నికల సంఘంలో విభేదాలు తలెత్తుతున్నాయన్న వార్తలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) పిలుపునిచ్చింది. ఈ విషయం ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కులకు సంబంధించినదని, దీనిని రాజకీయ అంశంగా పరిగణించకూడదని పేర్కొంది. ఎన్నికల సంఘంలో విభేదాలు ఉన్నాయన్న వార్తలపై ఢిల్లీలో విలేకరులు అడిగినప్పుడు, 'వ్యవస్థే కుప్పకూలుతుంటే మనం ఎవరిని నమ్మాలి?' అని సూలే అన్నారు. ఈ విషయం 'చాలా చాలా తీవ్రమైనదని, దీనిపై అన్ని రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో బహిరంగ చర్చ జరగాలని ఆమె అన్నారు. 'ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. ఇది దేశంలోని ప్రతి పౌరుడి హక్కులకు సంబంధించినది. ఇది ఇప్పుడు జాతీయ సమస్యగా మారింది' అని సూలే అన్నారు. ఆరోపణలలో నిజం ఉందో లేదో నిర్ధారించుకోవడానికి వాటిపై బహిరంగంగా చర్చ జరగాలని ఆమె డిమాండ్ చేశారు.

**ఎన్నికల సంఘంలో జోక్యం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే : ఎస్‌పి**



ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించని సమయంలో ఏర్పడిన ప్రభుత్వాలు 'రాజ్యాంగ విరుద్ధం' అని, ఎన్నికల సంఘం పనితీరులో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యాన్ని 'కాలరాయడమే' అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. లక్నోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఒక నిష్పక్షపాత సంస్థగా పరిగణించబడుతుందని, అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని ఆశిస్తారని యాదవ్ పేర్కొన్నారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదికను ప్రస్తావిస్తూ, ఎన్నికల సంఘం 'ఎవరి తరపున' పనిచేస్తోందనే ప్రశ్నలను ఈ పరిణామం లేవనెత్తిందని ఆయన అన్నారు. 'ఇది మన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇది మన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నం,' అని ఆయన అన్నారు. 'ఇప్పుడు మీరు ఏమని ఊహించగలరు? ఎన్నికల సంఘం న్యాయంగా వ్యవహరించి ఉంటుందా? అది నిష్పక్షపాతంగా ఉండి ఉంటుందా?' అని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

# ఆదివారమూ బ్యాంకులు ఓపెన్

- ప్రతిపాదిత బ్యాంకుల సమ్మెతో ముందస్తు చర్యలు
- ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ:** బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ఆర్థిక శాఖ కీలక ప్రకటన చేసింది. సెప్టెంబర్ 27 ఆదివారం దేశవ్యాప్తంగా బ్యాంకులు సాధారణంగానే పనిచేయనున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) అనుమతితో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మాత్రమే కాకుం డా, బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఎటిఎం లింక్ శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. వరుస సెలవులు, ప్రతిపాదిత బ్యాంకు సమ్మె కారణంగా ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపునిచ్చింది. దీనికి ముందు సెప్టెంబర్ 26 నాలుగో శనివారం, 27 ఆదివారం కావడంతో సాధారణంగా బ్యాంకులకు వరుసగా సెలవులు ఉండేవి. అదే సమయంలో సెప్టెంబర్ 30 బ్యాంకుల అర్ధ సంవత్సర ముగింపు తేదీ కావడంతో, వరుసగా బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్న ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజల అత్యవసర బ్యాంకింగ్ అవసరాలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ 27న అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణంగా పనిచేస్తాయని ఆర్థిక శాఖ తెలిపింది. ఆ రోజు బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఎటిఎం లింక్ బ్రాంచ్ లు, కరెన్సీ చెస్ట్‌లు పనిచేసేందుకు ఆర్‌బిఐ అనుమతి ఇచ్చినట్లు వెల్లడించింది. బ్యాంకు ఖాతాదారుల సంక్షేమం, సౌకర్యానికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేసింది. అత్యవసర బ్యాం కింగ్ సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది.

**అసలు సమ్మె ఎందుకు?:** బ్యాంకు ఉద్యోగుల సంఘాల సమాఖ్య యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బి యు) ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిచ్చారు. ఐదు రోజుల పని విధానం అమలు చేయాలన్నదే ప్రధా న డిమాండ్ అని ఆల్ ఇం డియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ((ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. గతంలో ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌తో కుదిరిన ఒప్పందంలో ఐదు రోజుల పని విధానం అంశం ఉందని పేర్కొన్నారు. ఈ డిమాండ్‌పై సెప్టెంబర్ 22న కేంద్ర కార్మిక శాఖ చీఫ్ లేబర్ కమిషనర్‌తో చర్చలు జరిగినట్లు తెలిపారు. సమ్మెను విరమించాలని ఆర్థిక శాఖ చేసిన విజ్ఞప్తిపైనా యూనియన్లు సానుకూలంగా స్పందించలేదని వెంకటాచలం చెప్పారు. తమ డిమాండ్‌పై స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదని ఆయన పేర్కొన్నారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టివేత



**న్యూఢిల్లీ:** ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మంది ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9 కోట్ల విలువైన 6.5 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో ఒక మహిళ ఉన్నారు. ప్రయాణికులు ఒక ప్రదర్శన నిమిత్తం దుబాయ్ వెళ్లి ఈనెల 21న ఢిల్లీ చేరుకున్నారని అధికారులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వారు ప్రయాణించిన విమానంలో తనిఖీలు చేయగా రెండు సీట్ల కింద మూడు సంచుల్లో ఆభరణాల రూపంలో ఉన్న బంగారం గుర్తించామని, దానిని గుర్తించకుండా ఉండేందుకు వెండి, నలుపు రంగులు పూసారని వెల్లడించారు. పట్టుబడిన ఎనిమిది మంది ప్రయాణికులకు వైద్య పరీక్షలు నిర్వహించి పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.


**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 32 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Sri.Shivani Pathi & others**

**... Opponents**

1. Sri.Shivani Pathi, D/o. Sadanandam, aged about : 25 years, Occ: Private Employee R/o: 1-1-931/303, Siddartha Nagar, Road No. 11/2, Kazipet, Beside Flyovewr Bridge, Hanamkonda, Warangal, Warangal, Telangana, India - 506004 Mobile: 9866275101.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 48 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr. Rajender Mandala & others**

**... Opponents**

1. Mr.Rajender Mandala, S/o. Ilaiah, aged about : 48 years, Occ: Business, R/o: H.NO. 2-243, PENCHIKALPET, ATMAKUR, Warangal, Telangana, India - 506342 Mobile:9963271613.
2. Mrs.Thirupathi Kanche, S/o. Narsaiah, aged about :48 years, Occ: Conductor,O/o. TGRTC, Bhupalpally Depot. R/o: H.No. 3-4, PENCHIKALAPETA, ATMAKUR, Warangal, Telangana, India - 506001 Mobile: 9701654737.
3. Mr.Ramya Krishna Gotte, D/o. Sarangam, aged about : 39 years, Occ: Sr Asst O/o. Deputy Dt Medical & Health Hasanparthy. R/o: H.No. 6-75, NEERUKULLA, ATHMAKUR, Warangal, Telangana, India - 506342 Mobile:9652533223.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 50 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mrs.Bharathi Nethakani & others**

**... Opponents**

1. Mrs.Bharathi Nethakani, D/o. Sammaiah, aged about : 47 years, Occ:Business,R/o:1-9-1655, Deendayal Nagar, Hanamkonda, Warangal., Hanam konda, WARANGAL, Warangal (Urban), Telangana, India - 506001 Mobile: 9652063585
2. Mr.Bandi Ashok, S/o. Srihari,aged about :57 years,Occ:ASST. ENGINEER, O/o. Northern Power Distribution Company Of Telangana Ltd. Tharigoppula, R/o:H.No.2-3 Ladella, Warangal, Telangana, India - 506006 Mobile: 9440814114
3. Mr.Madasi Manohar, S/o. Ellaiah,aged about :33 years,Occ: SUB ENGINEER,O/o. Npdcl Jangaon Division. R/o:H.No.3-6/1 Pogallapalle Kothaguda Warangal, Telangana, India - 506135 Mobile:8500037630
4. Mr.Ankam Manideep, S/o. Sambaiah, aged about :30 years,Occ: SUB ENGINEER, O/o. Npdcl Jangaon Divistion, R/o: H.No. 1-8-1/93 suryanagar Chikkadapally, Hyderabad, CHIKKADA PALLY, HYDERABAD, Hyderabad, Telangana, India - 500020 Mobile:8374903001.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 93 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr.Venkataswamy Are & others**

**... Opponents**

2. Mr.Erraiah Arsam, S/o. Mallaiah, aged about : 55 years, Occ: GENERAL MAZDOOR, O/o. Singareni Colleries Company Ltd SRP-3 Incline,. R/o: H.No. 1-55, Thimmapur, Laxettipeta, Adilabad, Telangana, India - 504207 Mobile: 9398345602
4. Mr.Shravan Gaddam, S/o. Shankar Reddy, aged about : 40 years, Occ: GENERAL MAZDOOR, O/o. Singareni Collories Company Ltd., Kasipet, R/o: H.No. 5, BALAJI RESIDENCY, MANCHERIAL, Mancherial, Telangana, India - 504251 Mobile:7207630048.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATION WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 107 of 2026**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., NAKKALAGUTTA CAO Branch, R/o.WARANGAL.**

**.... Disputant**

AND

**Mr.Narsaiah Engalal & others**

**... Opponents**


1. Mr.Narsaiah Engalal, S/o. Muthaiah, aged about : 48 years, Occ: Business, R/o:H.No-1-87/2,Repaka- Regonda-Jayashankar, REGONDA-JAYA SHANKAR, Warangal (Rural), Telangana, India - 506348 Mobile:9848848406
2. Mrs.Samarla Bixapathi, S/o. Peddaramaiah,aged about :42 years,Occ:ARTISAN II, O/o. TGNPDCL,Repaka, R/o: 3-92, REGONDA, Warangal, Telangana, India - 506348 Mobile: 9346635462
3. Mrs.Aldandi Nagaraju, S/o. Sudharshanam, aged about :45 years, Occ: MECHANIC, O/o.Sccl Mines, Bhupalpally, R/o:1-34, DAMMANNAPET, REGONDA, Warangal, Telangana, India - 506164 Mobile:9908143741
4. Mrs.Yeldandi Purna Prasad, S/o. Sudarshan, aged about :49 years, Occ: JPA, O/o.TS GENCO, Ktpp Chelpur. R/o: 1-34, DAMMANNAPET, REGONDA WGL, Warangal, Telangana, India - 506164 Mobile: 9949723825.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **09-10-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATION, WARANGAL**

# జిన్‌పింగ్‌కు ఘనమైన స్వాగత ఏర్పాట్లు

## 500 మంది సైనికులతో ఆహ్వానం



**వాషింగ్టన్ :** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆయన సతీమణి పెంగ్ లియువాన్‌లకు వాషింగ్టన్ బేస్ రన్ వే వద్ద అరుదైన స్వాగతం పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రహ్మాండమైన సన్నాహాలు చేశారు. దాదాపు దశాబ్దం కంటే ఎక్కువ సంవత్సరాల తర్వాత మొదటిసారి చైనా అధ్యక్షుడు అమెరికాలో పర్యటిస్తున్నారు. జిన్‌పింగ్ విమానం దిగి వైట్‌హౌస్‌కు వచ్చే వరకూ వేచి చూడకుండా ఆండ్రూ ఎయిర్‌ఫోర్స్ బేస్ రన్ వే వద్ద ఎర్ర తివాచీ పరచి అక్కడ ట్రంప్ సిద్ధంగా నిలబడి ఉంటారు. 500 మంది సైనికులు ఎంతో ఘనంగా ఈ ఆహ్వాన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మూడు రోజులపాటు అమెరికాలో జిన్‌పింగ్ పర్యటన ఎంతో ఆడంబరంగా కొనసాగేందుకు ఏర్పాట్లు చేశారు. ఐతే జిన్‌పింగ్ న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలలో మాత్రం పాల్గొనడంలేదు. మే నెలలో ట్రంప్ చైనా పర్యటన సందర్భంగా ఎంతో వైభవంగా ఆయనకు స్వాగత సత్కారాలు, విందు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందుకు తగ్గట్టుగానే వైట్‌హౌస్‌లో కూడా బుధవారంనాడు ట్రంప్ బ్రహ్మాండమైన విందు జిన్‌పింగ్,ఆయన పరివారం కోసం ఏర్పాటు చేశారు. కానీ వాణిజ్య వివాదాలు, కృత్రిమ మేధస్సు విషయంలో అగ్రదేశాలమధ్య కుట్రలతో కూడిన పోటీ, ఇరాన్‌లో ట్రంప్ యుద్ధం, అమెరికా చెబుతున్నట్టుగా తైవాన్ పై చైనా దురాశ, మార్కెట్ పోటీ,అమెరికాకు సరఫరా చేయకుండా కీలక ఖనిజాల సరఫరా చైనా నిలిపివేయడం వంటి అనేక విషయాలలో ఉన్న విభేదాల మధ్య ఈ స్వాగత సత్కారాలన్నీ కేవలం పైపైన కనిపించే ఆర్భాటాలు మాత్రమే. మౌలిక సమస్యలను ఈ రెండు దేశాలు శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించుకుని ప్రపంచ శాంతికి అగ్రదేశాలు ఎలా దోహదపడతాయన్న విషయమే ప్రపంచ ప్రజలకు, దేశాలకు ప్రధానాంశంగా మారింది. ఈ పర్యటన ద్వారా రెండు దేశాల మధ్యా ఒక వ్యూహాత్మక స్థిరత్వాన్ని కాపాడే చర్యలపై ఎక్కువ దృష్టి పెట్టకుండా ఆర్భాటాలు, ఆడంబర ప్రదర్శన ఏర్పాట్లకు ట్రంప్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తున్నది. జిన్‌పింగ్ గొప్ప నాయకుడని, తాను స్నేహితుడని పిలుచుకునే అత్యంత ఆప్తుడని ట్రంప్ పొగడ్తలలో ముంచెత్తుతున్నారు. ఐతే సెనేట్ సాయుధ సేవల కమిటీ రిపబ్లికన్ ఛైర్మన్ రోజర్ వికర్ ఈ ఆర్భాటాలన్నింటినీ తీవ్రంగా విమర్శించారు. జిన్‌పింగ్‌తో ఉన్న అనేక సమస్యల దృష్ట్యా ఆ కమ్యూనిస్టు నాయకుణ్ణి దేశానికి ఆహ్వానించి ఉండకూడదని ఆయన అన్నారు. ఇరాన్‌కు చైనా స్పష్టమైన మద్దతు, అమెరికాకు వ్యతిరేకంగా చైనా ఎక్కుపెట్టి దాచి ఉంచిన భారీ ఆయుధాల విషయాలను ట్రంప్ ప్రతి నిమిషం గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు.

# గాజా కోసం 2.45 బిలియన్ల ప్రణాళిక

## మౌలిక సదుపాయాలు, సొరంగాల పూడ్చివేత పూర్తి అమలుకు సౌదీ అరేబియా పిలుపు



**దుబాయ్ :** గాజాలో పునర్నిర్మాణానికి ట్రంప్ నాయకత్వంలో ఉన్న గాజా శాంతి మండలి బుధవారంనాటి సమావేశంలో 2.45 బిలియన్ డాలర్లతో ఒక ప్రణాళికను ఆవిష్కరించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసింది. గాజాలో యుద్ధం కారణంగా సర్వ వినాశనం జరిగింది. ఈ వినాశనం నుండి తిరిగి గాజాను సాధారణస్థితికి పునర్నిర్మించడానికి రాబోయే దశాబ్దకాలానికిగాను 71.40 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని శాంతిమండలి అంచనా వేసింది. అదేవిధంగా 35.20 బిలియన్ డాలర్ల మేరకు భౌతిక నష్టం జరిగిందని కూడా శాంతిమండలి అంచనావేసింది. ఐతే ప్రస్తుతం తాత్కాలికంగా సిద్ధంచేసిన 2.45 బిలియన్ డాలర్ల రాబోయే ఆరునెలలపాటు ప్రాథమిక నిర్మాణ కార్యక్రమాలు,శిథిలాల తొలగింపునకు ఉపయోగిస్తారు. ముందుగా ఆసుపత్రులను పునర్నిర్మించడం, శిథిలాలు తొలగించడం, ఉగ్రవాదుల సొరంగాలను శాశ్వత ప్రాతిపదికపై పూడ్చిపెట్టడం,ఆర్థిక మద్దతు, బహుళజాతి భద్రతా దళాల మోహరింపు, విద్యుత్ ఏర్పాట్లు, 25,000 పోర్టబుల్ సోలార్ కిట్ల మోహరింపు, సరిహద్దు క్రాసింగ్‌లకు మరమ్మతులు వంటి అనేక చర్యలు తీసుకుంటారు. ప్రాథమికంగా 66 ప్రాజెక్టులను చేపడతారని ఆక్సియోస్ సంస్థ ప్రకటించింది. తాత్కాలిక గృహనిర్మాణం, శిథిలాల తొలగింపు, ఆసుపత్రులకు మరమ్మతులు, మౌలిక సదుపాయాల ఏర్పాటు ప్రధానమైనవి.

**గాజాపై న్యూయార్క్ డిక్లరేషన్ :**

ఇదిలా ఉండగా, ట్రంప్ ప్రకటించిన గాజా శాంతి ప్రణాళికకు పూర్తిస్థాయిలో అమలు చేయాలని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ పిలుపు ఇచ్చారు. అదేవిధంగా ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ స్థావరాల విస్తరణ సమస్యను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. పాలస్తీనా ప్రతిపత్తి సాధనకోసం న్యూయార్క్ తీర్మానం ప్రకటించడానికి ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా దేశాలతో కలిసి సౌదీ అరేబియా నిర్వహించిన సమావేశంలో ఫైజల్ బిన్ ఫర్హాన్ పైవిధంగా కోరారు. గాజా స్ట్రిప్, వెస్ట్‌బ్యాంక్‌లను గాజా అథారిటీ కింద ఏకీకరణ చేసేందుకు వీలుగా ఒక సమగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు డోనాల్డ్ ట్రంప్ తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన పిలుపు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ నాలుగు దేశాలూ న్యూయార్క్ డిక్లరేషన్ ప్రకటించాయి.

# యెమెన్ రెడ్ సీ కోస్ట్ హౌతీల స్వాధీనం

## సూత్రధారి ఐఆర్‌జిసి ప్రత్యక్ష జోక్యం : ఇంధనంపై ప్రభావం

## అమెరికా, మిత్రదేశాలకు గట్టి ఎదురుదెబ్బ

## అంతర్యుద్ధంలో లక్షమంది నిరాశ్రయం

**సనా :** యెమెన్‌లో ఎర్ర సముద్ర తీర ప్రాంతాన్ని హౌతీ తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్య ప్రపంచ ఇంధన ధరల మరింత పెరుగుదలకు దారితీస్తుంది. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జిసి దళాలు వెనక సలహాదారులుగా క్షేత్రస్థాయిలో నిలబడ్డారు. 2014లో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైనప్పటి నుండీ తన చిరకాల మిత్రదేశానికి ఇరాన్ ప్రత్యక్షంగా ముందునిలబడి జోక్యం చేసుకుని చేసిన కీలకమైన సహాయం ఇదే. ఐఆర్‌జిసి సహాయంతో యెమెన్ ప్రభుత్వ దళాలను హౌతీ ఉగ్రవాద సైన్యాలు తరిమికొట్టి విస్తారమైన భూభాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. హోర్ముజ్ జలసంధి స్వాధీనానికి అమెరికా ప్రయత్నాలు, ఇరాన్‌పై తీవ్ర ఆర్థిక ఆంక్షలు అమలు చేస్తున్న తరుణంలో ఈ కీలక పరిణామం సంభవించింది. అమెరికాను పెద్ద దెబ్బ తీసేందుకు, యుద్ధాన్ని విస్తరించేందుకు ఇదొక కీలక పరిణామంగా మారింది. ఐఆర్‌జిసి సహాయంతో ఈ తీర ప్రాంతాన్ని వారు స్వాధీనం చేసుకోవడంతో అమెరికా దాని మిత్రదేశాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తిరుగుబాటుదారులు సౌదీ అరేబియా పైప్‌లైన్‌ను మూసివేశారు. కీలకమైన చమురు ఎగుమతులను అడ్డుకున్నారు. దీంతో ఆ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీసే స్థాయికి చేరుకున్నారు. ఈ విషయంలో అమెరికా నుండి ఎలాంటి సహాయం లభించకపోవడంతో సౌదీ అరేబియా తీవ్ర అసంతృప్తితో ఉంది. కానీ బ్రిటన్ మాత్రం ముందుకు వచ్చి సహాయం చేస్తోంది. కేవలం 48 గంటల వ్యవధిలో హౌతీ దళాలు ఎర్ర సముద్ర తీర ప్రాంతాన్ని అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వ దళాల నుండి స్వాధీన చేసుకున్ని అందరినీ ఆశ్చర్యపరచాయి. అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్ మద్దతుగల హౌతీలు సముద్ర తీర ప్రాంతాలను స్వాధీనం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సౌదీ అరేబియా మద్దతుగల యెమెన్ ప్రభుత్వ దళాలతో హౌతీల ఘర్షణలు ఆగకుండా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గడచిన నెలరోజులుగా యెమెన్‌లో 1,00,000 మంది ప్రజలు ఇళ్ళు వదిలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. అంతకుముందు కూడా అంతర్యుద్ధం వల్ల ఆ దేశంలో ఇప్పటికే 52 లక్షల మంది ప్రజలు ఇళ్ళు కోల్పోయి నిరాశ్రయులుగా మారారు.

# వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు డిమాండ్

## న్యూయార్క్‌లో రోడ్రిగ్జ్ వ్యతిరేక ప్రదర్శన

**న్యూయార్క్ :** ఐక్యరాజ్యసమితి సమావేశాలకు హాజరైన వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడు డెల్సీ రోడ్రిగ్జ్‌కు నిరసన ఎదురైంది. ఒక చిన్న ప్రదర్శకుల బృందం ఐరాస కార్యాలయం వెలుపల ఆమెకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిపారు. వెనిజులాలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు అవకాశం ఇవ్వాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. చమురు వద్దు, కొత్త ముఖం, పాత పాలన'' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెనిజులా జాతీయ జెండాలను ప్రదర్శకులు ప్రదర్శించారు. దేశంలో స్వేచ్ఛాయుత ఎన్నికలకు ట్రంప్ కృషి చేయాలని వారు కోరారు. వారంతా వెనిజులా జాతీయ గీతాన్ని ఆలపించారు.''డెల్సీ ఒట్టు, మదురోతో పాటు నువ్వు కూడా బ్రూక్లిన్ జైలుకు వెళుతున్నావు'' అని నినాదాలు చేశారు. మదురోను అరెస్టుచేసిన వారితో వెనిజులాలో ఒకనాటి పాలకవర్గంలో భాగస్వాములు సమావేశాలు జరపడం అతిదారుణంగా ఉందని వారు నినాదాలు చేశారు. ఈ అమెరికా ప్రభుత్వం వల్లనే మన దేశం స్వేచ్ఛకు దూరమైందని కారకస్ నుండి వలస వచ్చిన 34 ఏళ్ళ సోషల్ మీడియా మేనేజర్ మిగెల్ ఎడ్వర్డో మార్టినెజ్ విమర్శించారు. ఇదిలా ఉండగా, అమెరికా–వెనిజులా మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని వివిధ రంగాలలో విస్తరించేందుకు న్యూయార్క్ వేదికగా చర్చలు జరిగాయి.




వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మొదటి సారి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలలో పాల్గొనేందుకు న్యూయార్క్ వెళ్ళిన సందర్భంగా ట్రంప్‌తో సమావేశమయ్యారు. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్, అధ్యక్షుడి సహాయకుడు స్టీఫెన్ మిల్లర్ తదితరులు పాల్గన్నారు. ట్రంప్ ఏర్పాటు చేసిన విందులో ఇరు దేశాల అధ్యక్షుల మధ్యా ఏకాంత సమావేశం జరిగింది. అన్నివిధాలుగా పెట్టుబడులు పెట్టేందుకు వెనిజులా ఎంతో సానుకూలమైన దేశమని చెప్పేందుకు వివిధ శాఖాధికారులు డెల్సీ రోడ్రిగ్జ్ వెంట వెళ్ళారు. ఇంధనం, మైనింగ్, భద్రతారంగాలలో రెండు దేశాల మధ్యా సంబంధాలను బలోపేతం చేయడంలో ఈ సమావేశం చరిత్రాత్మకమైనదని రోడ్రిగ్జ్ అన్నారు. ఈ కొత్త దశలో ఇరుదేశాల మధ్యా ఉన్న చారిత్రక అనుబంధాన్ని ముందుకు నడిపించాల్సి ఉంటుందని టెలిగ్రామ్ ద్వారా ఆమె ఒక సందేశాన్ని అప్‌లోడ్ చేశారు.

# ఫలవంతం!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు.''వారు (ఇరాన్) విజయంతంగా చర్చల దశను పూర్తిచేశారు, మధ్యవర్తులు తమ బాధ్యతలను కొనసాగిస్తారు,ఈ ప్రక్రియ నిర్మాణాత్మకంగా,ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నాను'' అని ఎక్స్ వేదికగా విట్‌కాఫ్ పేర్కొన్నారు. విట్‌కాఫ్‌ను అరాఘ్చీ కలిశారని ఇరాన్ ప్రభుత్వ టీవీ ధృవీకరించింది.

మంగళవారంనాడు డోనాల్డ్ ట్రంప్ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ, గతంలో తరహాలోనే ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక చేశారు. అదేరోజు అబ్బాస్ అరాఘ్చీ–విట్‌కాఫ్ మధ్య సంభాషణలు జరిగాయి. పశ్చిమాసియా నుండి సైన్యాన్ని తగ్గించుకుని వెనక్కి మళ్ళించేందుకు అమెరికా చొరవ చూపించి సానుకూల చర్యలు ప్రారంభిస్తే వారంరోజుల వ్యవధిలోనే హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని ఇరాన్ ఉన్నతస్థాయి అధికారి ఒకరి ద్వారా సందేశం బయటకు వచ్చిన వెంటనే ఈ చర్చలు జరిగాయి. హోర్ముజ్ జల సంధి

తెరచుకోవాలంటే తాము విధించిన ఏడు షరతులు అంగీకరించడం తప్ప అమెరికాకు మరోమార్గం లేదని ఇరాన్ ప్రకటించిన ఐదు రోజుల తర్వాత ఈ సమావేశం జరిగింది.

ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా దాడిచేసి ఆ దేశ సుప్రీం అధినేత ఆయెతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులను హతమార్చింది. ఆ తర్వాత పశ్చిమాసియాలో అమెరికా మిత్రదేశాలపై ఇరాన్ దాడులతో తీవ్ర నష్టం కలగజేసింది. ఐఆర్‌జిసి సైనికులు హోర్ముజ్ జలసంధిని తమ అధీనంలోకి తెచ్చుకుని పూర్తిగా మూసివేశారు. దీంతో ప్రపంచదేశాలు తీవ్ర చమురు సంక్షోభంలో మునిగిపోయాయి.

**దురాక్రమణ అపేయమని చెప్పాం**

**నిరాశానిస్పృహతోనే ట్రంప్ హెచ్చరిక**

ఇరాన్‌పై ఎనిమిది నెలలుగా సాగిస్తున్న దురాక్రమణ చర్యలను తక్షణం ఆపేయాలని మధ్యవర్తి ఖతార్ ద్వారా అమెరికా ప్రతినిధిని కోరినట్లు ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ చెప్పారు. ''అన్ని రంగాలలోనూ యుద్ధాన్ని ఆపేయాలి, ఆర్థిక యుద్ధాన్ని నిలిపివేయాలి,దురాక్రమణ ఇకమీదట కొనసాగకూడదు, ఇరాన్ అభిప్రాయాలను, షరతులను చాలా స్పష్టంగా వారికి తెలియజేశాం''అన్నారు. న్యూయార్క్‌లో మూడు గంటలసేపు అమెరికా–ఇరాన్ ప్రతినిధులమధ్య జరిగిన సమావేశ వివరాలను టెహ్రాన్‌లో ఆయన బుధవారం ప్రభుత్వ మీడియా''ఇర్నా''కు తెలియజేశారు. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులకు ఎలాంటి నౌకలనూ రానివ్వకుండా సెంట్‌కామ్ అమలుచేస్తున్న దిగ్బంధన చర్యలు నిలిపివేయాలని, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని, అమెరికా సైన్యాలను పశ్చిమాసియా నుండి వెలుపలికి తరలించాలనే డిమాండ్‌లతోపాటు ఇతర ముఖ్యాంశాలను కూడా అమెరికా ప్రతినిధికి తెలియజేసినట్లు చెప్పారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ట్రంప్ నిరాశానిస్పృహలతోనే ఇరాన్‌కు హెచ్చరికలు చేశారని బఖాయి అన్నారు. ఈ వేదికవద్ద ఉన్న అనేక దేశాల దౌత్యవేత్తలు,ప్రతినిధుల అంచనా ప్రకారం, ట్రంప్ హెచ్చరికలు బలం నుండి వస్తున్నవికావు, నిరాశ నుండి,నిస్పృహనుండి వస్తున్నాయి అన్నారు. అత్యంత బలమైన ఈ వేదికను చట్టవిరుద్ధమైన వ్యాఖ్యలకు ఉపయోగించడం వారి బలానికి నిదర్శనం కాదన్నారు.

కాగా ఇర్నా ప్రతినిధి సమాచారం ప్రకారం న్యూయార్క్‌లో అబ్బాస్ అరాఘ్చీ అనేక దేశాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. హోర్ముజ్ జలసంధిపైన,పశ్చిమాసియా యుద్ధం గురించి ఇరాన్ అనుసరిస్తున్న వైఖరిని వారికి తెలియజేశారు.ఇరాన్ తన వైఖరిని ప్రపంచదేశాలకు తెలియజేయడంకోసం ఈ కీలకమైన వేదికను సద్వినియోగం చేసుకుంటున్నదని ఇర్నా ప్రతినిధి పేర్కొన్నారు.

**నాశనం చెయ్యాలా? గొప్పదేశంగా మార్చాలా?**

**నాకున్నవి రెండే రెండు మార్గాలు : ట్రంప్**

జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రసంగించిన డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై తన యుద్ధాన్ని పూర్తిగా సమర్థించుకున్నారు. ఇరాన్ విషయంలో తన ముందు రెండే రెండు మార్గాలున్నాయన్నారు. ఇరాన్‌ను అత్యున్నతమైన దేశంగా మార్చేందుకు ఒప్పందం చేసుకోవడం లేదా ఆ దేశాన్ని సర్వనాశనం చేయడం తన ముందున్న రెండు మార్గాలని ప్రపంచవేదికపై హెచ్చరిక చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలా? లేక ఆ దేశాన్ని నాశనం చేసి నరకతుల్యంగా మార్చాలా? అనే విషయంలో తాను ఇంకా ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు.ఇరాన్ ఒక ఒప్పందానికి రాకపోతే ఆ దేశాన్ని పూర్తిగా నాశనం చేయడమే తనముందున్న ప్రత్యామ్నాయమన్నారు. ''పశ్చిమాసియాలో లేదా ప్రపంచంలోనే ఒక అత్యుత్తమ దేశంగా ఎదిగేందుకు ఒక చారిత్రాత్మక ఒప్పందాన్ని చేసుకోవడం ఒక మార్గం, లేదా భవిష్యత్ తరాలకు ఎంతమాత్రం మనుగడ లేకుండా అత్యంత వేగంగా సర్వనాశనం చెయ్యడం నా ముందున్న రెండు మార్గాలు'' అని ట్రంప్ జనరల్ అసెంబ్లీలో చెప్పారు.అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్ ఖచ్చితంగా తమతో ఒక ఒప్పందానికి వస్తుందని తాను గట్టిగా నమ్ముతున్నానన్నారు.ఐతే ఒకవైపు ట్రంప్ ఈ విధంగా హెచ్చరించినప్పటికీ రెండు దేశాల మధ్యా న్యూయార్క్ వేదికగా ఆశాజనకమైన పద్ధతిలో చర్చలు జరిగినట్లు అమెరికా ప్రతినిధి స్టీవ్‌విట్‌కాఫ్ స్పష్టం చేశారు.యుద్ధం ద్వారా చమురు ధరల ప్రభావం అమెరికా కాంగ్రెస్‌పై పడకుండా చూసుకునేందుకు ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి వ్యూహాన్ని అనుసరిస్తోంది. యుద్ధానికి ముందు ప్రపంచ అవసరాలలో 20 శాతం చమురు,సహజవాయువు హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అయ్యేది. కానీ జలసంధి మూసుకుపోయిన తర్వాత చమురు మార్కెట్‌లో ధరలు పెరిగిపోవడానికి ట్రంప్ ప్రధాన కారకుడనే ముద్ర పడింది. నవంబరులో అమెరికా ద్వైవార్షిక ఎన్నికల నేపథ్యంలో ఈ సమస్యకు ఒక పరిష్కారం సాధించాలని ట్రంప్‌పై స్వదేశంలో ఒత్తిడి పెరిగింది. జనరల్ అసెంబ్లీలో చేసిన ప్రసంగంలో ఆర్థిక వ్యవస్థ,వలసలు,సరిహద్దు సమస్యలు,నేరాల అదుపుసహా తాను సాధించిన దేశీయ విజయాలను ట్రంప్ వివరించడం ఓటర్లను ఆకర్షించడమేనని విమర్శలు వచ్చాయి.అంతకుముందు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ప్రసంగిస్తూ, ప్రపంచంలో విభజనలు పెరుగుతున్నాయని, ప్రజలు ఒకరిపై ఒకరు ఆధారపడే ఐక్యత పెంచుకోవాలని కోరారు. కానీ ట్రంప్ అందుకు విరుద్ధంగా మాట్లాడారు.ఈ యుద్ధం ద్వారా ఇరాన్ అణ్వాయుధం పొందకుండా చేశామన్నారు.బలప్రయోగంతో శాంతికి ఉన్న విలువను నిరూపించామన్నారు. ఇరాన్‌ను గొప్ప దేశంగా తీర్చిదిద్దే ఒప్పందం వీలవుతుందా? లేక వారిని నాశనం చేసి నరకానికి పంపాలా? అని ట్రంప్ ప్రశ్నించారు.

# పట్టించుకోని జ్ఞానేష్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

మార్పులపై సంధు, జోషి విడివిడిగా క్యాబినెట్ కార్యదర్శికి లేఖ రాశారు. కొత్త ఓటర్లు తమను తాము నమోదు చేసుకోవడానికి ఉపయోగించే ఫారం 6లో చేసిన మార్పులను కూడా ఈ ఇద్దరు కమిషనర్లు వ్యతిరేకించారు. ఓటర్ల నమోదు నిబంధనలు, 1960కి సవరణలు చేయకుండా చట్టబద్ధమైన ఫారమ్‌ను మార్చడం సాధ్యం కాదని జోషి మే నెలలో నమోదు చేశారు. ఆ తర్వాత సంధు ఆయనతో ఏకీభవించారు. ఫారం 6కు చేసిన మార్పులను సంధు 'అనధికారికమైనవి, చట్టవిరుద్ధమైనవి'గా అభివర్ణించి, వాటిని తక్షణమే తొలగించాలని పిలుపునిచ్చారని ఆ నివేదిక పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ సమయంలో ఓటర్ల జాబితాలో చేర్చబడిన ఓటర్లపై అప్పీళ్లు దాఖలు చేయడం, గోవాలో 97 మంది ఓటర్ల అర్హతపై స్థానిక ఎన్నికల అధికారులు నిర్ణయాలు నమోదు చేయకుండా నిరోధించిన సాఫ్ట్‌వేర్ సంబంధిత సమస్యల వంటి అంశాలు కూడా ఈ అభ్యంతరాలలో ఉన్నాయి.

కాగా, ఎన్నికల సంఘం అనేది ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కూడిన ముగ్గురు సభ్యుల రాజ్యాంగబద్ధమైన సంస్థ. కమిషన్‌ను నియంత్రించే 2023 చట్టం ప్రకారం, దాని కార్యకలాపాలు సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా జరగాలి. భేదాభిప్రాయాలను మెజారిటీతో పరిష్కరించాలి. ఈ అభ్యంతరాల కాపీని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు పంపినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. ఇద్దరు కమిషనర్లు లేవనెత్తిన ఆందోళనలపై కమిషన్ అడిగిన ప్రశ్నలకు స్పందించలేదని ఆ నివేదిక పేర్కొంది.

భిన్నమైన అభిప్రాయాలు సాధారణమే : ఇసి

'సర్' ప్రక్రియపై భారత ఎన్నికల సంఘానికి చెందిన ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు లేవనెత్తినట్లు కథనాలు రావడంతో ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి.

వాటిపై ఎన్నికల సంఘం స్పందిస్తూ సర్ ప్రక్రియపై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకుతావులేదని తెలిపింది. ఇవన్నీ ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం నిర్దేశించిన చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపింది. ఏ సంస్థలోనైనా చర్చల సందర్భంగా భిన్నమైన అభిప్రాయాలు, పరిశీలనలు సాధారణమేనని, తమ ఆదేశాలన్నీ పూర్తి చట్టబద్ధమైన ఆమోదాన్ని కలిగి ఉంటాయని, నిర్ధారిత శాసనబద్ధమైన విధానాలను అనుసరిస్తాయని స్పష్టం చేసింది. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచడానికి కేవలం ముగ్గురు కమిషనర్లే కాకుండా, కమిషన్‌లోని ప్రతి అధికారికి కమిషన్‌కు తమ సూచనలు ఇచ్చే పూర్తి అధికారం ఉందని కూడా ఇసి ఒక ప్రకటనలో పేర్కొంది.

ముసాయిదా దశలలో కమిషన్ సభ్యులు లేవనెత్తిన ఏవైనా కార్యాచరణపరమైన ప్రశ్నలు లేదా సూచనలు ఓటర్ల హక్కులను పరిరక్షించే లక్ష్యంతో కూడిన ప్రామాణిక పరిపాలనా పద్ధతిలో భాగమేనని, కమిషనర్లు ఇచ్చిన సూచనలు ఎన్నికల ప్రక్రియలను మరింత మెరుగుపరచడానికేనని ఇసి తెలిపింది. ఆమోదాలు, నిర్ణయాలు, సూచనలు, కార్యక్రమాలతో కూడిన విస్తృత పరిధిని విస్మరిస్తూ, 10 నెలల కాలంలోని కొన్ని నిర్దిష్ట అంతర్గత గమనికలు లేదా పరిశీలనలను మాత్రమే హైలైట్ చేయడం మొత్తం చిత్రంలో ఒక భాగాన్ని మాత్రమే చూపిస్తుందని ఇసి పేర్కొంది.

# జూరాలకు నీరు

(మొదటి పేజీ తరువాయి)

త్వరగా జూరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.కర్ణాటకలోనూ నీటి కొరత, ఇబ్బందులు ఉన్నప్పటికి తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించిందని మంత్రులు తెలిపారు.

ఇందుకు కర్ణాటక సిఎం డీకే శివకుమార్, నీటిపారుదల శాఖ మంత్రి చలువరాయస్వామి, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్. బోస్‌రాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ (ఇరిగేషన్), సిఎం సలహాదారు, ఇతర అధికారులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

**సిఎం ఆదేశాలతో నిరంతర సంప్రదింపులు**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 20న తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కర్ణాటక సిఎం డి.కె. శివకుమార్‌కు లేఖ రాశారని మంత్రులు తెలిపారు. అనంతరం కర్ణాటక ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ జూరాలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జూరాలతో పాటు భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రులు భరోసా ఇచ్చారు. సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో నేడు సమావేశం**

జూరాల సహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై గురువారంమంత్రులు, ఎమ్మెల్యేలు, సాగునీటి శాఖ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిలాసాగర్ ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించుకునే విధానంపైసమావేశంలో సమగ్రంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.

అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు.

# భిన్నాభిప్రాయాలు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ధర్మాసనానికి నేతృత్వం వహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, ఈ పిటిషన్లు రాజ్యాంగ ప్రాముఖ్యత కలిగిన కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని, వాటిని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని కేంద్రం చేసిన వాదనను అంగీకరించడానికి నిరాకరించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్రశర్మ, జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయాలతో విభేదించారు. అయితే, సమర్థవంతమైన, అధికారిక తీర్పు కోసం తగినంతమంది సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేసే నిమిత్తం, ఈ విషయాన్ని పరిపాలనాపరంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ముందు ఉంచాలని ఇద్దరు న్యాయమూర్తులు అంగీకరించారు. రాజ్యాంగపరమైన అంశాలను తేల్చడానికి శాశ్వత ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ధర్మాసనం సిజెఐని కోరింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (అపాయింట్‌మెంట్, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం 2023 రాజ్యాంగ బద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది. మార్చి 2, 2023న, కార్యనిర్వాహకవర్గ జోక్యం నుంచి సిఇసి, ఇసిల నియామాకాలను వేరుచేయడమే లక్ష్యంగా ఒక చరిత్రాత్మక తీర్పులో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, సిజెఐలతో కూడిన కమిటీ సలహా మేరకు రాష్ట్రపతి వారి నియామకాలు చేస్తారని తీర్పు ఇచ్చింది.

# డిసెంబరులోపు భారత్–కెనడా వాణిజ్య ఒప్పందం

**టొరంటో :** భారత్–కెనడామధ్య వాణిజ్య చర్చలు డిసెంబరులోపే ముగుస్తాయి. జి–20 సమావేశాలు జరగడానికి ముందుగానే డిసెంబరులోపు ఇరు దేశాలమధ్యా వాణిజ్య చర్చలను ముగిస్తామని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ చెప్పారు. రెండు దేశాలూ గడచిన మార్చి నెలలో సమగ్ర వాణిజ్య భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాయి. భారత్‌తో చర్చలలో మంచి పురోగతి సాధిస్తున్నామని చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కెనడా పర్యటన ఖరారైనట్లు తెలిసిందని, ఐతే ఖచ్చితమైన తేదీని తమకు తెలియజేయలేదని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన పత్రికాగోష్ఠిలో కార్నీ చెప్పినట్లు టొరంటోలో ఉన్న అధికార వర్గాలు ప్రకటించాయి. నిర్ణీత సమయంలోపే వాణిజ్య చర్చలను ముగించాలని ఇరు దేశాలు లక్ష్య నిర్దేశం చేసుకున్నట్లు చెప్పారు.జి–20 శిఖరాగ్ర సమావేశం మయామీలోని ట్రంప్ డోరల్‌లో డిసెంబరు 14–15 తేదీలలో జరగనున్నదని, ఆ లోపుగానే చర్చలు ముగిస్తామని తాను మోదీకి హామీ ఇచ్చానన్నారు.జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో బ్రిటిష్ కొలంబియాలో 2023లో సిక్కు కార్యకర్త హర్దీప్‌సింగ్ నిజ్జార్ హత్య ఘటన తర్వాత భారత్–కెనడా సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. మార్క్ కార్నీ ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత ఈ సంబంధాలను ఆయన పునరుద్ధరించారు. భారత్‌లో పర్యటించారు.

# అరెస్టు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కుమ్మక్కై దేశద్రోహానికి పాల్పడ్డాయని విమర్శించాయి. రాజ్యాంగంపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి : రాహుల్'ఓట్ చోరీ'పై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఓట్ల దొంగతనం' అనేది రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని, దీనికి బాధ్యులైన బిజెపి, ఆర్ఎస్ఎస్, ఎన్నికల సంఘం దేశద్రోహానికి పాల్పడ్డాయని ఆరోపించారు. దీనికి సంబంధించి తప్పక న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అధికారులు పాల్పడుతున్న చర్యలు దేశద్రోహంతో సమానమని, వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తాను గతంలో హెచ్చరించిన వీడియోను బుధవారం ఎక్స్‌లో పంచుకున్నారు.

# రాజీనామా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేసింది. ఎన్నికల సంఘంలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు బయటపెట్టిందని గుర్తు చేసింది. సిఇసి జ్ఞానేష్‌కుమార్ తీసుకున్నటువంటి నిర్ణయాలపై, ముఖ్యంగా సమగ్ర ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) 'ఫారం–6'కు, చేసిన 'చట్టవిరుద్ధమైన', 'అనధికారిక' మార్పులు, ఓటర్ల జాబితా సాఫ్ట్‌వేర్ కేంద్రీకరణ వంటి వాటిపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 10నెలల కాలంలో కనీసం 14సార్లు అభ్యంతరాలు నమోదు చేశారని, నియంత్రణ కేంద్రీకరణపై వారు కేబినేట్ కార్యదర్శిని కూడా సంప్రదించారని సిపిఐ తెలియజేసింది.అయినప్పటికీ ఈ అభ్యంతరాలను వేటినీ పట్టించుకోకుండా ఆయన 'సర్'ను ముందుకు నెట్టారని, ఫలితంగా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 13 కోట్లకు పైగా ఓటర్లను తొలగించారని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం విమర్శించింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఓటర్లను తమకు నచ్చినట్లుగా ఎంపిక చేసుకోవడానికి అనుమతించరాదని సిపిఐ నిరంతరం పదేపదే హెచ్చరిస్తూనే ఉందని, ఆయినా జ్ఞానేష్ కుమార్ తన తీరు మార్చుకోలేదని ఆక్షేపించింది.

# బాడ్మింటన్‌లో భారత్‌కు పతకం

## 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి




ఆసియా గేమ్స్‌లో భారత్ మరో పతకం సాధించింది. టీమ్ ఈవెంట్లో పురుషుల బాడ్మింటన్ టీమ్ బ్రాంజ్ మెడల్ నెగ్గింది. బుధవారం జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 1–3 తేడాతో చైనా చేతిలో ఓటమి పాలైంది. ఈ పరాజయంతో ఫైనల్ చేరే అవకాశం కోల్పోయిన భారత్.. కాంస్యంతో సరిపెట్టుకుంది. అయితే వరుసగా ఆసియా గేమ్స్‌లో భారత్ రెండోసారి పతకం గెలవడం 40 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో భారత్ రజతం సాధించిన సంగతి తెలిసిందే. అప్పుడూ కూడా ఫైనల్లో చైనా చేతిలోనే భారత్ ఓటమి పాలైంది. 1982, 1986 ఆసియా క్రీడల్లో కాంస్య పతకాలు సాధించిన తర్వాత.. 40 ఏళ్లకు మళ్లీ వరుసగా ఆసియా గేమ్స్‌లో భారత్ పతకాలు సాధించింది.

**లక్ష్యసేన్ ఓడినా...** ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్యసేన్ తొలి సింగిల్స్‌లో చైనా ఆరో ర్యాంకర్ షి యూకీ చేతిలో ఓటమి పాలయ్యాడు. వరుస గేముల్లో 16–21, 18–21తో పరాజయం చెందాడు. దాంతో చైనా 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి మ్యాచ్‌లో ఓడినా.. సాత్విక్ చిరాగ్ జోడీ భారత్‌ను ఆదుకుంది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేతలు, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్లు లియాంగ్ వెయ్ కెంగ్‌వాంగ్ చాంగ్‌తో తలపడిన భారత జోడీ అద్భుతంగా ఆడింది. 21–11, 22–20తో చైనా డబుల్స్ జోడీని ఓడించి భారత్‌ను 1–1తో సమం చేసింది. దాంతో ఫైనల్ ఆశలు చిగురించాయి. కానీ మూడో మ్యాచ్‌లో 20 ఏళ్ల ఆయుశ్ శెట్టి ఓటమిపాలై తీవ్రంగా నిరాశపర్చాడు. ప్రపంచ 12వ ర్యాంకర్ లీ షి ఫెంగ్ చేతిలో 19–21, 13–21 తేడాతో ఓటమి పాలయ్యాడు. దాంతో చైనా 2–1 తేడాతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. చివరి డబుల్స్ మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోవడంతో ఫైనల్ ఆశలు నీరుగారాయి. ప్రపంచ 25వ ర్యాంకులో ఉన్న ఈ జోడీ.. హీ జీ టింగ్‌లియు యీ జోడీ చేతిలో హరిహరన్ అంసకరుణన్ ఎంఆర్ అర్జున్ జోడీ ఓటమిపాలైంది. దాంతో చైనా 3–1తో విజయం సాధించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్ కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# అక్టోబర్ 1న ఐఎల్‌టి 20 వేలం






ఇంటర్నేషనల్ టి–20 లీగ్ వేలానికి సమయం దగ్గరపడింది. అక్టోబర్ 1వ తేదీన దుబాయ్‌లో ఆక్షన్ జరుగనుంది. ఐసిసి అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో నిర్వహించనున్న వేలంలో 20 దేశాలకు చెందిన ఆటగాళ్లు పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే.. ఈసారి ఎనిమిది వందలకు పైగా క్రికెటర్లు రిజిష్టరవ్వగా.. వడబోత అనంతరం రెండొందల మంది మాత్రమే వేలంలో నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు. దుబాయ్ వేదికగా ఐఎల్‌టి 20 వేలం జరుగుంది. అక్టోబర్ 1వ తేదీన అక్కడి ఐసిసి అకాడమీ ఇండోర్ ఫెసిలిటీలో ఆక్షన్ ఉండనుంది. వేలానికి మరో తొమ్మిది రోజులే ఉండడంతో.. ప్రతి ఫ్రాంచైజీ వద్ద ఎంత డబ్బుంది? ఎంత మంది క్రికెటర్లు వేలంలో ఉన్నారు? ఎన్ని స్లాట్లు ఖాళీగా ఉన్నాయి? అనేవి కీలకంగా మారాయి. ఈసారి ప్రతి ఫ్రాంచైజీ 13 లక్షల అమెరికన్ డాలర్ల(భారతీయ కరెన్సీలో రూ.12.42 కోట్లు) ఖర్చు చేయనుంది. అయితే.. రిటెన్షన్కు దాదాపు రూ.6 కోట్లు పోగా.. మిగతా ఆరు కోట్లలో అవసరమై ఆటగాళ్లను కొనేందుకు సిద్ధమవుతున్నాయి ఫ్రాంచైజీలు.

**కనీసం 18 మంది...** ఐఎల్‌టి 20 సీజన్ 2026 వేలం కోసం క్రికెటర్లు జులై సెప్టెంబర్ మధ్య పేర్లు నమోదు చేసుకున్నారు. వేలం అనంతరం ప్రతి జట్టులో కనీసం 18మంది.. గరిష్టంగా 23 మంది ప్లేయర్లు ఉండాలి. ఇందులో.. ఐసిసి పూర్తి సభ్య దేశాల నుంచి కనీసం 11 మంది (అఫ్గనిస్థాన్ నుంచి కనీసం నలుగురు, ఐర్లాండ్ నుంచి ఒకరు) ఉండాలని, యూఏఈ నుంచి నలుగురు, కువైట్ నుంచి ఒకరు, సౌదీ అరేబియా నుంచి ఒకరు, ఐసిసి అనుబంధ దేశాలైన యెఎఇ, కువైట్, సౌదీ అరేబియా నుంచి ఒకరిని తీసుకోవాలని ఐఎల్‌టి 20 నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఆటగాళ్ల అందరి కనీస ధర విషయానికొస్తే.. రూ.9.55 ఉండాలి. అయితే.. కొందరి ధర రూ.38 లక్షల నుంచి రూ.76 లక్షలు ఉండే అవకాశముంది.

# హెలెనా దీవిలో బానిసత్వపు విషాద చరిత్ర

డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులతో కూడిన అంతర్జాతీయ బృందం, దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రంలోని సెయింట్ హెలెనాదీవిలో లభించిన 152 మంది మాజీ బానిసల అవశేషాలపై కీలకమైన పరిశోధన చేసింది. 2007, 2008 సంవత్సరాల్లో అక్కడ నిర్మాణ పనులకు ముందు జరిపిన తవ్వకాల్లో ఈ మానవ అవశేషాలు బయటపడ్డాయి. 1807లో బ్రిటిష్ సామ్రాజ్యంలో బానిస వ్యాపారాన్ని నిషేధించిన తర్వాత, ఆ నిషేధాన్ని అమలు చేయడానికి బ్రిటిష్ రాయల్ నేవీ బానిస నౌకలను అడ్డుకునే చర్య లు చేపట్టింది. ఆ సమయంలో పట్టుబడిన సుమారు 27,000 మంది ఆఫ్రికన్లను సెయింట్ హెలెనా దీవికి తరలించారు. వీరిలో చాలామంది కాంగో, బెంగ్వేలా వంటి మధ్య ఆఫ్రికా భాషలు మాట్లాడే వారని అప్పటి నేవీ అధికారులు నమోదు చేశారు. అయితే తీవ్రమైన పోషకాహార లోపం, అనారోగ్యం కారణంగా దాదాపు 8,000 మంది అక్కడే మరణించారు. పరిశోధకులు వారి దంతాల్లోని 'స్ట్రాన్షియం ఐసోటోప్' నిష్పత్తులను విశ్లేషించి, వారి బాల్యం ఎక్కడ గడిచిందో తెలుసుకున్నారు. ఈ అధ్యయ నం ప్రకారం చాలామంది పశ్చిమ మధ్య ఆఫ్రికా తీర ప్రాంతాలకు చెందిన వారని తేలింది. మరికొందరు అంతర్భాగ ప్రాంతాల్లో పెరిగినట్లు ఆధారాలు లభించాయి. అంటే వారిని బానిసలుగా పట్టుకుని తీర ప్రాంతాలకు తీసుకురావడానికి ముందు, వారు భూభాగం మీదుగా చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చిందని అర్థమవుతోంది. పరిశోధకులు కనుగొన్న వివరాల్లో ఒక వ్యక్తి జీవితం ప్రత్యేకంగా ప్రస్తావించబడింది. 19 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సులో మరణించిన ఆ వ్యక్తి, చిన్ననాట అంగోలాలోని అంతర్భాగ ప్రాంతంలో నివసించాడు. ఏడు నుంచి తొమ్మిది సంవత్సరాల వయస్సులో అతడిని తీర ప్రాంతానికి తరలించారు. పరిశోధకుడు హానెస్ ష్రోడర్ అభిప్రాయం ప్రకారం, ఈ బలవంతపు తరలింపు అతడి బానిసత్వంతో సంబంధం కలిగి ఉండవచ్చు. దంతాల నుంచి సేకరించిన డిఎన్ఎ విశ్లేషణ కూడా ఈ వ్యక్తులు ప్రస్తుత గాబన్, ఉత్తర అంగోలా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జన్యు వారసత్వంతో సంబంధం కలిగి ఉన్నారని వెల్లడించింది. ఈ పరిశోధన కేవలం పురావస్తు అధ్యయనం మాత్రమేగాక, అట్లాంటిక్ బానిస వ్యాపారం లక్షలాది ఆఫ్రికన్ల జీవితాలను ఎలా ఛిన్నాభిన్నం చేసిందో చూపించే మానవ చరిత్రకు సంబంధించిన ఆధారం. ఎవరెక్కడి నుంచి వచ్చారు, వారిని ఎలా బలవంతంగా తరలించారు, బానిసత్వం వారి కుటుంబాలు, సంస్కృతులు, జీవన విధానాలను ఎలా ప్రభావితం చేసిందనే విషయాలను శాస్త్రీయ ఆధారాలతో అర్థం చేసుకోవడానికి ఇటువంటి పరిశోధనలు సహాయపడుతున్నాయి.









## అఫ్గాన్ శాసనంలో కనిష్కుడి ప్రస్తావన

అఫ్గానిస్థాన్‌లో లభించిన ఒక శాసనంలో కనిష్కుడి ప్రస్తావన ఉంది. బ్యాక్ట్రియన్ మరియు గ్రీకు లిపిలో రాసిన 23 పంక్తులు గల ఈ శాసనాన్ని రబాటక్‌లో కనుగొన్నారు. అందులో కనిష్కుడితోపాటు అతని తండ్రి, తాత, ముత్తాత పేర్లు కూడా ఉన్నాయి. నారత దేశంలోని ఆరు ప్రధాన నగరాల ప్రస్తావన ఈ శాసనంలో కనిపిస్తుంది. వాటిలో సాకేత ఒకటి. కనిష్కుడి కాలంలో సాకేత ఉన్నత హోదా కలిగిన నగరం. ఆ శాసనంలో సాకేత 'జాగేద'గా జాబితా చేశారు. బ్యాక్ట్రియన్ భాషలో, 'ఎస్' అక్షరం 'జెడ్'గా మారుతుంది. కనిష్కుడి శాసనంలో జాగేద అనే పేరు టోలెమీ భౌగోళికంలో సాగేద అనే పేరుతో సమానంగా ఉంటుంది. టోలెమీ భౌగోళికంలో సాగేద అనే పేరు ఆపేరుతో సమానంగా కనిపిస్తుంది.

## మూడువేల ఏళ్లనాటి చిత్రాలలో వ్యంగ్యం



ప్రాచీన ఈజిప్టులో కూడా హాస్య భావం, చమత్కారం.. వ్యంగ్యం ఉండేవని చూపించే అరుదైన ఉదాహరణ ఇది. 'డీర్ ఎల్‌మెడీనా' అనే రాజభవన శిల్పుల గ్రామం నుండి లభించిన ఒక చిన్న సున్నపురాయి పైచిత్రాన్ని సుమారు మూడు వేల ఏళ్ల నాటి ప్రాచీన మీమ్‌గా పేర్కోవచ్చు. ఈ చిత్రం క్రీస్తుపూర్వం 1295–1069 మధ్యకాలమైన రామెసీడ్ యుగానికి చెందినది. అందులో ఒక నిలుచున్న పిల్లి, చేతిలో ఒక పాత్ర (కలశం), తామరపువ్వుతో, మరో కూర్చొని ఉన్న పిల్లికి సుగంధాన్ని అందిస్తున్నట్లు ఉంది. పక్కన ఒక మేకను కూడా చిత్రించారు. అంటే ఇది మనిషి ప్రవర్తనను జంతువులు అనుకరిస్తూ చేసే వినోదాత్మక చిత్రణ. ఆ చిత్రానికి మూడు పంక్తుల హియరాటిక్ లిపిలో వ్యాఖ్యలు లేదా శీర్షికలు కూడా ఉన్నాయి. అవి చిత్రంలోని చమత్కారాన్ని మరింతగా అర్థమయ్యేలా చేసినట్టు అనిపిస్తుంది. ఇలాంటి చిత్తరువులను ఒస్ట్రకా అని పిలుస్తారు. ఇవి సాధారణంగా చిప్పలపై లేదా సున్నపురాయి ముక్కలపై రాజభవన చిత్రకారులు, శిల్పులు విరామ సమయంలో వేసుకునే హాస్యాత్మక చిట్టచిత్రాలు. ఈజిప్టు కళాకారులు తరచుగా ప్రపంచాన్ని తలకిందులుగా చూపడానికి ఇష్టపడేవారు. సాధారణంగా బానిసలుగా ఉండే జంతువులు ఇక్కడ యజమానులుగా కనిపించేవిపందులు విందులు ఇస్తూ, ఎలుకలు పిల్లులకు సేవ చేస్తూ, లేదా పిల్లులు మానవుల వలె పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవి. ఈ సున్నపురాయి చిత్రరేఖ రామెసీడ్ కాలానికి (19వ, 20వ వంశం, సుమారు క్రీస్తు పూర్వం 1295–1069) చెందినది. ఇది డీర్ ఎల్‌మెడీనా తవ్వకాల్లో బయటపడింది. తరువాత అలెగ్జాండ్ర్ వరిల్ సేకరణలో ఉండి, 2007లో డ్రూయోరి షెల్యూ వేలంలో ఇది అమ్ముడైంది. ప్రస్తుతం ఇది పారిస్‌లోని మ్యూసీ దు లూవ్ర్ భవనంలోని సల్లి విభాగంలో, ది న్యూ కింగ్డమ్: ది ఏజ్ ఆఫ్ ది రామెసైడ్స్ విభాగంలో ప్రదర్శనకు ఉంది.

## మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విలాస్ డిమాండ్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో బుధవారం నిర్మల్‌లోని జిల్లా ఖానా ఆసుపత్రి ప్రాంగణంలో కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విలాస్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా 5న వేతనాలు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ నెల పూర్తవుతున్నప్పటికీ, ఆగస్టు నెల జీతాలు ఇవ్వకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లిస్తేనే వారి కుటుంబ అవసరాలు తీరుతాయన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూక్యా రమేష్ మాట్లాడుతూ వచ్చే సోమవారంలోగా పెండింగ్ జీతాలు చెల్లించకపోతే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు సమయానికి జీతాలు చెల్లించలేని కాంట్రాక్టర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు రాజేందర్, సాయి, పోశెట్టి, సరస్వతి, భాగ్యలక్ష్మి , సంగీత తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం, విద్యాహక్కు పరిరక్షణకు నిరంతర పోరాటాలు

### ఎఐఎస్ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యాహక్కు పరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని సమాఖ్య నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ అన్నారు. అచ్చంపేటలోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ అచ్చంపేట నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకల పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 28,29,30 తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంగా నిర్వహించనున్న ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలకు విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం జరిగే పోరాటాలకు మరింత బలం చేకూర్చేందుకు హనుమకొండలో జరిగే వేడుకలకు విద్యార్థులు, యువత భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ఫన్నీ అర్జున్, శిల్ప, కళ్యాణి, పవన్, రవి, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ చెల్లింపులపై అదనపు చార్జీలు తగవు

### వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ







**ప్రజాపక్షం/కాప్రా :** కేంద్రప్రభుత్వం అమలులోకి తేనున్న డిజిటల్ పేమెంట్లపై అదనపు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.ధర్మేంద్ర డిమాండ్ చేసారు. బుధవారం ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద డిజిటల్ పేమెంట్లపై అదనపు చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, చిరు వ్యాపారుల రోజు వారీ జీవితంలో తప్పనిసరిగా మారిన యుపిఐ చెల్లింపులపై ఎండిఆర్ పేరిట కేంద్ర ప్రభుత్వం అదనంగా వసూలు చేయనున్న చారీల ప్రభావం భారీగా కనపడుతుందన్నారు. ఈ నూతన విధానంలో రూ. 2 వేలకు మించిన చెల్లింపుల లావాదేవీలపై ఎండిఆర్ రుసుములు చివరికి సామాన్య జనమే భరించాల్సి వస్తుందని, దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రభావం పడుతుందన్నారు. పెట్రోల్ ఉత్పత్తులు, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను ఆకాశాన్నంటుతున్న తరుణంలో కేంద్రప్రభుత్వం పరోక్షంగా ఎండిఆర్ పేరిట అదనపు వసూళ్లకు తెరలేపిందని విమర్శించారు. అచ్చే దిన్ అంటూ ప్రజలను దోచుకోవటం కాదా అని బిజెపి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్ బేగ్, టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ నగదు లావాదేవీల స్థానంలో ఎలాంటి అదనపు చార్జిలు ఉండవంటూ విస్తృత ప్రచారంతో డిజిటల్ చెల్లింపు విధానాన్ని ప్రజలకు అలవాటు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఎండిఆర్‌ల పేరిట ప్రతి రెండు వేల లావాదేవీలపై అదనపు చార్జీలు విధించటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు రాజ్‌కుమార్, శేఖర్, గిరి బాబు, అక్రమ్, సచిన్, నదీమ్, కిరణ్, ప్రదీప్, నర్సింహ, కీర్తన్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** యుపిఐ చార్జీలను నిరసిస్తూ బుధవారం యాదగిరిగుట్టలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియా పేరుతో ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానం ప్రకారం రూ.2,000కు మించిన వ్యక్తివ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము, అలాగే రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలపై గరిష్ఠంగా రూ.300 వరకు వర్తింపజేయడం దారుణమన్నారు. వ్యక్తిగత లావాదేవీలు మరియు రూ.2,000 లోపు వ్యాపారి లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ రుసుముల విధానం భవిష్యత్తులో చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న యువతపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. సుమారు 96 శాతం లావాదేవీలపై ప్రభావం ఉండదని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, మిగిలిన లావాదేవీలపై రుసుము విధించే విధానాన్ని ప్రజా ప్రయోజనాల కోణంలో పునఃసమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, సహాయకార్యదర్శి పేరబోయిన బంగారు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు ఆనంతుల నర్సింహ, శెట్టి నర్సింహ, సంగి అరవింద్, బండ రామచందర్, ఒంటెద్దు సంజీవ, పేరబోయిన సత్యనారాయణ, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకిచ్చిన హామీల అమలు ఏదీ?

### మహిళా సమాఖ్య యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఎన్నికల సమయంలో మహిళలకిచ్చిన హామీల అమలేదని మహిళా సమాఖ్య యాదాద్రి జిల్లా ప్రధానకార్యదర్శి బండి జంగమ్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో బండి జంగమ్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్యాస్ సబ్సిడీతో పాటు ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అర్హులైన వారందరికీ వితంతు, ఒంటరి మహిళలకు పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు భద్రత కల్పించడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని బండి జంగమ్మ కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సమస్యలపై మహిళా సమాఖ్య చేపడుతున్న కార్యక్రమాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. మహిళల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు గుర్రం రాజమణి, నాయకులు అరే పుష్ప, మాటూరి జానమ్మ, యానాల సంధ్య, కౌసల్య, మంగమ్మ, జయమ్మ, చంద్రకల, కిష్టమ్మా, యాదమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.




## రిమ్స్‌లో ఐదుగురు పసికందుల మృతి అత్యంత విషాదకరం

### బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు పసికందులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మర్రి శ్రీమాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెర్లికంటి శ్రీకాంత్ అన్నారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన చిన్నారులకు పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఐదుగురు పసికందుల ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాలకు తీరని లోటని, బాధిత కుటుంబాల కన్నీటికి ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ ఘటనకు దారితీసిన కారణాలతో పాటు ఆసుపత్రిలోని ఫైర్ సేఫ్టీ వ్యవస్థ, విద్యుత్ పరికరాల నిర్వహణ, అత్యవసర నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో వెల్లడైన వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. మృతిచెందిన ప్రతి చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే తగిన ఆర్థిక పరిహారం అందించాలని, ప్రమాదానికి నిర్లక్ష్యం లేదా భద్రతా లోపాలు కారణమని తేలితే బాధ్యులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీ, విద్యుత్ వ్యవస్థలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక భద్రతా ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నవజాత శిశువుల విభాగాల్లో 24 గంటల అత్యవసర భద్రతా, స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రమాదంలో గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారి కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని అన్నారు.

# విమానాశ్రయాల డిజైన్లలో తెలంగాణ వైభవం

## కాకతీయ కళాతోరణం, రామప్ప శిల్పకళ ఉట్టిపడేలా నిర్మాణాలు

## శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి : సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ చరిత్ర, సంస్కృతి, శిల్పకళ, వాస్తు సంపదకు ప్రతిబింబాలుగా ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయం వంటి తెలంగాణ చారిత్రక నిర్మాణాల్లోని శిల్ప, వాస్తు కళలను అధ్యయనం చేసి, వాటి ప్రత్యేకతలు ప్రతిబింబించేలా ఆధునిక నిర్మాణాలను తీర్చిదిద్దాలని సూచించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, వివిధ శాఖల పరిధిలో ఉన్న పనులు, నిర్మాణాల డిజైన్లపై అధికారులతో చర్చించారు. విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహాల మళ్లింపు, రహదారుల మార్పు, బీఎస్ఎన్ఎల్ లైన్లు, తాగునీటి సరఫరా పైపులైన్లను మార్చాల్సిన అంశాలను అధికారులు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఒక్కో శాఖ విడివిడిగా పనులు చేపట్టడం వల్ల సమయం వృథా కావడంతో పాటు భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యుత్, ఆర్అండ్‌బి, తాగునీటి సరఫరా, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బిఎస్ఎన్ఎల్ అధికారులతో కూడా సమావేశమై అన్ని పనులు ఏకకాలంలో జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విమానాశ్రయాల ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సిఎం సూచించారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్‌కు సమీపంగా రహదారులను నిర్మించి, వాటిని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండటంతో పాటు ప్రధాన రహదారులకు సులభంగా అనుసంధానమయ్యేలా డిజైన్ చేయాలని చెప్పారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సిన పరిస్థితి ఉంటే విమానాశ్రయ ప్రాంగణంలో లేదా సమీప ప్రాంతాల్లో చెరువులు నిర్మించి, వాటి ద్వారా నీటి ప్రవాహాలను మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిఎం ఆదేశించారు.

**డిజైన్లలో తెలంగాణ శిల్పకళకు ప్రాధాన్యం..**

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ డిజైన్లను సిఎం పరిశీలించారు. ప్రతి నిర్మాణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ శిల్పకళ, వాస్తు విశిష్టతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డిజైన్లలో పలు మార్పులను కూడా ఆయన సూచించారు. ఆధునిక సౌకర్యాలతో పాటు తెలంగాణ చారిత్రక వారసత్వం స్పష్టంగా కనిపించేలా నిర్మాణాలు ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఆర్అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్, పవర్‌గ్రిడ్ ఇడి డొమన్ యాదవ్, టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, ఎయిర్ కమోడోర్ రాహుల్ శుక్లా, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, స్థపతి ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జూరాల ప్రాజెక్టుపై రాస్తారోకోలు, అరెస్టులు

## రైతులకు సాగునీటిని విడుదల చేయాలని సిపిఎం, బిజెపి విడివిడిగా ధర్నాలు

**ప్రజాపక్షం/అమరచింత :** జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ విభాగంలో రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున సిపిఐ(ఎం), బిజెపి లు విడివిడిగా మంగళవారం నందిమల్ల క్యాంపు దగ్గర రాస్తారోకోలు చేశారు. తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు హైదరాబాదు నుంచి జూరాల ప్రాజెక్టుకు వస్తున్న సందర్భంలో వారిని భూత్పూర్ దగ్గర పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లో ఉంచారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు, రాష్ట్ర నాయకులు జూరాల ప్రాజెక్టుకు వస్తుండగా జడ్చర్ల దగ్గర పోలీసులు అరెస్టు చేశారు. ఎక్కడికక్కడ సిపిఐ(ఎం), బిజెపి నాయకులు రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ముందస్తుగానే నాయకులను అరెస్టు చేయడం జరిగింది. కాగా ఆయా పార్టీల నాయకులు జూరాల ప్రాజెక్టు దగ్గరకు వచ్చి విడివిడిగా రాస్తారోకోలు చేయడం జరిగింది. పోలీసులకు సవాలుగా ఆయా పార్టీల నాయకులు ప్రాజెక్టులోని ఎడమ కాలువ సెటర్లను తెరిచేందుకు పోలీసులను పక్కకు నెట్టి పురుగులు తీసిన పోలీసులు వారిని వెంబడించి బలవంతంగా అరెస్టు చేయడం జరిగింది. అదేవిధంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీ కాంతరెడ్డి, నారాయణపేట్ జిల్లా ఉపాధ్యక్షుడు మేరవరాజు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణలతో పాటు నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్కు తరలించడం జరిగింది. జూరాల ప్రాజెక్టు క్యాంపు దగ్గర ధర్నా రాస్తారోకోలు చేయడం ద్వారా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

**రైతుల సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులు చేయడం సరికాదు : సిపిఐ(ఎం)**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూరాల ప్రాజెక్టు కింద సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిశీలించేందుకు వెళ్తున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములును పోలీసులు అరెస్టు చేసి భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించింది. జూరాల కింద సాగు చేసిన పంటలకు నీరు అందక రైతులు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఐ(ఎం) పేర్కొంది. నీటి కోసం రైతులు స్వయంగా కాల్వలకు నీటిని విడుదల చేసుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడంతోపాటు వనపర్తి జిల్లాలోనూ సిపిఐ(ఎం) నాయకులను అరెస్టు చేయడంతో పాటు కొందరిని గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించింది.

# 'రిమ్స్' బాధితులకు పైసా సాయం చేయరా? : కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్‌లో ప్రమాదం మానవ తప్పిదమేనప్పటికీ, ముగ్గురు చిన్నారులు చనిపోతే బాధిత కుటుంబాలకు పైసా సాయం చేయరా? అని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కేవలం ఫోటోలు దిగేందుకే ఘటన స్థలానికి వెళ్లారని, కనీస మానవత్వం ప్రదర్శించలేదని ఆరోపించారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు తాము బుధవారం ఆదిలాబాద్‌కు వెళ్తున్నామని కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి కనీస సాయం అందుతుందని భావిస్తే, ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బాధితులకు సాయం చేయలేదని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఆదివాసీ జిల్లా ఆదిలాబాద్‌కు ఆరోగ్య రంగం విషయంలో ఏమీ చేయలేదన్నారు. ఎంజీఎం హాస్పిటల్ లో సీలింగ్ కూలిందని, చాలా హాస్పిటల్స్‌లో ఎక్విప్ మెంట్ సక్రమంగా లేవని కవిత ఆరోపించారు.

# రైతుల సమస్యలను ప్రశ్నిస్తే అరెస్టులా?

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం సరికాదన్నారు. జూరాల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి లభ్యతపై ముందస్తు సమాచారం ఇవ్వకుండా పంటలు వేసిన తర్వాత నీరు అందించలేమని చెప్పడం రైతులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని ఆరోపించిన ఆయన, ఫసల్ బీమా వంటి పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం జరిగితే ఆదుకునే విధంగా బీమా పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. రైతులు, నిర్వాసితుల పక్షాన బిజెపి పోరాటం కొనసాగిస్తుందన్నారు.

**బిజెపి నేతల హౌస్ అరెస్టులను ఖండించిన ఎంపి డి.కె. అరుణ**

జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి చేపట్టిన జూరాల ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై మహబూబ్ నగర్ ఎంపి డి.కె. అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షుడు రామాంజనేయులు, యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బండల వెంకట్రాములు తదితర నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని ఆమె ఖండించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, శాంతియుత నిరసనలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని అన్నారు. జూరాల ఆయకట్టు పరిధిలో పంటలు నీరందక ఎండిపోతున్నాయని, ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక రైళ్లు

## -25, 26 తేదీల రాత్రుల్లో 11 నుంచి ఉదయం 5 గంటల వరకు 8 ఎంఎంటిఎస్‌లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేశ్ నిమజ్జనం సందర్భంగా నగరంలో పెరగనున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రత్యేక ఎంఎంటిఎస్ రైళ్లను నడపనుంది. ఈ నెల 25–26, 26–27 మధ్య రాత్రుల్లో రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు మొత్తం ఎనిమిది ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకురానుంది. నిమజ్జన కార్యక్రమాలు ముగించుకుని ఇళ్లకు చేరుకునే భక్తులు, ప్రజలకు రాత్రివేళ రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్‌సిఆర్ తెలిపింది. ప్రత్యేక రైళ్లలో భాగంగా సికింద్రాబాద్–హైదరాబాద్ జీవిస్‌హెచ్1 రైలు రాత్రి 11.50 గంటలకు బయలుదేరి 12.20 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–లింగంపల్లి జిహెచ్‌ఎల్2 రైలు రాత్రి 12.30 గంటలకు బయలుదేరి 1.20 గంటలకు లింగంపల్లి చేరుతుంది. అనంతరం లింగంపల్లి–హైదరాబాద్ జీఎల్‌హెచ్3 రైలు 1.50 గంటలకు బయలుదేరి 2.40 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–సికింద్రాబాద్ జిహెచ్‌ఎస్4 రైలు తెల్లవారుజామున 3.30 గంటలకు బయలుదేరి 4 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదేవిధంగా హైదరాబాద్–లింగంపల్లి జిహెచ్‌ఎల్5 రైలు రాత్రి 11.10 గంటలకు బయలుదేరి 11.55 గంటలకు లింగంపల్లి చేరుతుంది. లింగంపల్లి–ఫలక్‌నుమా జీఎల్‌ఎఫ్6 రైలు అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి 1.50 గంటలకు ఫలక్‌నుమా చేరుతుంది. ఫలక్‌నుమా–సికింద్రాబాద్ జిఎఫ్ఎస్7 రైలు 2.20 గంటలకు బయలుదేరి 3 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. సికింద్రాబాద్–హైదరాబాద్ జిఎస్‌హెచ్8 రైలు తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి 4.40 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

**అన్ని ఎంఎంటిఎస్ స్టేషన్లలో ఆగేలా ఏర్పాట్లు..**

ప్రత్యేక రైళ్లకు మార్గమధ్యంలోని అన్ని ఎంఎంటిఎస్ స్టేషన్లలోనూ నిలుపుదల ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. గణేశ్ నిమజ్జనం సందర్భంగా రాత్రివేళ భారీగా తరలివచ్చే ప్రజలకు ఈ అదనపు సర్వీసులు ఉపయోగపడనున్నాయి.

# 'మహాలక్ష్మి'లో రోజుకు 37 లక్షల ప్రయాణాలు!

## ఉచిత బస్సు ప్రయాణంతో రూ.2,428 కోట్లకు పైగా ఆదా

## రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు : ఎండి నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీలో కొత్త రికార్డు సృష్టించింది. పథకం ప్రారంభమైన సమయంలో రోజుకు సగటున 29.42 లక్షలుగా ఉన్న మహిళా ప్రయాణాలు.. ప్రస్తుతం రోజుకు 37.09 లక్షలకు చేరాయి. ఉచిత ప్రయాణం ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు మహిళలు రూ.2,428.47 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని టిజిఎస్‌ఆర్‌టిసి వెల్లడించింది. ఉద్యోగాలు, విద్య, కుటుంబ అవసరాల కోసం నిత్యం ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఆర్థికంగా ఉపయోగపడుతోందని ఆర్టీసీ పేర్కొంది. పెరుగుతున్న మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నామని టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డి తెలిపారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాలలు, కళాశాలల వేళల్లో ప్రత్యేక ట్రిప్పులు నడుపుతున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం కారణంగా బస్సు సర్వీసులు తగ్గించారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. 2025–26తో పోలిస్తే 2026–27 ఆగస్టు వరకు మహాలక్ష్మి ప్రయాణికుల సౌకర్యార్థం 96.50 లక్షల కిలోమీటర్లు అదనంగా బస్సు సర్వీసులు నడిపినట్లు ఎండి తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని కొత్త బస్సులు, సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామని, ప్రతి మహిళకు సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో అన్ని జోన్ల ఇడిలు, ఆర్‌ఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మహాలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండి నాగిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



# 'ఖేలో తెలంగాణ'కు శ్రీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడలను కేవలం పోటీలకే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం చేయడం, ప్రజల్లో శారీరక చైతన్యాన్ని పెంచడం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా తెలంగాణ క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో 'ఖేలో తెలంగాణ' పేరుతో నిరంతర క్రీడా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రజల వయస్సుతో సంబంధం లేకుండా రోజువారీ జీవితంలో వ్యాయామం, ఫిట్‌నెస్, క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని దశలవారీగా విస్తరించనున్నారు. సచివాలయంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి 'ఖేలో తెలంగాణ' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఎ.పి. జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జె.ఎ.సి రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఎండిడాక్టర్ సోనీ బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డితో పాటు క్రీడా శాఖ అధికారులు పాల్గొన్నారు. 'ఖేలో తెలంగాణ బంధన్'లో భాగంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం రోజుకు కనీసం 30 నిమిషాలు కేటాయించేలా ప్రజలను ప్రోత్సహించనున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా తమకు అనుకూలమైన నడక, జాగింగ్, యోగా, ఇతర శారీరక వ్యాయామాలను నిత్య జీవితంలో భాగం చేసుకునేలా కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. 'ఖేలో తెలంగాణ బంధన్'లో భాగంగా నైన్ ప్లస్ నైన్ ప్లస్ నైన్ ప్లస్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ నిర్వహించనున్నారు. వాకింగ్, జాగింగ్, యోగా తదితర ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో పాల్గొని వాటికి సంబంధించిన 27 సెకన్ల వీడియోను సోషల్ మీడియా వేదికల్లో పోస్టు చేయాలి. అనంతరం తొమ్మిది మంది మిత్రులను ట్యాగ్ చేసి, మరో తొమ్మిది మందిని ఈ ఛాలెంజ్‌లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఇలా ఒకరి నుంచి మరొకరికి ఫిట్‌నెస్ సందేశం విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. 'ఖేలో తెలంగాణ'ను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర క్రీడా ఉద్యమంగా కొనసాగించేందుకు వివిధ క్రీడాంశాల్లో లీగ్ పోటీలను ప్రోత్సహించనున్నారు. పాఠశాల స్థాయి నుంచి అన్ని వయస్సుల వారికి క్రీడల్లో పాల్గొనే అవకాశాలను పెంచడంతో పాటు ఆయా క్రీడలపై అవగాహన, ఆసక్తి, ప్రేక్షకాదరణను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## సిఎంఆర్ఎల్ ముడుపుల కేసులో

# విచారణకు కేరళం ప్రభుత్వం ఆదేశం

## మాజీ సిఎం విజయన్, వీణ, మహమ్మద్ రియాస్‌లపై చర్యలకు ఇడి నివేదిక



**తిరువనంతపురం :** సిఎంఆర్ఎల్ ముడుపుల కేసులో కేరళం ప్రభుత్వం పోలీసులు విచారణకు ఆదేశించింది. మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి, ఆమె భర్త పి.ఎ. మహమ్మద్ రియాస్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమర్పించిన నివేదిక ఆధారంగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇడి నివేదికపై విచారణ బాధ్యతను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని హోం మంత్రి రమేష్ చెన్నితల తెలిపారు. ఈ విచారణ ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రాష్ట్ర పోలీసు విభాగంలోని 'క్రైమ్ బ్రాంచ్' నిర్వహిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇడి నివేదికపై తదుపరి చర్యల విషయంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను రాష్ట్ర పోలీసులకే వదిలివేస్తూ అడ్వకేట్ జనరల్ (ఎజి) ఇచ్చిన న్యాయపరమైన సలహాను ప్రభుత్వం పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కింద జరిపిన దర్యాప్తు, సోదాల సమయంలో సేకరించినట్లు చెబుతున్న సాక్ష్యాల ఆధారంగా... ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న విజయన్, వీణ, రియాస్‌లపై అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఇడి రాష్ట్ర పోలీసు చీఫ్ రావడ ఎ. చంద్రశేఖర్‌కు లేఖ రాసింది. ఎజి లేఖను డిజిపి స్వీకరించి, దానిని హోం శాఖ కార్యదర్శికి పంపారని చెన్నితల తెలిపారు. ఆ తర్వాత హోం శాఖ కార్యదర్శి తదుపరి చర్యలపై ఆదేశాలు కోరుతూ ఆ లేఖను ప్రభుత్వం ముందు ఉంచారు. మంగళవారం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తో ఈ విషయంపై చర్చించానని, విచారణకు ఆదేశించాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. అనంతరం ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. అవినీతి కేసులతో సహా కొన్ని రకాల కేసుల్లో, అందిన సమాచారం ద్వారా 'కాగ్నిజబుల్ అఫెన్స్' (పోలీసులు వారెంట్ లేకుండానే అరెస్టు చేయగలిగే నేరం) జరిగినట్లు స్పష్టంగా తెలియకపోతే, ప్రాథమిక విచారణ చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన లలితా కుమారి' తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కేసులో ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాతే, ఈ విచారణ బాధ్యతను డిజిపికి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెన్నితల తెలిపారు. విచారణ తదుపరి ప్రక్రియపై డిజిపి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఐటి కన్సల్టెన్సీ సేవల ముసుగులో, వీణకు చెందిన 'ఎక్సలాజిక్ సొల్యూషన్స్' (ప్రస్తుతం మూతపడిన సంస్థ)కు 'కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఇడి ఆరోపించింది. తిరువనంతపురంలోని అద్దె ఇంట్లో అప్పట్లో విజయన్‌తో కలిసి నివసిస్తున్న వీణకు సంబంధించిన ప్రదేశాలలో జూన్ నెలలో కేంద్ర దర్యాప్తు సంస్థ (ఇడి) సోదాలు నిర్వహించి, ఆ తర్వాత ఆమెను విచారించింది.

**చట్టపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటాం : బేబీ**

సిఎంఆర్ఎల్ ముడుపుల కేసులో ప్రభుత్వం విచారణకు ఆదేశించడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా తప్పుబట్టింది. ప్రతిపక్ష నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థల వినియోగం విషయంలో కాంగ్రెస్ నాయకత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆ పార్టీ ప్రశ్నించింది. ఈ వ్యవహారాన్ని చట్టపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటామని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ పేర్కొన్నారు. బిజెపి రాజకీయ లక్ష్యాలను సాధించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఉపయోగించిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకోవడానికి, నాయకులను బెదిరించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించిన సందర్భాలు అనేకం ఉన్నాయని, తద్వారా వారిలో కొందరిని బిజెపిలో చేర్చుకున్నారని ఆయన చెప్పారు. కేరళంలోని కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో విశ్లేషించుకోవాలని, అలాగే కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కూడా దీనిని పరిశీలించాలని ఆయన అన్నారు. 'నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ పరిధిలోని సంస్థలు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్న తీరుపై జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకత్వం వైఖరి ఏమిటి?' అని బేబీ ప్రశ్నించారు.

## ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ

# విద్యా వ్యవస్థలో అంతర్భాగం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీని ఒక ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా టీచర్ ట్రైనింగ్, అసెస్మెంట్, మెంటరింగ్, అటెండెన్స్, టెక్నాలజీతో సహా విద్యా వ్యవస్థలో ఒక అంతర్భాగంగా పరిగణించాలని తెలంగాణ విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణ అన్నారు. న్యూయార్క్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) 2026లో 'ప్రభుత్వ భాగస్వామ్యం, సంస్థాగత మార్పులు, విద్యా సంస్కరణలు' అనే అంశంపై నిర్వహించిన మినిస్టీరియల్ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో యోగితా రాణ స్పీకర్‌గా పాల్గొన్నారు. ఈ సెషన్‌లో భారత్, ఇథియోపియా, కెన్యా, రువాండా, కంబోడియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, విద్యావేత్తలతో పాటు గ్లోబల్ స్కూల్ ఫోరం సభ్యులు, రైసింగ్ అకాడమీస్, లుమినాస్ ఫండ్, యునైటెడ్ వరల్డ్ స్కూల్స్ వంటి సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా యోగితారాణ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడానికి తెలంగాణ అనుసరిస్తున్న నిరంతర మూల్యాంకన విధానాలు, క్లాస్‌రూమ్‌లెవల్ అసెస్మెంట్ విధానాన్ని, 1నుండి 5 తరగతుల విద్యార్థుల కోసం డైలీ రెమీడియేషన్ పీరియడ్‌తో అనుసంధానం చేసినట్లు వివరించారు.

# మాదకద్రవ్యాల కట్టడిలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

## ఏడు కీలక అంశాల్లో 80 శాతానికి పైగా మార్కులు..

## తెలంగాణ ఈగిల్ ఫోర్స్ ప్రతిభ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాదకద్రవ్యాల మహమ్మారిపై తెలంగాణ పోలీసు సాగిస్తున్న పోరాటానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నార్కోటిక్స్ బ్యూరో, ఈగిల్ ఫోర్స్ పనితీరుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి అంచనాలో ఏడు కీలక అంశాల్లో తెలంగాణ 80 శాతానికి పైగా మార్కులు సాధించింది. దీంతో దేశంలోని యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్‌ల పనితీరులో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. న్యూఢిల్లీలో మంగళవారం ప్రారంభమైన మూడో జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ అధిపతుల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా తెలంగాణ ఈగిల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య రాష్ట్ర పోలీసుల తరపున జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో జరుగుతున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**ఏడు అంశాల్లో ప్రతిభ :** దేశంలోని రాష్ట్రాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ల పనితీరును కేంద్ర ప్రభుత్వం ఏడు కీలక అంశాల ఆధారంగా అంచనా వేసింది. ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు, ప్రీకర్సర్ కెమికల్స్–సింథటిక్ డ్రగ్స్ నియంత్రణ, కేసుల దర్యాప్తు–ప్రాసిక్యూషన్, డ్రగ్స్ డిమాండ్–హాని నివారణ, అంతర్‌శాఖల సమన్వయం–సామర్థ్య పెంపు, పరిశోధన–విశ్లేషణ, పరిపాలన–లాజిస్టిక్స్ అంశాలను ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. ఈ అన్ని విభాగాల్లో తెలంగాణ 80 శాతానికి పైగా మార్కులు సాధించింది. డ్రగ్స్ కేసుల్లో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రంలో ప్రత్యేక వ్యవస్థలను కూడా బలోపేతం చేశారు. న్యాయపరమైన పరిశీలన, కోర్టు కేసుల విశ్లేషణ, సాక్షుల రక్షణ, ప్రాసిక్యూషన్‌కు అవసరమైన సహకారం అందించే విధంగా ప్రత్యేక మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈగిల్ ఫోర్స్‌తో పాటు జిల్లా పోలీసు యంత్రాంగం కూడా సమన్వయంతో పనిచేయాలని డిజిపి సి.వి. ఆనంద్ నిరంతరం ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లా పర్యటనలు, సమీక్షా సమావేశాల్లో డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై నిఘా, సమాచార సేకరణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చట్టపరమైన చర్యలు, కోర్టుల్లో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. ఈగిల్ ఫోర్స్, జిల్లా పోలీసు విభాగాలు సమన్వయంతో చేపట్టిన చర్యలు జాతీయ స్థాయి అంచనాలో తెలంగాణ మెరుగైన మార్కులు సాధించేందుకు దోహదపడ్డాయి. జాతీయ గుర్తింపు సాధించినందుకు ఈగిల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు అధికారులు, సిబ్బందిని సి.వి.ఆనంద్ అభినందించారు. సైబర్ క్రైమ్ తర్వాత యాంటీ నార్కోటిక్స్‌లోనూ అగ్రస్థానం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత కలిగిన రెండు విభాగాల్లో తెలంగాణ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ, పనితీరుతో పాటు యాంటీ నార్కోటిక్స్ చర్యల్లోనూ రాష్ట్ర పోలీస్ శాఖ అగ్రస్థాయి పనితీరును నమోదు చేసింది. ఇదే స్ఫూర్తితో ఇతర విభాగాల్లోనూ పనితీరును మెరుగుపరచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సి.వి. ఆనంద్ దిశానిర్దేశం చేస్తున్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/ఖానాపురం : ఖానాపురం మండలానికి చెందిన 11 మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెక్కులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేదింటి ఆడ బిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఓ వరం లాంటిదని అన్నారు. ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎఎంసి చైర్మన్, ఖానాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, పిఎసిఎస్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వల్లె శ్రీనివాస్ యాదవ్, బుధరావుపేట సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్ రెడ్డి, కొత్తూరు సర్పంచ్ జాటోత్ వినోద్ కుమార్, కీరియాతండా సర్పంచ్ బోడ విజయ రవి, ఖానాపురం తహసీల్దారు నంగునూరు రమేష్, టిపిసిసి జనరల్ సెక్రటరీ మోడెం ఎల్లాగౌడ్, మాజీ ఎంపిటిసి పూలుసింగ్, మంగళవారిపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించనున్న ఎమ్మెల్యే పల్లా




ప్రజాపక్షం/జనగామ : తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్‌లో జరుగుతున్న పరిణామాలపై నిజానిజాలు తెలుసుకునేందుకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాలు గురువారం పవర్ స్టేషన్‌ను సందర్శించనుండ గా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా సందర్శించనున్నారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌తో పాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. పవర్ స్టేషన్‌లో పరిస్థితుల్ని తెలుసుకోనున్నారు.

## కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించేలా చూడాలని మంత్రికి వినతి



ప్రజాపక్షం/జనగామ :కరెన్సీ నోటుపై అంబేద్కర్ ఫోటో ముద్రించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌ను కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాదన సమితి ఆధ్వర్యంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మ న్‌కుమార్ మాట్లాడుతూ కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించడం న్యాయమైన డిమాండ్ అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై దృష్టికి తీసుకెళ్తానని, అసెంబ్లీలో తీర్మాణం చేసేలా చూస్తానన్నారు. కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ అంబేద్కర్ లేకుంటే రిజర్వ్ బ్యాంక్ లేదన్నారు. 1921లో ఇంపీరియల్ బ్యాంక్ కుప్పకూలినప్పుడు రూపాయి దాని సమస్య పరిష్కారం అనే పుస్తకాన్ని రాసి హిల్టాన్ యాంగ్ కమిషన్, రాయల్ కమిషనర్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. దీని మూలంగానే 1935 ఎప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఏర్పడిందన్నారు. అందుకే కరెన్సీపై అంబేద్కర్ ఫోటో ముద్రించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యం మధుసూరారపు, పరీక్షన్, దాసరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మంత్రి పొన్నం పరామర్శ



ప్రజాపక్షం /ఎల్కతుర్తి : హుస్నాబాద్ నియోజకవర్గంలో రవాణా బిసి సంక్షేమ శాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పర్యటించా రు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండలంలో ఇ టీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.మండలంలోని చింతలపల్లి గ్రామంలో సుఖినె రాధమ్మ పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రాధమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చె ప్పారు.అదేవిధంగా దామెర గ్రామంలో ఇటీవ ల మృతి చెందిన కదం నాగయ్య చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాగయ్య కుటు ంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో మాజీ చై ర్మన్ గోలి రాజేశ్వరరావు, మాజీ పిసిసి స భ్యులు బొమ్మనపల్లె అశోక్ రెడ్డి, మండల అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ ముప్పు మహేందర్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షు డు పుల్లూరి శ్రీధర్ రావు, యూత్ కాంగ్రెస్ మా జీ మండల అధ్యక్షులు, హింగే శ్రీకాంత్, రాం సింగ్, కుడితాడి రమేష్, వినయ్, బొంకురి శ్రీ నివాస్, బొంకూరి క్రాంతి కుమార్, మద్ది రా ములు, కడారి రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నా యకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 600 మంది పోలీస్‌లతో నిమజ్జన బందోబస్తు

ప్రజాపక్షం/జనగామ టౌన్: గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా వెస్ట్ జోన్ పరిధిలో 600 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. లింగాలగఘనపురం మండలంలోని నెల్లుట్ల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. వరంగల్ సీపీ శ్వేతారెడ్డి ఆదేశాల మేరకు భద్రతా చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జనం ప్రశాంత వాతావణంలో నిర్వహించుకోవాలని సూచించారు.

# ఆరోగ్య పరిరక్షణలో 'ఆయుర్వేదం' కీలకపాత్ర

ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ఘనంగా 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం





ప్రజాపక్షం/భూపాలపల్లి : భారతదేశ ప్రాచీన వైద్య విజ్ఞానమైన ఆయుర్వేదం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ 50 పడకల ఆసుపత్రిలో బుధవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుష్ శాఖ డైరెక్టర్ ఐషా మసరత్ ఖానం, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై ధన్వంతరి భగవాన్‌కు పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆయుర్వేదం కేవలం వ్యాధులకు చికిత్స అందించడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, దినచర్య, ప్రకృతి ఆధారిత వైద్య విధానాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు అందుబాటులో ఉన్న ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వైద్య విభాగాలను పరిశీలించి ప్రజలకు అందుతున్న ఆయుష్ వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆయుష్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. 289 మందికి వైద్య సేవలు మెగా వైద్య శిబిరానికి మొత్తం 289 మంది హాజరై వైద్య సేవలు పొందారు. మధుమేహం, రక్తపోటు, అధిక బరువు, కీళ్ల సమస్యలు, చర్మ వ్యాధులు, జ్వరం, దగ్గు, జలుబు, అస్తమా, స్త్రీ సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలతో పాటు ఆయుష్ చికిత్సా విధానాలపై సూచనలు అందించారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, యోగా, దైనందిన జీవితం లో ఆయుర్వేద సూత్రాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

**ఆయుష్ సేవలను మరింత చేరువ చేస్తాం:** ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే మెగా వైద్య శిబిరం ప్రధాన ఉద్దేశమని ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ కె.రాఘవేందర్ రావు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భవిష్యత్తులోనూ వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం అనే సందేశంతో నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు, ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్, డిప్యూటీ నోడల్ అధికారులు డాక్టర్ మధుమిత, డాక్టర్ ప్రేమ్‌సాగర్, కన్వీనర్ డాక్టర్ బుసారా, వైద్యులు డాక్టర్ జగదీష్‌కన్నా, డాక్టర్ సాధానందం, డాక్టర్ గీత, డాక్టర్ అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ

మహిళా, రైతు సేవా సంఘాల ద్వారా డ్రిప్ అందించాలి ✻ జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ప్రజాపక్షం / జనగామ : అయిల్ పామ్ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలు, రైతు సేవా సంఘాల ద్వారా డ్రిప్ పరికరాలు విక్రహించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అయిల్ పామ్ సాగు విస్తరణపై బుధవారం ప్రత్యేక కార్యాచరణపై ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో 590 ఎకారల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దానిని మరింత విస్తరింజేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ 430 ఎకరాల వరకు సరఫరా చేసినట్లు అధికారులకు కలెక్టర్‌కు వివరించారు. మహిళా సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు డ్రిప్ పరికరాల విక్రయాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండిహెచ్ పథకం కింద సీడ్ ప్రాసెసింగ్ కార్యక్రమాలను మరింత విస్తరించాలని, టమోటా, బెండకాల, ఎర్ర మిరప పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాంట్రాక్ట్ ఫార్మింగ్ సప్లై చైన్‌పై అధ్యయనం చేసి రైతులకు ఉపయోగపడే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల సాగుపై శిక్షణ కార్యక్రమాలు నిర్వయించాలని, ఇందు కోసం 24 మహిళా సంఘాలను గురితచంఇ శిక్షణ, మార్కెటింగ్ అవకాశాలు కల్పించి ఉత్పత్తి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో వెదురు తోటల పెంపకానికి అనువైన భూముల గుర్తించాలని, అరటి తోటల సాగుకు రైతుల్ని ప్రత్సహించాన్నారు. ఈ సమీక్షలో డిహెచ్‌ఎస్‌ఓ నర్సయ్య, డిఆర్‌డిఓ భాస్కర్,ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

**విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట ఎంపిపిఎస్ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. ఈ పరిశీనలో ఎంఇఒ వెంకట్‌రెడ్డితో ఆపటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమృత ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమ్జద్‌కు సిపిఐ రాష్ట్ర నాయకుల పరామర్శ



ప్రజాపక్షం/ములుగు: సిపిఐ జిల్లా నాయకులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అమ్జద్ పాషాను సిపిఐ రాష్ట్ర నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల ములుగు జిల్లా కాసీందేవిపేట గ్రామానికి చెందిన ఎండి అమ్జద్ పాషా ఇద్దరు కుమార్తెలు తన పొలం వద్ద నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు స్థానిక జిల్లా సిపిఐ నాయకులతో కలిసి కాసీందేవిపేటకు వెళ్ళి అమ్జద్ పాషాను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని అమ్జద్ పాషా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తక్కళ్లపల్లి శ్రీనివాసరావు వెంట సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, ములుగు మండల కార్యదర్శి రాజు, వెంకటాపూర్ మండల కార్యదర్శి కొమురయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఇంజం కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల భవనంలేక ఇబ్బందులు



ప్రజాపక్షం/మంగపేట: ములుగు జిల్లా మం గపేట మండలంలోని నరసింహసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని శనగకుంట గ్రామంలో విద్యార్థులకు పాఠశాల భవనం కొరకు గ్రామ పెద్దలు మహిళలు యూత్ గ్రామస్తులు అం దరు కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రా మస్తులు మాట్లాడుతూ వలస వాదులపై ఉన్న ప్రేమ స్థానిక ఆదివాసులపై ఆదివాసి గుడెలపై గ్రామాలపై లేదా అంటూ మంత్రి సీతక్క పై ఆ వేదన వ్యక్తం చేస్తు మా గిరిజన గ్రామమైన శనగకుంట గ్రామంలో ప్రస్తుతం పాఠశాల భవనం లేక ఓకే గదిలో 45 మంది గిరిజన విద్యార్థులు కూర్చోవాలంటే నాన్న ఇబ్బందులు పడుతున్నా రు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు ఒకే గదిలో విద్యను బోధించాలంటే తీవ్ర ఇ బ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన తరగతి గదులు లేక వర్షాకాలంలో విద్యార్థులు చదువు కు ఆటంకం కలుగుతుంది. కావున మా నిరుపేద ఆదివాసి గిరిజన పిల్లలు విద్యకు దూరం కాకుండా సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు గిరిజన పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల భవనం మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే మంత్రి సీతక్కను కోరుతున్న గ్రామస్తులు అదే విధంగా ప్రస్తుతం పిల్లలు విద్యను అభ్యసించాలంటే తాత్కాలికంగా రేకుల షెడ్లు నిర్మించాలి .తోలేం వెంకన్న, ఎట్టి రవీందర్, తాటి నాగరాజు, తోలేం నరసింహారావు, పాఠశాల చైర్మన్ బొడ్డు సరిత, పెద్దల భరత్, తాటి సతీష్, పెద్దల కృష్ణ, బోధబోయిన నరేందర్, పెద్ది కుమారు, గుండెబోయిన బాలకృష్ణ, తోలేం చంటి, తాటి శ్రీకా ంత్, వాసం శ్రావణి, కొమరం శారద, పసుల రాము, మంకిడి నరేందర్, జనార్ధన్, నరేందర్, పెద్దల నరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ప్రక్రియ పరిశీలన

'కుడా' చైర్ పర్సన్ గుండు సుధారాణి



ప్రజాపక్షం/హనుమకొండ : వరంగల్‌లోని చిన్న వడ్డేపల్లి చెరువులో వినాయక నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత కొబ్బరికాయలు కొట్టి లాంఛనంగా ప్రారంభించారు.భక్తులు తీసుకువచ్చిన గణపతి విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు.క్రేన్ సహాయంతో కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, డిసిపికవిత చెరువులో ఏర్పాటు చేసిన నీటితెప్పలపై దిగి విగ్రహాలను స్వయంగా నిమజ్జనం చేయడంతో పాటు....నిమజ్జన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ... చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. చిన్న వడ్డేపల్లి చెరువుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2500 విగ్రహాలు నిమజ్జనానికి రానున్నాయని పేర్కొన్నారు. దీనితో పాటు కుడా పరిధిలో ఉన్న అన్నీ నిమజ్జన పాయింట్‌ల వద్ద అధికారులు తగు ఏర్పాట్లు చేసారన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణనాథుల విగ్రహాలను భక్తులు ప్రత్యేక పూజలు, భ జనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా చి న్న వడ్డేపల్లి చెరువు వద్దకు తీసుకురాగా క్రేన్ల సహాయంతో ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పల్లో చెరువు నీటిలో నిమజ్జనం చేశా రు. నిమజ్జన ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశు ద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో గణనాథుడి నిమజ్జన వేడుకలను నిర్వహించుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనం.. ఆయుర్వేద వైద్య విధానం

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి




ప్రజాపక్షం/హనుమకొండ : ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనం భారతీయ ఆయుర్వేద వైద్య విధానం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా హనుమకొండ టీచర్స్ కాలనీ ఫేజ్1లోని ప్రగతి మిత్ర కమ్యూనిటీ హాల్‌లో ఆయుర్వేద మెగా శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై ఆయుర్వేద మెగా క్యాంప్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. భారతీయ ఆయుర్వేద వైద్య విధానంలో అనేక వైద్య విధానాలు ప్రజల విశ్వాసాన్ని పొంది ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కరోనా విపత్కర పరిస్థితుల లో ఆయుర్వేదం యొక్క గొప్పదనం, విశిష్టత, మానవాళిని రక్షించడంలో ఆయుర్వేదం అందించిన సేవల గురించి వివరించారు.ఆయుర్వేద మెడికల్ క్యాంపులో సుమారు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆయుర్వేద మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయుష్ విభా గం ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ ప్రమీ లా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జిల్లా ఆయుష్ ఇంచార్జి డాక్టర్ ఎస్. మహేంద్ర కు మార్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ పి. వీరారెడ్డి, కాలనీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జయప్రకాశ్, డాక్టర్ అల్లం సర్వేశం, డాక్టర్ మాధవి, డాక్టర్ కుమార్, డాక్టర్ కోక్య, ఆయుష్ విభాగం ఫార్మసిస్టులు, యోగా ప్రచారకులు, ఎస్ఎన్ఒలు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు ప్రభు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 17 చెరువుల్లో 30 క్రేన్లు..రూ.2కోట్లతో సదుపాయాలు

145 మంది గజ ఈతగాళ్లు

డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధం



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జిడబ్ల్యూఎంసి) పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. నగరంలోని 17 చెరువుల్లో 30 క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు రూ.2 కోట్లతో ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, బల్దియా అధికారులు వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్నతో కలిసి ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభించారు. గురువారం సాయంత్రం వరకు సుమారు 8వేల విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భక్తులు వీలైనంత త్వరగా నిమజ్జనం పూర్తి చేసుకోవాలని చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. నీటి నిల్వ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 145 మంది గజ ఈతగాళ్లు, డిఆర్ఎఫ్ సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిమజ్జనం అనంతరం చెరువుల్లో మిగిలే విగ్రహాల అవశేషాలను తొలగించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు కోరారు. నిమజ్జన సమయంలో భక్తులు చెరువుల్లోకి దిగకుండా, అధికారులు, పోలీసులు సూచనలు పాటించాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి ధార కవిత, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అదనపు కమిషనర్ జోనా, బల్దియా అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, మత్స్య,మైనింగ్‌శాఖలఅధికారులుపాల్గొన్నారు.

## పిహెచ్‌సిల్లో సేవలపై నిర్లక్ష్యం వద్దు

గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

వ్యాక్సినేషన్ లక్ష్యాలు వేగంగా పూర్తి చేయాలి

నిమజ్జనోత్సవాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు :డిఎంహెచ్ఒ డాక్టర్ రవి రాథోడ్



ప్రజాపక్షం/గూడూరు;ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ బి రవి రాథోడ్ స్పష్టం చేశారు.బుధవారం ఆయన గంగారం గూడూరు మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పీహెచ్‌సీ) ఆకస్మీకంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆసుపత్రుల్లోని పలు విభాగాలను పరిశీలించిన ఆయన సిబ్బంది హాజరు పట్టికలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాల రికార్డులను క్షుణ్ణంగాతనిఖీ చేశారు.నిర్ణీత సమయంలోగా వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలని దిశానిర్ధేశం చేశారు. ముఖ్యంగా సున్నా నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ ప్రాణాంతక వ్యాధులు సోకకుండా సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఆదేశించారు .ప్రస్తుతం వర్షాకాలంలో నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పీహెచ్‌సీల్లో సరిపడా మందులు డయాగ్నస్టిక్ కిట్లు నిల్వ ఉంచుకోవాలన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

**నిమజ్జన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు**

వినాయక నిమజ్జనోత్సవాల వేళ భక్తులకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒ సూచించారు. ప్రధాన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అత్యవసర వైద్య సేవలు సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సిలు వైద్యాధికారి డాక్టర్ కిరణ్ డాక్టర్ పవన్ ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపక్షం
కరీంనగర్
గురువారం
24-09-2026
www.prajapaksham.in

రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న రామ్ 23 చిత్రం తాజాగా రెండ్ షెడ్యూల్ను పూర్తి చేసుకుంది. రామ్ పోతినేని తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ఈ సినిమాతో తన ప్రత్యేకమైన విజన్ను తెరపై ఆవిష్కరించనున్నారు.

రీల్



# టీచర్ ప్రేమ కథ 'సర్కారు బాయి'

శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. హీరోయిన్ వర్షిక పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. 'సర్కారు బాయి' సినిమాలో వర్షిక కల్పన టీచర్ పాత్రలో నటిస్తోంది. ఈ బర్త్ డే పోస్టర్ లో చీరకట్టులో ట్రెడిషనల్ లుక్ లో వర్షిక కనిపించి ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం 'సర్కారు బాయి' సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఇటీవలే చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి, పరిసర ప్రాంతాల్లో భారీ షెడ్యూల్ కంప్లీట్ చేశారు. మరోవైపు ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లాంటి ప్రధాన నటీనటులు పాల్గొన్న ఈ లెంగ్తీ షెడ్యూల్ లో చాలా వరకు సినిమా చిత్రీకరించారు. త్వరలోనే 'సర్కారు బాయి' సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీరామ్ నిమ్మల, వర్షిక, బాహుబలి ప్రభాకర్, వివ రెడ్డి, నాగ మహేష్, చలాకీ చంటి, నుపూర్ ముఖర్జీ, జ్యోతి, దేవరాజ్ పాలమూరు, మాధవి, కవిత, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ అమర్.జి, మ్యూజిక్ శివా.కె, ఎడిటర్ బి.యన్.రెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్: కె. మాధురి.

# డిజె టిల్లు లాగే 'అనుమాన పక్షి'

డిజె టిల్లు'తో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన విమల్ కృష్ణ.. మరో ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా.. హ్యూమర్, క్యారెక్టర్స్, కథనంలో పూర్తిగా డిఫరెంట్ గా ఉండబోతోంది. చిలక ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ చిలక, రాజేష్ జగ్తియాని, హిరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సెప్టెంబర్ 25న 'అనుమాన పక్షి' థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో రాగ్ మయూర్ మాట్లాడుతూ నటుడిగా ప్రతిక్షణం మెరుగవడానికి ప్రయత్నించాను. యాక్టింగ్ నా ఊపిరి. ఇప్పుడు 'అనుమాన పక్షి'తో హీరోగా వస్తున్నాను. ఇది నాకు చాలా ఆనందంగా ఉంది. డిజే టిల్లు పెద్ద హిట్ తర్వాత విమల్ కృష్ణ నాతో సినిమా చేయాలనుకున్నారు. డైరెక్టర్ విమల్ కృష్ణ ఈ కథ చెప్పినప్పుడు నాకు చాలా సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. ఎందుకంటే ఇలాంటి కథ ఎక్కడా లేదు. సెప్టెంబర్ 25న ఒక అద్భుతమైన సినిమా మీ ముందుకు రాబోతోంది అన్నారు. డైరెక్టర్ విమల్ కృష్ణ మాట్లాడుతూ 'డిజె టిల్లు' మీకు ఎలా సర్‌ప్రైజ్ చేసిందో, ఈ సినిమా కూడా మిమ్మల్ని 100% సర్‌ప్రైజ్ చేస్తుంది. ఈ జర్నీలో నాకు చాలా సపోర్ట్ చేసిన స్టేజ్ మీద ఉన్న అందరికీ థాంక్యూ. చోటా గారు ఎడిటింగ్కు వచ్చిన తర్వాత 'అనుమాన పక్షి' జర్నీ చాలా ఈజీ అయింది. శ్రీ చరణ్ మరోసారి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు అని చెప్పారు. హీరోయిన్ మెరీన్ మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ చరణ్ పాకాల, ప్రొడ్యూసర్ రాజీవ్ చిలక, ప్రొడ్యూసర్ మేఘా, ఎడిటర్ చోటా ప్రసాద్ పాల్గొన్నారు.



డైరెక్టర్ విమల్ కృష్ణ

# 'ఇంప్యూర్'లో ఏం జరిగింది?



వారాహి మల్లిపాముల, శ్రీదేవి మల్లిపాముల నిర్మించిన లేటెస్ట్ మూవీ ఇంప్యూర్. నిశాంతి ఇవని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయి కృష్ణ, యష్ను, అభిజిత్ ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకుంటుంది. ఈ ఈవెంట్లో ట్రైలర్‌తో పాటు పాటను కూడా లాంఛ్ చేశారు. ఈ ఈవెంట్‌గా స్పెషల్ గెస్ట్ డైరెక్టర్ నందిని రెడ్డి వచ్చారు. ఈ ఈవెంట్‌లో నందిని రెడ్డి మాట్లాడుతూ ఈ ఈవెంట్‌కు రావడానికి రెండే మెయిన్ రీజన్స్ ఉన్నాయి. ఒకటి మా బాస్ కృష్ణ వంశీ ఫోన్ చేసి చెప్పారు. ఆయన చెబితే కాదనడానికి లేదు. సెకండ్ డైరెక్టర్ నిశాంతి గురించి. నిశాంతి నాకు 15 ఏళ్లుగా తెలుసు. నాకు మంచి ఫ్రెండ్. రీసెంట్‌గా మా ఇంటి బంగారంలో కలిసి చేశాము. కానీ ఎడిటింగ్‌లో కట్ అయింది. సారి నిశాంతి మనం త్వరలోనే కలిసి పని చేద్దాం. శ్రీదేవి మీ అమ్మాయి డ్రీమ్ నెరవేర్చినందుకు నిజంగా మిమ్మల్ని అప్రిషియేట్ చేయాలి. పేరెంట్స్ ఎంకరేజ్ చేస్తేనే మనం ఏదైనా సాధించగలం. ఈ సినిమా మంచి హిట్టవ్వాలని, అందరికీ మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్ మాట్లాడుతూ డైరెక్టర్ నిశాంతి చేసిన కృషి, టాలెంట్‌ను వాళ్ల మదర్ ఎంకరేజ్ చేయడం నిజంగా గొప్ప విషయం. ఇంప్యూర్ సినిమా బ్రహ్మాండంగా ఆడాలి. బాగా డబ్బులు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నాడు. డైరెక్టర్ నిశాంతి మాట్లాడుతూ ఒక మనిషి ప్యూర్‌గా ఉండాలా? ఇంప్యూర్‌గా ఉండాలా? అనేది సొసైటీ డిసైడ్ చేస్తుంది. ఒక పెళ్లి క్యాన్సల్ అవడం వల్ల ముగ్గురి పరిస్థితి ఎలా మారింది అనేది ఈ సినిమా కథ. సంధ్య, ప్రణవ్, చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఈ ఈవెంట్‌కు స్పెషల్ గెస్ట్ వచ్చిన నందిని రెడ్డిగా చాలా థ్యాంక్యూ అని చెప్పారు. హీరో సాయికృష్ణ, హీరోయిన్ యష్ను, ప్రొడ్యూసర్ రామ్కీ పాల్గొన్నారు.

# 'పెద్దగట్టు జాతర' షూటింగ్ షురూ




ఆర్కే రెడ్డి ఫిలిమ్స్ ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కనున్న కొత్త చిత్రం 'పెద్దగట్టు జాతర' ఆషూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రంతో విరాన్ష్ హీరోగా అపరిచయమవుతున్నారు. ఎ. రామ కృష్ణ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విజయ్ కుమార్. సి.హెచ్ దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి హిట్ మెషీన్ అనిల్ రావిపూడి క్లాప్ కొట్టి సినిమా టైటిల్‌ను రివీల్ చేశారు. శివలెంక కృష్ణ ప్రసాద్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. దేవి శ్రీ గురూజీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. పలువురు సినీ ప్రముఖులు, యూనిట్ సభ్యులు ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ చిత్రంలో దేవి ప్రసాద్, మీనా కుమారి, సత్యకృష్ణ, సురేఖా వాణి, అజయ్ ఘోష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి నాగార్జున డిఒపి, గిరీష్ దేవాంగ్ ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. విరాన్ష్, దేవి ప్రసాద్, మీనా కుమారి, సత్యకృష్ణ, సురేఖా వాణి, ప్రభాకర్ (బాహుబలి), ధన్రాజ్, తాగుబోతు రమేష్, అజయ్ ఘోష్, నాగమహేష్, బలగం రమేష్, లౌక్య తదితరులు నటిస్తున్నారు.

# రామ్ సినిమా రెండో షెడ్యూల్ పూర్తి

రామ్ పోతినేని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న రామ్ 23 చిత్రం తాజాగా రెండ్ షెడ్యూల్ను పూర్తి చేసుకుంది. రామ్ పోతినేని తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్న ఈ సినిమాతో తన ప్రత్యేకమైన విజన్‌ను తెరపై ఆవిష్కరించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్ పోతినేనికి జోడీగా సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. తాజా షెడ్యూల్లో భాగంగా భారీ స్థాయిలో హైఇంటెన్సిటీ నైట్ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. ఏకంగా ఒక కిలోమీటర్ మేర విస్తరించిన భారీ స్ట్రెచ్‌లో ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించారు. ఆ మొత్తం ప్రాంతాన్ని లైట్స్‌తో నింపి, సినిమా ప్రత్యేకమైన నియోనోయిర్ వరల్డ్‌కు సరిగ్గా సరిపోయేలా అద్భుతమైన విజువల్ క్యాన్వాస్ను క్రియేట్ చేశారు. ఈ భారీ సెటప్‌నకు సంబంధించిన ఫ్లైట్ వ్యూ చూస్తేనే సీక్వెన్స్ను ఎంత గ్రాండ్‌గా మౌంట్ చేశారో అర్థమవుతోంది.యాక్షన్ కొరియోగ్రాఫర్ కెవిన్ మాస్టర్ ఈ ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేయగా, నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాటోగ్రాఫర్ తిరునావుక్కరసు (తిరు) ఈ విజువల్స్‌ను చిత్రీకరించారు. రామ్ పోతినేని ఊహించిన ప్రత్యేకమైన విజన్కు అనుగుణంగా సినిమాకు డిఫరెంట్ విజువల్ టెక్చర్‌ను అందిస్తున్నారు. సామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రానికి , నిర్మాత: కృష్ణ పోతినేని, డిఒపి: తిరునావుక్కరసు, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్.



# ఈగల్ ఫోర్స్‌కు సిఎం అభినందనలు






ప్రజాపక్షం/హైదరాబాద్: మాదకద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన తెలంగాణ ఈగల్ ఫోర్స్‌కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఈగల్ ఫోర్స్ సాధించిన జాతీయ స్థాయి గుర్తింపు నిదర్శనమని సిఎం పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ (ఎఎన్‌టిఎఫ్) 3వ జాతీయ సదస్సులో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య అత్యుత్తమ అవార్డును అందుకోవడం రాష్ట్ర పోలీసు శాఖకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ అనుసరిస్తున్న సమర్థవంతమైన విధానాలకు ఈ జాతీయ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్' వేదికగా సిఎం రేవంత్ రెడ్డి ఒక ట్వీట్ చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టడం కేవలం పోలీసు వ్యవస్థ బాధ్యత మాత్రమే కాదని, యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం ప్రతి కుటుంబం, ప్రతి పాఠశాల, ప్రతి సంస్థ, ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత అని సిఎం పేర్కొన్నారు. మాదకద్రవ్యాలపై పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తూ, యువతను చైతన్యపరచడం, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపడం, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం ద్వారా సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం స్పష్టం చేశారు. 'నషా ముక్త భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడాలి. 2029 డిసెంబర్ నాటికి డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే దిశగా ఈగల్ ఫోర్స్ మరింత దృఢ సంకల్పంతో పనిచేయాలి' అని సిఎం తెలిపారు. యువతే రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు అని, మాదకద్రవ్యాల ప్రభావం నుంచి యువతను రక్షించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని సిఎం పిలుపునిచ్చారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, డ్రగ్స్ విక్రయం, వినియోగంపై సమాచారాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

# రాష్ట్రంలో రెడ్ అలర్ట్

## కలెక్టర్లు మరింత అప్రమత్తం
## మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించే విధంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగ, కార్మిక పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

## జలమండలి కార్మికులకు అండగా ప్రభుత్వం: మధు యాష్కీ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక పక్షపాతిగా పనిచేస్తోందని అల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ అన్నారు. కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గోషామహల్‌లో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయాన్ని బుధవారం యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌రెడ్డితో కలిసి మధు యాష్కీ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది కార్మికులకు కనీస వేతనాల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. జలమండలి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తోందన్నారు. త్వరలో జరగనున్న ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న తెలంగాణ ఆర్‌టిసి వర్కర్స్ యూనియన్‌ను గెలిపించాలని మధు యాష్కీ గౌడ్ కోరారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలిలో ఇంకా పరిష్కరించాల్సిన రెండు, మూడు సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, వాటిని త్వరలో పరిష్కరిస్తుందని తెలిపారు. యూనియన్‌కు గుర్తింపు ధ్రువీకరణ పత్రం అందజేయడంతో పాటు కార్యాలయాన్ని కేటాయించిన జలమండలి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఇ. అశ్వత్థామరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.టి.రాఘవేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌లు అల్లి శ్రవణ్‌కుమార్, ఎం.డి.జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యతేజకు మహేష్‌కుమార్‌గౌడ్ సన్మానం

## అంతర్జాతీయ కరాటేలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారిణి



ప్రజాపక్షం/హైదరాబాద్: జోర్డాన్ అమ్మాన్‌లో జరిగిన ఏకేఎఫ్ 24వ జూనియర్, యూ21 కరాటే ఛాంపియన్‌షిప్–2026లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి బ్రహ్మదండి సత్యతేజను టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 66 కేజీల వ్యక్తిగత కుమిటే విభాగంలో సత్యతేజ కాంస్య పతకం సాధించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ నుంచి పతకం సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రోత్సహిస్తోందని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సత్యతేజ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇండియా కోచ్ కీర్తన్ కొండూరు, స్టేట్ జనరల్ సెక్రటరీ రామస్వామి తదితరులు సత్యతేజను అభినందించారు.

# ఆయకట్టుకు నీటి విడుదల

(మొదటి పేజీ తరువాయి)

గాను సాగునీటిని వృథా చేయకుండా పండించుకోవాలని ఆయన కోరారు. ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతలు చేసి రైతులను మభ్యపెట్టి తప్పుదోవ పట్టించేందుకు అనేక ప్రయత్నాలు చేశారని ఆ పార్టీల మాటలను నమ్మకండని కోరారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు టి.రవికాంత్, నాయకులు జింక రవి, చుక్క ఆసి రెడ్డి, వెంకట్ రెడ్డి, గణేష్ గౌడ్, శ్రీధర్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటకే

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసెస్'ను ప్రారంభించింది. సాంకేతికతను పాలనతో అనుసంధానించి తెలంగాణను డిజిటల్ గవర్నెన్స్‌లో దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో బుధవారం 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామని చెప్పారు. పరిపాలనకు సాంకేతికతను జోడించడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు.

**1100కు ఫోన్ చేస్తే.. ఇంటికే సేవలు**

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంలో భాగంగానే డోర్ డెలివరీ సేవలను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. పౌరులు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయడం లేదా మీ సేవా పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవడం ద్వారా ఈ సేవలను పొందవచ్చన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అనంతరం మీ సేవా సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి సేవలను అందిస్తారని తెలిపారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఇసి) కాపీలు, పోలీసు శాఖకు సంబంధించిన సేవలు, ఐజిఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర సేవలు ఈ విధానం ద్వారా అందుబాటులోకి వస్తాయని వివరించారు.

**తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో..**

డోర్ డెలివరీ సేవల కోసం ఇప్పటికే 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, విఎల్‌ఇలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను అమలు చేస్తున్నామని, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామని చెప్పారు. ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు కార్యాలయాల వద్దకు వెళ్లే పరిస్థితిని తగ్గిస్తూ, ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటిఇ అండ్‌సి సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవికిరణ్, టిజిటిఎస్ ఎండి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిఎలకే సుముఖత

(మొదటి పేజీ తరువాయి)

పెన్షనర్ కార్మిక సమస్యల పరిష్కారం కోసంతాము ప్రతిపాదించిన నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్,సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు ప్రకటించారు. తమ తదుపరి కార్యాచరణ అంశంపైన చర్చించేందుకు గురువారం టిజి ఇ జెఎసి ఆధ్వర్యంలో అన్ని అనుబంధ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి అత్యవసర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దసరాకు ఒక డిఎ, ఉగాదికి మరో డిఎ ఇస్తామని, ఈ రెండు డిఎలను కూడా మంత్రివర్గానికి ప్రతిపాదిస్తామనిమాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేసినట్టు తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులపైన కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. పిఆర్‌సి నివేదిక ఒకటి లేదా రెండు నెలల్లో వచ్చే అవకాశం ఉందని, అనంతరం రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం దాట వేసే ప్రయత్నం చేసిందని ఏలూరి శ్రీనివాస రావు తెలిపారు. సిపిఎస్ అంశంపైన కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ, ఆ కమిటీ ఏర్పాటుకు లేదా నివేదికకు ఎలాంటి కాలపరితి లేదన్నారు. ప్రభుత్వ ప్రతిపాదనలు ఉద్యోగులకు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు,కె. గౌతమ్ కుమార్,ప్రధాన కార్యదర్శిఎల్. రమన్ రెడ్డి, తెలిపారు

ప్రభుత్వం రెండు డిఏలకు అంగీకరించింది: లచ్చిరెడ్డి

ప్రభుత్వం రెండు డిఎలను ఇచ్చేందుకు అంగీకరించిందని, మూడో డిఎను మరో నాలుగు నెలల వరకు ఇస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని తెలంగాణ ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి , సెక్రెటజరీ జనరల్ రాజశేఖర్ వెల్లడించారు. సచివాలయ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సకల జనుల సమ్మె చేపట్టిన ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఒకట తేదీన వేతనం చెల్లించాలని, పెండింగ్ డిలను సాధించే పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పోరాటంతో ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానిహామీనిచ్చిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com